శనివారం
19•08•2017
హైదరాబాద్
•వెల.5 రూ.
•సంపుటి 7 •సంచిక 73
•పేజీలు : 18 + 24

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE



PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

ఉజ్వల తెలంగాణ

అవినీతిరహిత పారిశ్రామికం

దేశంలో రెండోస్థానం సాధించిన తెలంగాణ ▪ ఎన్సీఏఈఆర్ సర్వేలో వెల్లడి ▪ గుజరాత్ తరువాత మనమే ..

పారిశ్రామిక అనుకూలతలో ఐదోస్థానం ▪ అనుమతులు, భూములు, కార్మికుల లభ్యతలో ముందంజ

విద్యుత్, రాజకీయ స్థిరత్వంలో భేష్ ▪ ఫలిస్తున్న సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కృషి ▪ గతేడాదితో పోలిస్తే గణనీయ అభివృద్ధి

21 రాష్ట్రాల్లో సర్వే
1030 మంది పారిశ్రామికవేత్తల అభిప్రాయం

అవినీతిరహిత అనుమతుల్లో.. 2వ స్థానం | భూముల అందుబాటులో 2వ స్థానం | నైపుణ్య కార్మికుల లభ్యతలో 3వ స్థానం | రాజకీయ స్థిరత్వంలో 100% | విద్యుత్ సరఫరాలో 5వ స్థానం

ఆర్థిక సౌష్ఠవంలో 6వ స్థానం

మౌలిక సదుపాయాల్లో 16వ స్థానం

ర్యాంకింగ్‌కు 6 అంశాలు
భూమి, కూలీలు- కార్మికులు, మౌలిక సదుపాయాలు, వాణిజ్య వాతావరణం, ఆర్థిక వ్యవస్థ, పరిపాలన - రాజకీయ స్థిరత్వం.

తనను తాను పునర్నిర్మించుకుంటున్న తెలంగాణ.. పారిశ్రామికపథంలో దూసుకుపోతున్నది. ఫోక్స్ వ్యాగన్ వంటి పరిశ్రమలను పారదోలిన సమైక్య రాష్ట్రపు దుష్ట విధానాలకు చరమగీతం పాడి అవినీతిరహిత పారిశ్రామిక దృశ్యాన్ని ఆవిష్కరిస్తున్నది. కేవలం మూడేండ్ల పసికూన ఇవాళ అవినీతిలేని అనుమతుల విధానంలో దేశంలోనే రెండోస్థానంలో నిలిచింది. పరిశ్రమలకు అనువైన వాతావరణం కలిగిన రాష్ట్రాల్లో ఐదో స్థానాన్ని సాధించింది. దార్శనికుడైన ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపు, నిరంతర శ్రమతో ఇది సాధ్యపడింది. దేశదేశాల పారిశ్రామిక విధానాలను జల్లెడ పట్టి ఆయన రూపొందించిన టీఎస్ఐపాస్ విధానం ఉజ్వల తెలంగాణ సాధనకు భరోసా ఇస్తున్నది.



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పరిశ్రమలస్థాపనలో అవినీతి జాడ్యంలేని రాష్ట్రాల్లో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో అమలులోకి వచ్చిన టీఎస్ఐపాస్, ఆన్‌లైన్ అనుమతుల వంటి విధానాల వల్ల ఇది సాధ్యపడింది. దేశవ్యాప్తంగా పరిశ్రమల స్థాపనకు అనువైన రాష్ట్రాల్లో తెలంగాణ ఐదో స్థానం సాధించింది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనమిక్ రీసెర్చ్(ఎన్సీఏఈఆర్) గత జూలైలో రూపొందించిన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ పొటెన్షియల్ ఇండెక్స్‌లో ఈ విషయం వెల్లడైంది. పరిశ్రమలస్థాపనలో కీలకపాత్ర పోషించే భూముల లభ్యత, విద్యుత్తు, అనుమతుల్లో పారదర్శకత, ముడిసరుకు, శాంతి భద్రతలు తదితర అంశాలపై ఈ సర్వే నిర్వహించారు. పరిశ్రమల స్థాపనలో తెలంగాణలో అవినీతి కనిష్ఠ స్థాయికి వచ్చిందని సర్వేలో తేలింది. ఈ విషయంలో దేశంలో గుజరాత్ ప్రథమ స్థానంలో ఉండగా ఆ తరువాత స్థానాన్ని తెలంగాణ రాష్ట్రం సాధించింది. ఇదే అంశంలో 2016లో సర్వే జరిపినపుడు అవినీతి సమస్య ఉందని 26.5శాతం పారిశ్రామికవేత్తలు చెప్పారు. 2017లో నిర్వహించిన సర్వేలో కేవలం 5.6శాతం మంది మాత్రమే అవినీతి ఉందని వెల్లడించారు. మరోవైపు మౌలిక సదుపాయాల కల్పనలో కూడా తెలంగాణ శరవేగంగా ముందుకు సాగుతున్నది. గత సంవత్సరం ఇదే సంస్థ నిర్వహించిన సర్వేలో రాష్ట్రం 13వ స్థానంలో ఉంటే ఈ సంవత్సరం

మిగతా 2వ పేజీలో

రిజిస్ట్రేషన్ రోజే మ్యుటేషన్

- గ్రామం యూనిట్‌గా సమగ్ర సర్వే
- రైతుకు పెట్టుబడి పక్కాగా అందించేందుకే
- కేంద్ర బృందానికి వివరించిన సీఎం కేసీఆర్
- ఇది విప్లవాత్మక చర్య.. పూర్తి సహకారం అందిస్తాం
- కేంద్ర సంయుక్త కార్యదర్శి హుకుమ్‌సింగ్ మీనా హామీ
- భూ సర్వేపై 20న విస్తృతస్థాయి సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో ఏ భూమి ఎవరి ఆధీనంలో ఉన్నదో తెలుసుకునేందుకు సమగ్ర భూ సర్వే చేస్తున్నామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కేంద్ర ప్రభుత్వ అధికారులకు చెప్పారు. రికార్డులన్నీ సరిచేసిన తర్వాత కొత్త పాసుపుస్తకాలు ఇవ్వబోతున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలోనూ పారదర్శక విధానాన్ని తీసుకువస్తున్నామని, రిజిస్టర్ అయిన రోజే మ్యుటేషన్ చేసేలా అధికారులకు ఆదేశాలు జారీచేశామని వివరించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూ వనరులశాఖ సంయుక్త కార్యదర్శి హుకుమ్‌సింగ్ మీనా తన బృందంలోని అధికారులతో కలిసి శుక్రవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సమావేశమై, రాష్ట్రంలో చేపట్టిన సమగ్ర భూ సర్వేపై చర్చించారు. ఇందుకు సంబంధించిన వివరాలను కేంద్ర అధికారులకు ముఖ్యమంత్రి తెలియజేశారు. త్వరలోనే పూర్తిస్థాయిలో ప్రాజెక్టు రిపోర్టు తయారుచేసి కేంద్రానికి పంపుతామన్నారు. ఈ నెల 20న సమగ్ర భూసర్వేపై విస్తృతస్థాయి సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. సమగ్ర భూ సర్వే చేయాల్సిన ఆవశ్యకతను కేంద్ర బృందానికి సీఎం కేసీఆర్ వివరించారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సంస్కరణలు తెస్తున్నాం

'1932-36 మధ్య నిజాం హయాంలో భూ సర్వే చేపట్టారు. తర్వాత మళ్లీ ఎప్పుడూ సర్వే నిర్వహించలేదు. భూమి వివరాలు సరిగ్గా లేకపోవడంవల్ల అనేక అనర్థాలు, వివాదాలు తలెత్తుతున్నాయి. ఏ భూమి ఎవరి యాజమాన్యంలో ఉందనే విషయంలో గొడవలు జరుగుతున్నాయి. అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వం దేశంలో మరెక్కడా లేనివిధంగా ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.8 వేల చొప్పున పెట్టుబడి అందించే కార్యక్రమం తీసుకున్నది. రైతులకు పెట్టుబడి పథకం సరిగ్గా అమలుకావాలంటే, ఏ భూమి ఎవరి ఆధీనంలో ఉందో తెలియాలి. కాబట్టే భూ సర్వే చేస్తున్నాం. రాష్ట్రంలోని 10,875 రెవెన్యూ గ్రామాల పరిధిలో

మిగతా 3వ పేజీలో



శుక్రవారం సిద్దిపేటలో డయాలిసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, లక్ష్మారెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామలింగారెడ్డి తదితరులు

పేదలకు ఉచితంగా డయాలిసిస్

39 సర్కారు దవాఖానల్లో 73 యూనిట్లు
ఈ నెలలో పూర్తిచేసేందుకు వైద్యశాఖ చర్యలు
సిద్దిపేటలో తొలి యూనిట్ ప్రారంభించిన మంత్రులు హరీశ్‌రావు, లక్ష్మారెడ్డి
కిడ్నీ రోగులకు తప్పనున్న దూరాభారాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కిడ్నీ సమస్యలతో డయాలిసిస్ చేయించుకునేందుకు దూరప్రాంతాలకు వెళ్లే అవస్థను వైద్య, ఆరోగ్యశాఖ తప్పిస్తున్నది. నిరుపేద కుటుంబాలకు చెందిన కిడ్నీ బాధితులకు సర్కారు దవాఖానల్లో ఉచితంగా డయాలిసిస్ సేవలను అందించేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే రాష్ట్రంలోని 39 సర్కారు దవాఖానల్లో 73 డయాలిసిస్ యూనిట్లను ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఇందులో మొదటి కేంద్రాన్ని శుక్రవారం సిద్దిపేటలో మంత్రులు హరీశ్‌రావు,

మిగతా 6వ పేజీలో

అభివృద్ధి పాఠాలు చెప్తున్నాం

మన పథకాలకు సర్వత్రా ప్రశంసలు

అధ్యయనానికి ఇతర రాష్ట్రాల ప్రతినిధులు ▪ వ్యవసాయాన్ని పండుగ చేస్తున్న కేసీఆర్ ▪ కాంగ్రెస్ నాయకులకు అభివృద్ధి సోయి లేదు

సిరిసిల్లకు వ్యవసాయ కళాశాల మంజూరు ▪ అపారెల్ పార్కుకు త్వరలో సీఎంతో శంకుస్థాపన

మున్సిపల్, ఐటీశాఖల మంత్రి కేటీఆర్ ప్రకటన ▪ రైతులు ఉద్యానపంటల మీద దృష్టి పెట్టాలి: మంత్రి పోచారం

సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

వ్యవసాయ రుణమాఫీ, 24 గంటల ఉచిత కరెంటు, కుల వృత్తులకు పునరుజ్జీవం వంటి పథకాలతో తెలంగాణ రాష్ట్రం దేశానికి కొత్త పాఠాలు నేర్పిస్తున్నదని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. రైతులకు ఎకరానికి రూ. 8వేలు పెట్టుబడి ఇచ్చే విషయం తెలుసుకొని ఇదెలా సాధ్యమంటూ సాక్షాత్తూ కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆశ్చర్యపోయారని చెప్పారు. రైతురుణమాఫీ ఎలా అమలు చేయాలో తెలుసుకురమ్మని పంజాబ్ ముఖ్యమంత్రి తన అధికారులను తెలంగాణకు పంపించారని తెలిపారు. వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఇందులో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీలో పరిశోధనలకు ఊతమిచ్చే దిశగా సిరిసిల్లలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేసిందని చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో రూ.9.60 కోట్లతో నిర్మించిన వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, రూ. 3 కోట్లతో నిర్మించిన వ్యవసాయశాఖ గోదాములను వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగిస్తూ సిరిసిల్లకు వ్యవసాయ కళాశాలను కూడా మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో సీఎం చేతుల మీదుగా సిరిసిల్లలో అపారెల్ పార్కుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

వ్యవసాయాన్ని పండుగ చేస్తున్నాం..

శాసనసభ వేదికగా ఆనాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ వస్తే కరెంటు లేక చీకటి రాజ్యమవుతుందని, వ్యవసాయం దెబ్బతింటుందని, పరిశ్రమలు తరలిపోతాయని భయపెట్టారని, కానీ అతి తక్కువ కాలంలోనే కోతలేని కరెంటు అందించి మన సమర్థతను రుజువు చేసుకున్నామని కేటీఆర్ అన్నారు. ఇన్నాళ్లు కరెంటు కోసం ధర్నాలు చేసిన రైతులు, ఇవాళ 24 గంటల కరెంటు ఇస్తామన్నా వద్దంటున్న పరిస్థితి వచ్చిందంటే.. అది సీఎం కేసీఆర్ కార్యదక్షత వల్లనేనని అన్నారు. వ్యవసాయం దండుగ అన్నవాళ్ల నోళ్లు మూయించి, వ్యవసాయం పండుగ అని

మిగతా 6వ పేజీలో



సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్



త్వరలో కొత్త రూ.50 నోటు

18

సింగరేణి ఔట్‌సోర్సింగ్ కార్మికుల జీతాల పెంపు

- నైపుణ్యంలేని కార్మికులకు రోజుకు రూ.313 నుంచి 350కి
- ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు రూ.330 నుంచి 494కు పెరుగుదల
- 14,921 మంది కార్మికులకు లబ్ధి
- మహిళా ఉద్యోగుల మెటర్నిటీ సెలవులు ఇకపై 26 వారాలు
- ఉత్తర్వులు జారీచేసిన యాజమాన్యం
- హర్షం వ్యక్తంచేస్తున్న సింగరేణి కార్మికులు, ఉద్యోగులు

3

శరవేగంగా కొలువుల భర్తీ



- సీఎం కేసీఆర్ ప్రకటనకు అనుగుణంగా ఏర్పాట్లు
- అతి త్వరలోనే నోటిఫికేషన్లు..
- అన్నీ కుదిరితే ఆరునెలల్లోనే ఫలితాలు
- కొన్ని శాఖల్లో వివరాల జాప్యం తొలిగితే త్వరితగతిన ప్రకటనలు
- కోర్టు కేసులపై ప్రత్యేకచర్యలు
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి

3

నేతన్నలకు అండదండలు

రాష్ట్ర టెక్స్‌టైల్ పాలసీ విడుదల
జౌళి, అపారెల్ రంగాలకు భారీ రాయితీలు
ఐదు క్యాటగిరీలుగా కంపెనీలు
వ్యాట్, సీఎస్టీ, ఎస్‌జీఎస్టీలపై రాయితీ
ఐదు సంవత్సరాలపాటు అమలు

7

లోకం పోకడ



ముహూర్తం


సూర్యోదయం: 6.03 గంటలకు


సూర్యాస్తమయం: 6.36 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, ద్వాదశి ఉదయం 7.20 వరకు, తదుపరి త్రయోదశి. నక్షత్రం: పునర్వసు రాత్రి 7.10 వరకు, తదుపరి పుష్యమి. అమృత ఘడియలు: సాయంత్రం 4.57 నుంచి 6.33 వరకు, రాహుకాలం: ఉదయం 9.11 నుంచి 10.45 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.03 నుంచి 7.44 వరకు, వర్జ్యం: ఉదయం 8.07 నుంచి ఉదయం 9.43 వరకు.

వెబ్‌సైట్‌లో డిప్యూటీ సర్వేయర్ల హాల్‌టికెట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డిప్యూటీ సర్వేయర్ల పరీక్ష హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు టీఎస్‌పీఎస్సీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ఆదివారం జరిగే పరీక్ష కోసం అభ్యర్థులు www.tspsc.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు చేసుకోవాలని పేర్కొన్నది. సర్వే సెటిల్‌మెంట్ అండ్ లాండ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్‌లో సర్వేయర్ పోస్టుల భర్తీ కోసం టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసిన సంగతి తెలిసిందే.

నేడు పీజీటీ, టీజీటీ పరీక్షల ప్రిలిమినరీ కీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పీజీటీ (మ్యాథ్స్, బయాలజీ, ఫిజికల్ సైన్స్, సోషల్), టీజీటీ (మ్యాథ్స్, బయాలజీ) పరీక్షల ప్రిలిమినరీ కీని శనివారం టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్టు కమిషన్ సెక్రటరీ పేర్కొన్నారు. ప్రిలిమినరీ కీ పై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21 నుంచి 27వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా తెలుపాలని కోరారు. అభ్యంతరాలు తెలిపేందుకు వెబ్‌సైట్‌లో ప్రత్యేకంగా లింక్ ఉందని తెలిపారు. నేరుగా అభ్యంతరాలు స్వీకరించరన్నారు. వివరాల కోసం www.tspsc.gov.in వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

కేబీఆర్ పార్క్ ఎకో సెన్సిటివ్ జోన్ ఖరారు

మూడు నుంచి 28 మీటర్ల వరకు సున్నిత ప్రాంతం

త్వరలో డ్రాఫ్టు నోటిఫికేషన్ విడుదల

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని కేబీఆర్ జాతీయ పార్క్ చుట్టూ ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిని రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. మూడు నుంచి 28 మీటర్ల వరకు ఎకో సెన్సిటివ్ జోన్‌గా పరిగణించాలని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖకు రాష్ట్ర ప్రభుత్వం నివేదిక పంపించగా.. కేంద్రం నుంచి సానుకూల స్పందన వచ్చింది. ఈ అంశంపై త్వరలో డ్రాఫ్టు నోటిఫికేషన్ జారీ అవుతుందని అధికారవర్గాల సమాచారం. ప్రస్తుతం పార్క్ చుట్టూ మూడు నుంచి 35 మీటర్ల వరకు సెన్సిటివ్ జోన్ ఉంది. ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న పార్క్ ప్రాంతంలో మూడు మీటర్ల కంటే వెడల్పు ఎక్కువగా ఉన్న ప్రాంతాన్ని సెన్సిటివ్ జోన్‌గా పరిగణిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలకు అనుమతినివ్వరు. కానీ ట్రాఫిక్ రద్దీని నియంత్రించడానికి జీహెచ్‌ఎంసీ స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లో (ఎస్సార్డీపీ) భాగంగా పార్క్ చుట్టూ ఆరుచోట్ల మల్టీలెవల్ ఫ్లై ఓవర్లను నిర్మించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పార్క్ చుట్టూ కొన్ని ప్రాంతాల్లో చెట్లను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై కొందరు గ్రీన్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేశారు. తాము పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించడంలేదని, తొలగించిన చెట్లను ట్రాన్స్‌లోకేట్ చేస్తున్నామని ప్రభుత్వం ట్రిబ్యునల్‌కు తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ వాదనతో ఏకీభవించిన గ్రీన్ ట్రిబ్యునల్ ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిని మరోసారి సవరించి కేంద్ర పర్యావరణమంత్రిత్వశాఖ అనుమతి తీసుకోవచ్చని సూచించింది. మొదట ఆరుచోట్ల మల్టీలెవల్ ఫ్లై ఓవర్లను నిర్మించాలని భావించినప్పటికీ తర్వాత దానిని నాలుగుచోట్లకు కుదించారు. సెన్సిటివ్ జోన్ పరిధిలోకి వెళ్లకుండా రోడ్డుకు సమాంతరంగా ఫ్లై ఓవర్‌లను నిర్మించనున్నారు. సెన్సిటివ్ జోన్‌ను కుదించడానికి అవకాశమున్నా పర్యావరణహితంగానే వంతెనలను నిర్మించాలని అధికారులు నిర్ణయించారు.

ఉజ్వల తెలంగాణ

మొదటిపేజీ తరువాయి...

ఐదో స్థానానికి ఎదిగింది.

పరిశీలనాంశాలు ఇవి..

పరిశ్రమలు, పెట్టుబడులకు అవసరమైన ఆరు అంశాలను పరిగణనలోకి తీసుకొని ర్యాకింగ్స్ ఇచ్చారు. ఇందులో భూమి, కార్మికులు, మౌలిక సదుపాయాలు, వాణిజ్య వాతావరణం, పరిపాలన- రాజకీయ స్థిరత్వం, ఆర్థిక వ్యవస్థ తీరు ఉన్నాయి. భూమి, కార్మికుల లభ్యతలో తెలంగాణ ముందంజలో ఉంది. వాణిజ్య వాతావరణంలో పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూరగొంది. నైపుణ్య కార్మికుల లభ్యత, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో డీఐపీపీ ర్యాంకు , భూ సేకరణలో చొరవ తెలంగాణకు సానుకూల అంశాలుగా నిలిచాయి. ఈ అంశాల్లో గత సంవత్సరం 13 ర్యాంకులో ఉన్న రాష్ట్రం ఈసారి ఐదో ర్యాంకుకు వచ్చింది. మొత్తం 21రాష్ట్రాల్లో ఈ సర్వేలో నిర్వహించారు.

గణనీయంగా తగ్గిన అవినీతి..

రాష్ట్రంలో అవినీతిని పూర్తి స్థాయిలో తగ్గించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని ఎన్సీఈఏఆర్ వెల్లడించింది. 2016తో పోలిస్తే ఈసారి అవినీతి గణనీయంగా తగ్గింది. గత సంవత్సరం అవినీతి తీవ్రంగా ఉందని 26 శాతం పారిశ్రామికవేత్తలు చెప్పగా ఈసారి ఆ సంఖ్య 5.6శాతానికి తగ్గింది. తెలంగాణ తరువాతి స్థానంలో హిమాచల్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లు 13.3శాతంతో మూడో స్థానంలో ఉన్నాయి. కాగా తెలంగాణలో ఓ మోస్తరు అవినీతి ఉందని గత సంవత్సరం 61.8 శాతం మంది చెప్తే ఈ సంవత్సరం 47 శాతం మంది చెప్పారు. రాబోయే రోజుల్లో ఇంకా అవినీతి పూర్తిగా కనిష్ఠ స్థాయికి చేరే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పరిశ్రమలకు స్థాపనకు అవసరమైన అనుమతులు, రాయితీలు, ప్రోత్సాహకాలన్నీ ఆన్‌లైన్‌లో పొందే ఏర్పాట్లు చేస్తున్నారు. ఏ పారిశ్రామికవేత్త కూడా పరిశ్రమలశాఖ కార్యాలయాలకు వెళ్లే అవసరం లేకుండా అన్నీ ఆన్‌లైన్లో లభించే విధంగా సంస్కరణలు తీసుకొస్తున్నారు. 58 రకాల అనుమతులను ఆన్‌లైన్‌లో ఇచ్చే ఏర్పాట్లు పూర్తయ్యాయి.

అవినీతి ఎలా ఉంది?

	సమస్య లేదు	ఓ మోస్తరు	తీవ్రంగా ఉంది
2016	11.8	61.8	26.5
2017	47.2	47.2	5.6

కరెంటుకు 87శాతం ఓటు..

పరిశ్రమలకు విద్యుత్ సరఫరా భేషుగ్గా ఉందని 87 శాతం పారిశ్రామికవేత్తలు వెల్లడించారు. పరిశ్రమలకు అనువైన విద్యుత్ సరఫరా చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఐదో స్థానంలో ఉంది. కొత్తగా ఏర్పడిన రాష్ట్రాల్లో మాత్రం ఒక్క తెలంగాణకే ఈ ఘనత దక్కింది. విద్యుత్ సరఫరాపై సర్వేలో పాల్గొన్నవారిలో 95 శాతం మంది సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలపైన 66 శాతం పరిశ్రమల వర్గాలు తమ సంతృప్తిని వ్యక్తం చేశారు.



ఫలిస్తున్న సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కృషి

ఫలిస్తున్న సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కృషి..

ఒకనాడు పరిశ్రమలకు అనుమతులు కావాలంటే కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలాతిరగటమే అనే పరిస్థితి ఉండేది. ఉద్యోగుల అవినీతి, అనుమతుల్లో జాప్యంతో విసిగిపోయి పక్కరాష్ట్రాలకు పరిశ్రమలు తరలిపోయిన వైనాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో వాటన్నింటికి స్వస్తి పలికి పారిశ్రామికవేత్తలకు రెడ్ కార్పెట్ స్వాగతం పలికే విధానం తీసుకున్నారు. 15 రోజుల్లోనే అనుమతులు ఇచ్చే వినూత్న విధానాన్ని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీసుకువచ్చారు. టీఎస్‌ఐపాస్ రాష్ట్ర పారిశ్రామికరంగ రూపురేఖలను మార్చేసింది. ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలతోపాటు ప్రధాని నరేంద్రమోదీ నుంచి అభినందనలు లభించాయి. ఈ విధానమే సులభ వాణిజ్య విధానంలో మొదటి స్థానం సాధించడానికి కారణమైంది. కేటీఆర్ పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక టీఎస్‌ఐపాస్‌కు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి మార్పులు తీసుకువచ్చారు.


టీఎస్ ఐపాస్ విధాన పత్రాలను ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేస్తున్న మంత్రులు కేటీఆర్, జూపల్లి, పోచారం తదితరులు (ఫైల్)

అనుమతులు, రాయితీలు, ప్రోత్సాహకాల్లో మానవ ప్రమేయాన్ని పూర్తిగా తగ్గించారు. దీనితో రాష్ట్రం ఈవోడీబీలో దేశంలోనే మొదటిస్థానంలో నిలిచింది. టీఎస్‌ఐపాస్ ద్వారా ఇప్పటివరకు నాలుగువేలకు పైగా పరిశ్రమలకు అనుమతులు ఇచ్చారు. వీటి ద్వారా రెండున్నర లక్షల మందికి పైగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కృషి ఫలితంగా ఎన్సీఏఈఆర్ సర్వేలో రాష్ట్ర పతిష్ట పెరిగే విధంగా అనేక అంశాల్లో మంచి మార్కులు లభించాయి.

కార్మికుల లభ్యత..

పరిశ్రమలకు అవసరమైన కార్మికులు అందుబాటులో ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాల్లో ఉండగా మహారాష్ట్ర, కర్ణాటక నాలుగైదు స్థానాల్లో ఉన్నాయి. ఇదే విభాగంలో తెలంగాణ గత ఏడాది ఏడో స్థానంలో ఉండేది. మొత్తం 100 మార్కులకు 60.8 మార్కులతో ఇపుడు మూడో స్థానంలోకి వచ్చింది.

సర్వే ఇలా..

ఈ సర్వేను ఏప్రిల్- మే నెలల్లో నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 21 రాష్ట్రాల్లో 1030 పారిశ్రామికవేత్తల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కంపెనీల ఎండీ, సీఈవో, హెచ్‌ఆర్ హెడ్, మేనేజర్ స్థాయి వారి నుంచి సమాధానాలను రాబట్టారు. సర్వే నిర్వహించిన పరిశ్రమల్లో స్థూలంగా తయారీరంగ పరిశ్రమలు, సేవారంగ పరిశ్రమలు ఉండగా వాటిలో పబ్లిక్‌రంగం, ప్రైవేటురంగంతోపాటు మల్టీనేషనల్ కంపెనీలు ఉన్నాయి. ఉత్పత్తి కోణంలో చూస్తే క్యాపిటల్ గూడ్స్, ఇంటర్మీడియట్ గూడ్స్, కన్స్యూమర్ నాన్ డ్యూరబుల్, కన్స్యూమర్ డ్యూరబుల్, సర్వీసెస్, మౌలిక సదుపాయాలకు చెందిన కంపెనీలు ఉన్నాయి. తెలంగాణలోని 38 మంది పారిశ్రామికవేత్తల నుంచి సమాధానాలు సేకరించారు.

పరిపాలన, రాజకీయ స్థిరత్వం ..

పరిపాలన, రాజకీయ స్థిరత్వంలో తెలంగాణకు డీఐపీపీ శాఖ 100 శాతం స్కోరు ఇచ్చింది. పరిపాలనలో శాంతిభద్రతలు, అవినీతి, నేరాలు లాంటి వాటిని పరిగణనలోకి తీసుకున్నారు. వరల్డ్‌వైడ్ గవర్నెన్స్ ఇండికేటర్(డబ్ల్యూజీఐ) నివేదికలో రాష్ట్రంలో శాంతిభద్రతలు, అనుమతులు, అవినీతిరహిత విధానాల్లో పారిశ్రామికవేత్తలకు మెరుగైన సేవలు అందుతున్నాయని నివేదించారు.

ప్రారంభానికి ముందే అనుమతులు..

పరిశ్రమ ప్రారంభించేనాటికే రాష్ట్రంలో అన్ని రకాల అనుమతులు వస్తున్నాయని 70 శాతం పారిశ్రామికవేత్తలు తెలిపారు. 27 శాతం ఫర్వాలేదనగా, 2.7 శాతం మాత్రం సమస్య ఉందని చెప్పారు. టీఎస్‌ఐపాస్ విధానంలో 15 రోజుల్లోనే రాష్ట్ర స్థాయిలో అనుమతులు ఇస్తున్నారు. ఇక్కడ పరిశ్రమలు స్థాపించిన అనేక భారీ పరిశ్రమల యాజమాన్యాలు ప్రభుత్వ విధానాన్ని ప్రశంసిస్తూ లేఖలు రాశాయి. తాము ఇలాంటి విధానాన్ని ఎక్కడా చూడలేదని పరిశ్రమల యజమానులు చెప్తున్నారు. కాగా 83.8 శాతం పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ప్రభుత్వ పన్ను విధానం భేషుగ్గా ఉందని చెప్పగా, ఫరవాలేదని 8.1 శాతం, సమస్యలున్నాయని 8.1 శాతం చెప్పారు. ముడిసరుకు లభ్యత చాలాబాగుందని 70 శాతం పారిశ్రామికవేత్తలు, ఫర్వాలేదని 21.6 శాతం సమాధానమిచ్చారు. మిగిలిన వారు తీవ్ర సమస్య ఉందని తెలిపారు.

ముందస్తు ప్రణాళిక ప్రకారం..

పరిశ్రమలకు ఉపయోగపడేవిధంగా మాస్టర్‌ప్లాన్‌తో భూముల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. రాబోయే 30-40 సంవత్సరాల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి పారిశ్రామిక పార్కుల్లో సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నాం. పరిశ్రమలకు భూముల కేటాయింపుల్లో ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొచ్చాం. టీఎస్‌ఐపాస్ 15 రోజుల్లో అనుమతి విధానం కింద ప్రతి వారం భూములకు క్లియరెన్స్ వస్తున్నది. ఈవోడీబీ సంస్కరణల అమలు ద్వారా పారిశ్రామికవేత్తలకు ఇతర రాష్ట్రాల కంటే మన దగ్గర మెరుగైన సదుపాయాలు, సౌకర్యాలు అందుతున్నాయి. పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అలోచనలకు అనుగుణంగా కార్యాచరణను అమలుచేస్తున్నాం.

ఈవీ వెంకటనర్సింహారెడ్డి, టీఎస్‌ఐఐసీ ఎండీ

వాణిజ్య వాతావరణం..

పెట్టుబడుల రాకలో వాణిజ్య వాతావరణం ముఖ్య భూమిక పోషిస్తుంది. రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం అధికంగా ఉంటే ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఆయా పరిశ్రమలు ఉత్పత్తి చేసే వస్తువులకు డిమాండ్ పెరుగుతుంది. వాణిజ్య వాతావరణంలో దేశంలో గుజరాత్ రాష్ట్రం మొదటి స్థానంలో ఉంటే తెలంగాణ ఆరో స్థానంలో నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులకు ఎక్కువ మొత్తం ఖర్చు చేయడంపై 82 శాతం మంది సంతృప్తిని వ్యక్తం చేశారు.

శాంతి భద్రతల్లో భేష్



రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి భేషుగ్గా ఉందని సర్వేలో తెలింది. సర్వేలో పాల్గొన్న 89.5 శాతం పారిశ్రామికవేత్తలు ఇదే చెప్పారు. 10.5 శాతం మంది ఓ మోస్తరుగా ఉన్నాయంటూ తెలిపారు. శాంతిభద్రతల్లో గుజరాత్ తర్వాత తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. మన తరువాత హర్యానా, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి ఇప్పటివరకు ప్రజలు భయాందోళనలకు గురయ్యే ఒక్క సంఘటన కూడా చోటుచేసుకోలేదు. తమ పెట్టుబడులకు ఎలాంటి ఢోకా లేదని ఏర్పడిన ధీమాతో పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడి పెట్టడానికి ముందుకొస్తున్నారు.

భూమి లభ్యత..



పరిశ్రమలకు అనువైన భూములను అందుబాటులో ఉంచడంలో దేశవ్యాప్తంగా తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. మొదటిస్థానంలో మధ్యప్రదేశ్ ఉంది. మూడోస్థానంలో తమిళనాడు, ఆ తరువాత ఉత్తరప్రదేశ్, గుజరాత్‌లున్నాయి. పరిశ్రమలకు ఏర్పాటులో భూమి కీలకం. అనుకూలమైన స్థలాలు లేక ఇతర రాష్ట్రాలకు పరిశ్రమలను మార్చుకున్న ఉదంతాలున్నాయి. 2013 భూ సేకరణ చట్టం వచ్చాక ఈ సమస్య మరింత తీవ్రమైంది. ఎన్సీఏఈఆర్ నిర్వహించిన సర్వేలో మొదటి అంశంగా భూమిని తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం దాదాపు 1.50లక్షల ఎకరాల భూమిని అందుబాటులో ఉంచింది. టీఎస్‌ఐఐసీ వెబ్‌సైట్‌లో వాటి వివరాలను నమోదు చేసింది. దీనితో ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు చూసుకునే వెసులుబాటు కలిగింది. టీఎస్‌ఐఐసీ నిర్మించిన పారిశ్రామికపార్కుల్లో ఖాళీగా ఉన్న ప్లాట్ల వివరాలను కూడా వెబ్‌సైట్‌లో ఉంచింది. జియో ట్యాగింగ్ వల్ల వాటిపై క్లిక్ చేయగానే ఆ స్థలం భౌగోళిక స్వరూపం, జాతీయ రహదారికి ఎంత దూరంలో ఉంది? రైల్వేస్టేషన్‌కు ఎంత దూరంలో ఉంది? విమానాశ్రయానికి ఎంత దూరంలో ఉన్నదో తెలుస్తుంది.

విభాగం	సమస్య లేదు	మోస్తరు/ ఫరవాలేదు	తీవ్రంగా ఉంది
రాష్ట్రంలో అవినీతి	47.2	47.2	5.6
శాంతి భద్రతల పరిస్థితి	89.5	10.5	0.0
విద్యుత్ లభ్యత	86.8	7.9	5.3
నైపుణ్య కార్మికులు	52.6	31.6	15.8
నైపుణ్య కార్మికుల్లో నాణ్యత	57.9	28.9	13.2
అందుబాటులో ఉన్న కార్మికులు	78.9	18.4	2.6
కార్మిక సంబంధాలు	86.5	10.8	2.7
కార్మికచట్టాలు	77.8	13.9	8.3
నీటి లభ్యత	73.7	23.7	2.6
ఇంటర్నెట్ కనెక్షన్	84.2	10.5	5.3
మురుగు సమస్య	81.6	13.2	5.3
రోడ్, రైల్ కనెక్టివిటీ	78.9	18.4	2.6
పరిశ్రమ సంబంధ విధానాలు	70.3	24.3	5.4
యాక్సెస్ టు ఫైనాన్స్	78.4	18.9	2.7
అందుబాటులో ముడిసరుకు	70.3	21.6	8.1
రాష్ట్ర ప్రభుత్వ పన్ను విధానం	83.8	8.1	8.1
పరిశ్రమ ప్రారంభానికి ముందే అనుమతులు (పర్యావరణ సహా)	70.3	27.0	2.7

(అంకెలు శాతాల్లో)

మౌలిక సదుపాయాలు



పరిశ్రమల స్థాపనలో విద్యుత్, రోడ్లు, నీరు తదితరాలు కీలకం. జాతీయ రహదారులకు అనుసంధానించే అంతర్గత రహదారులు, పరిశ్రమల్లో ఉత్పత్తి అయ్యే వస్తువుల రవాణా, ఎగుమతి చేసుకోవడానికి అనువైన ప్రాంతాలను చూసి పెట్టుబడిదారులు ముందుకు వస్తారు. నిపుణులు రావాలంటే విమానాశ్రయం అందుబాటును పరిగణనలోకి తీసుకుంటారు. కొత్త రాష్ట్రమైనా మౌలిక సదుపాయాలు కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తున్నది. మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్రం 16వ స్థానంలో ఉంది. ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్, కేరళ, హర్యానా మొదటి ఆరు స్థానాల్లో ఉన్నాయి.

కేజీబీవీ టీచర్ల

సమస్యల పరిష్కారానికి కృషి

నిజామాబాద్ ఎంపీ కవిత హామీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలలో పనిచేస్తున్న టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత హామీనిచ్చారని టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం మణిపాల్‌రెడ్డి తెలిపారు. కేజీబీవీ రాష్ట్ర అధ్యక్షురాలు స్వరూపారాణి, ప్రమీల, కేజీబీవీ జిల్లాల ప్రతినిధులతో కలిసి శుక్రవారం ఎంపీ కవితను కలిశారు. తమ సమస్యలను పరిష్కారించాలని ఈ సందర్భంగా ఆమెకు విజ్ఞప్తి చేశారు. కేజీబీవీ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించడం, ఉద్యోగాలను క్రమబద్ధీకరించడం, వేతనాలను పెంచడం వంటి సమస్యల పరిష్కారానికి ఎంపీ కవిత హామీ ఇచ్చినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పెరిగిన రెండు వర్సిటీల పరిధి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ వర్సిటీ పరిధిలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు ఉండగా.. తాజాగా నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలను చేర్చారు. శాతవాహన వర్సిటీ పరిధిలో కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్లా రాజన్న, జగిత్యాల జిల్లాలు ఉండగా.. అదనంగా మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలు చేరాయి. ఈ రెండు వర్సిటీల్లో కలిసిన నాలుగు జిల్లాలు ఇప్పటివరకు కాకతీయ వర్సిటీ పరిధిలో కొనసాగాయి. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ నిర్ణయం తీసుకున్నది. ఓయూ, ఎంజీయూ, పాలమూరు వర్సిటీల పరిధిలో ఉన్న జిల్లాల్లో ఎలాంటి మార్పు లేదు.

ఇకనుంచి ఈసీబీసీ నిబంధనలు

కచ్చితంగా పాటించాల్సిందే!

1200 గజాలు, ఆపై స్థలంలో నిర్మించే వాణిజ్య సముదాయాలకు వర్తింపు

నివాస గృహాలు, అపార్టుమెంట్లకు అమలుచేసే అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఇంధన వినియోగం తగ్గించే నిర్మాణాలను ప్రోత్సహించడానికి పురపాలకశాఖ సమాయత్తం అవుతున్నది. ఇండ్లు, అపార్టుమెంట్లకు అనుమతులు ఇచ్చేందుకు కేంద్రం రూపొందించిన ఈసీబీసీ (ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్) నిబంధన ప్రస్తుతం అమల్లో ఉన్నప్పటికీ.. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏల్లో డీపీఎమ్మెస్ (డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) విధానం ద్వారా ఇండ్లకు అనుమతి ఇచ్చేటప్పుడు ఈ నియమాన్ని ఐచ్ఛికంగా (ఆప్షనల్) పెట్టారు. ఇక నుంచి 1200 గజాలు, ఆపై స్థలంలో నిర్మించే వాణిజ్య సముదాయాల్లో ఈసీబీసీ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందే. ఇందుకోసం ఈసీబీసీ ప్యానెల్ సభ్యులుగా జీహెచ్‌ఎంసీ ఇప్పటికే సుమారు 36మందిని నియమించేందుకు పచ్చజెండా ఊపింది. ఎవరెవరిని నియమించారనే అంశంపై స్పష్టత వచ్చేందుకు మరో రెండు, మూడు రోజుల సమయంపట్టే అవకాశం ఉంది. ప్యానల్ ఏర్పాటు పూర్తయిన తర్వాత ఈ నెలాఖరు లేదా సెప్టెంబర్ ప్రారంభంలో ఈ నిబంధనలను అమల్లోకి తెస్తారని తెలుస్తున్నది. పుర, నగరపాలక సంస్థల్లోనూ ఈసీబీసీ నిబంధనలను అమలు చేసేందుకు సాంకేతిక సబ్ కమిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీలో ఈసీబీసీ అమలు తీరుపై ప్రతి బుధవారం నిర్వహించే అంతర్గత సమావేశాలకు సాంకేతిక సబ్ కమిటీ హాజరవుతుంది. దీనికి జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్ రెడ్డి అంగీకరించారు.

నిబంధనలు పాటిస్తే ప్రోత్సాహకాలు:

ఈసీబీసీ నిబంధనల్ని కచ్చితంగా పాటించి ఇంధన వినియోగాన్ని తగ్గించే నిర్మాణాలకు ప్రోత్సాహకాలను ఇవ్వనున్నారు. నిబంధనల్ని పాటించిన మొదటి మూడు నిర్మాణాలకు ప్రశంస పత్రాలు అందజేస్తారు. ఇంధన పరిరక్షణ దినోత్సవం రోజు అవార్డులు కూడా అందజేస్తారు. కొత్తగా నిర్మిస్తున్న కలెక్టరేట్ భవనాలను ఈ నిబంధనలకు అనుగుణంగా నిర్మించేందుకు జీహెచ్‌ఎంసీ సహకారం అందించనుంది. ఇందుకోసం ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులతో చర్చించనున్నారు. ఈ తరహా నిర్మాణాల్లో ఈసీబీసీ నిబంధనల్ని అమలు చేయడం ద్వారా ప్రజల్లో ఇంధన వినియోగంపై అవగాహన పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వ్యక్తిగత నివాసగృహాలు, అపార్టుమెంట్ల నిర్మాణంలో ఇంధన వినియోగం తగ్గించడానికి అందుబాటులో ఉన్న సామగ్రిపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరముందని పురపాలకశాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

డిగ్రీ ఆన్‌లైన్ సీట్ల కేటాయింపులో గందరగోళం

న్యాయం చేస్తామన్న దోస్త్ అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల కోసం నిర్వహించిన మూడో విడుత దోస్త్ కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపులో గందరగోళం నెలకొన్నది. ఒక కాలేజీకి బదులుగా మరో కాలేజీలో సీట్లు వచ్చాయని విద్యార్థులు దోస్త్ అధికారులకు ఫిర్యాదుచేశారు. వారం రోజుల క్రితం సీజీజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఒక కాలేజీలో సీటు రాగా గురువారం మరో కాలేజీలో వచ్చిందని చెప్పారు. ఏ కాలేజీలో చేరాలో అర్థం కావడం లేదని విద్యార్థులు చెప్తున్నారు. ఈ విషయంపై దోస్త్ అధికారులు మాట్లాడుతూ.. ఏ ఒక్క విద్యార్థికి అన్యాయం జరుగకుండా అన్ని చర్యలను తీసుకుంటామని తెలిపారు. ఈ విషయంపై శనివారం సీజీజీ అధికారులతో చర్చిస్తామన్నారు.

ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు ప్లేస్‌మెంట్

150 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నాంపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శుక్రవారం యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, కాయిన్ కన్సల్టెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లేస్‌మెంట్‌లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పేర్కొన్నారు. ఎనిమిది కార్పొరేట్ సంస్థలు 150 మంది విద్యార్థుకు ఉద్యోగం అవకాశం కల్పించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యాశాఖ ఓఎస్డీ రాములు, చీఫ్ కో ఆర్డినేటర్ నీరజా తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా కొలువుల భర్తీ

సీఎం ప్రకటనకు అనుగుణంగా ఏర్పాట్లు
అతి త్వరలోనే నోటిఫికేషన్లు..
అన్ని కుదిరితే ఆరునెలల్లోనే ఫలితాలు
కొన్ని శాఖల్లో వివరాల జాప్యం
తొలిగితే త్వరితగతిన ప్రకటనలు
కోర్టు కేసులపై ప్రత్యేకచర్యలు
'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూలో
టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కొలువుల భర్తీలో వేగం పెరిగింది. ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ శరవేగంగా ముందుకు కుతున్నది. ఒకవైపు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ బోర్డులు నియామకాలు కొనసాగిస్తుండగా, మిగిలినవాటికి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) భర్తీ ప్రక్రియ చేపట్టింది. గత పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు భిన్నంగా టీఎస్‌పీఎస్సీ పారదర్శకతకు పెద్దపీటవేస్తూ, నియామకాల ప్రక్రియలో నూతన పంథాను ఆవిష్కరించింది. సమైక్యపాలనలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ అంటే పైరవీలకు అడ్డాగా ఉండేది. ఇంటర్వ్యూ బోర్డులపై కులతెట్టులా ఆరోపణలుండేవి. ఇక పరీక్షల విధానంలో ప్రాంతీయ పక్షపాతం, చైర్మన్లు, బోర్డు సభ్యుల అడ్డగోలుతనంతో అభాసుపాలైన విషయం తెలిసిందే. అలాంటిది ఇప్పుడు మచ్చుకైనా అవినీతి కనిపించడంలేదు. పైరవీలకు ఆమడదూరంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. దేశంలో ఉన్న అనేక పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు టీఎస్‌పీఎస్సీ దిక్సూచిగా మారింది. ఇప్పటికే అరడజనుకుపైగా రాష్ట్రాలు టీఎస్‌పీఎస్సీ పనితీరుపై అధ్యయనం చేయడంతోపాటు తమ తమ రాష్ట్రాల్లో ఇక్కడి విధానాలను అమలుచేస్తున్నాయి. విభజన సమస్యలన్నింటినీ అధిగమించి రెండేండ్లు కూడా పూర్తికాక ముందే 58 నోటిఫికేషన్లు ఇచ్చి, ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో రికార్డు సృష్టించింది. తాజాగా ముఖ్యమంత్రి కేసీఆర్ భారీ ఎత్తున ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల ట్యాగ్‌లైన్‌లో భాగంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా కొలువుల భర్తీ వేగంగా పూర్తిచేయనున్నట్టు చెప్పారు. ఇప్పటికే ఉద్యోగాల భర్తీకి రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకున్నామని, యుద్ధప్రాతిపదికన ఉద్యోగాల భర్తీని చేపట్టేందుకు క్రియాశీలంగా ముందుకు సాగుతున్నామని వివరించారు.

న్యాయపరమైన ఇబ్బందులు సృష్టించే ప్రయత్నాలను ఎదుర్కొంటాం..

అభ్యర్థులు, ఆశావహులు సహా పలువురు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. కొన్ని కేసుల తీరును విశ్లేషిస్తే ఉద్దేశపూర్వకంగా వేస్తున్నారేమోనన్న అనుమానం కలుగుతున్నది. దురుద్దేశపూర్వకంగా వేసే కేసులతో కమిషన్‌కు ఇబ్బంది అవుతున్నది. పనిపై ప్రభావం చూపుతున్నది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్రూప్-1 పరీక్షను టీఎస్‌పీఎస్సీ, ఏపీపీఎస్సీ ఒకే రోజున నిర్వహిస్తే.. అలా చేయడంవల్ల ఏపీ అభ్యర్థులు తెలంగాణలో పరీక్ష రాసే అవకాశం కోల్పోతారని కోర్టులో పిటిషన్ వేశారు. ఇలాంటివి తెలంగాణ అభ్యర్థుల మనోస్థైర్యాన్ని దెబ్బ తీస్తాయి. గురుకులాల కోర్టు కేసు విషయంలో ఫిబ్రవరిలో ప్రకటన వస్తే.. పరీక్ష జరుగుతున్న నెలలో కోర్టును ఆశ్రయించారు. దీంతో పరీక్షలు ముగిసే సమయంలో ప్రక్రియ వాయిదా పడింది. తద్వారా వేలమంది అభ్యర్థులు ఇబ్బంది పడ్డారు. ఇది కమిషన్ పనితీరును సైతం ప్రభావితం చేస్తున్నది. గతంలో సర్వీస్ కమిషన్ ఉద్యోగులతో కోర్టు కేసులను పర్యవేక్షించగా, ఇప్పుడు ప్రత్యేకంగా లీగల్ సెల్ ఏర్పాటు చేశాం. ఇందులో మా కమిషన్ సభ్యులైన ముగ్గురు న్యాయ నిపుణులు ఉన్నారు. న్యాయకోవిదులు మంగారి రాజేందర్, విద్యాసాగర్‌రావు, కృష్ణారెడ్డితోపాటు ఉద్యోగులతో కూడిన ప్రత్యేక విభాగం ఏర్పాటుచేశాం. కోర్టు కేసు నమోదయిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయించి, నియామక ప్రక్రియ జాప్యం కాకుండా చూస్తున్నాం. అదే సమయంలో ప్రభుత్వపరంగా అడ్వకేట్ జనరల్‌తో సమన్వయం చేసుకొని ఉద్యోగార్థులకు సేవలందిస్తున్నాం.

శని, ఆదివారాల్లో కాకుండా మిగిలిన రోజుల్లో పరీక్షలు పెట్టే యోచన

త్వరలోనే భారీఎత్తున నోటిఫికేషన్లు ఇచ్చి, పెద్ద సంఖ్యలో పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. కేవలం శని, ఆదివారాల్లో పరీక్షలు చేపడితే సమయం సరిపోదు కాబట్టి.. విద్యాలయాలకు సెలవులు ఇచ్చి ఇతర రోజుల్లోనూ పరీక్షలు నిర్వహించే ఆలోచన చేస్తున్నాం. పరీక్ష కేంద్రాల సమస్య ఉత్పన్నం కాకుండా విద్యాశాఖ సహాయం తీసుకోవాలని భావిస్తున్నాం. అలాగే, కమిషన్‌లో ఒక్కొక్క సభ్యుడు/ అధికారి ఒక పరీక్షను పర్యవేక్షించాల్సి ఉంటుంది. పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టాల్సి ఉన్నందున పనిభారం కూడా పెరుగుతుంది. ఇప్పటికే పనిభారం పెంచాం. ఒక్కొక్కరు 2, 3 పరీక్షల అంశాలను పర్యవేక్షిస్తున్నారు. మా ఉద్యోగుల కృషి అభినందనీయం.





సర్వీసు రూల్స్ నిర్ణయించడంలో జాప్యంతో నియామక ప్రక్రియలో కొంత ఆలస్యం

ఉద్యోగాల భర్తీని పారదర్శకంగా, వేగంగా పూర్తిచేసేందుకు అన్ని నియామకాలను టీఎస్‌పీఎస్సీద్వారా భర్తీచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించడం సంతోషకరం. అయితే పలు శాఖల్లో కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. సర్వీస్‌రూల్స్ రూపొందించుకోకపోవడం, నిబంధనల్లో మార్పులువంటి అంశాలతో నియామక ప్రక్రియ కొంత జాప్యమవుతున్నది. పురపాలక శాఖ నుంచి దాదాపు వెయ్యి ఖాళీల వివరాలు వచ్చాయి. అయితే సర్వీస్ రూల్స్ ఇంకా రూపొందించలేకపోవడంవల్ల అవి పెండింగ్‌లోనే ఉన్నాయి. మరికొన్ని శాఖల్లోనూ ఇదే సమస్య. ఇవన్నీ విభజన నేపథ్యంలో తలెత్తిన సమస్యలు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా, సాంకేతిక కారణాలతో ప్రక్రియ ఆగిపోవాల్సి వస్తున్నది. ఇలాంటి అంశాలను పరిష్కరించేందుకు టీఎస్‌పీఎస్సీ క్రియాశీలంగా వ్యవహరిస్తున్నది. ఆరోగ్యశాఖకు సంబంధించిన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులు మా కార్యాలయానికి వచ్చి పరిష్కరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సైతం ఆయా శాఖలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. ఇలా టీఎస్‌పీఎస్సీ ప్రోయాక్టివ్ పాత్ర పోషిస్తున్నది. సర్వీస్ రూల్స్‌కు సంబంధించి సాంకేతిక అంశాలపై కూడా కమిషనే సంబంధిత శాఖల అధికారులతో చర్చించి, సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నది. ఒకేరోజు వేర్వేరు పరీక్షలు నిర్వహించడం, ఎస్సెస్సీ, ఐబీపీఎస్, యూపీఎస్సీ వంటి ఇతర పరీక్షల వల్ల షెడ్యూల్ కూర్పులో కొంత ఇబ్బంది తలెత్తుతున్నది.

ముఖ్యమంత్రి పంద్రాగస్టు ప్రకటనను స్వాగతిస్తున్నాం.. మేం సిద్ధంగా ఉన్నాం..

ముఖ్యమంత్రి కేసీఆర్ గోల్కొండ కోట నుంచి ప్రకటించిన ఉద్యోగాలను భర్తీ చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే కొన్ని ఉద్యోగాలను రికార్డు సమయంలో భర్తీచేశాం. ఒక్కొక్క నోటిఫికేషన్ ప్రక్రియను మొత్తంగా 4 నుంచి 6 నెలల్లో పూర్తిచేస్తాం. పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు తదితరాలు కూడా కొన్ని పోస్టులను భర్తీచేస్తాయి. ఇతర బోర్డులు, మేము కలిపి పెద్ద ఎత్తున ఉద్యోగాలను భర్తీచేస్తాం. నోటిఫికేషన్లు వెలువడిన ఆరునెలల్లో ప్రక్రియను పూర్తిచేస్తాం.

ప్రభుత్వ సహకారం బాగుంది

ఉద్యోగాల పరీక్షల్లో ప్రభుత్వ ఉన్నతాధికారులు మొదలుకుని జిల్లా కలెక్టర్ల వరకూ అందరి సహకారం బాగుంది. రెవెన్యూ, రవాణా, పోలీసు, ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల సేవలు బాగున్నాయి. మా కమిషన్‌లో ఉద్యోగాల కొరత విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లగా 90 పోస్టుల భర్తీకి అనుమతించారు. సిబ్బంది కొరత వేధిస్తున్నప్పటికీ ఉన్నవారితోనే పనిచేస్తున్నాం. సాంకేతికపరమైన సీజీజీ సేవలతో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని ఐటీ శాఖ మంత్రి కే తారక రామారావు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన చొరవ చేసి, ప్రత్యేక డాటా సెంటర్ కేటాయించారు. అయితే ఈ పనుల్లో వేగం పెరుగాలి. రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామ్యమైనవారు ఎవరూ ఇప్పటివరకు ఫలానా కొలువు విషయంలో మా వాళ్లకు అవకాశం ఇవ్వండి అని మమ్మల్ని కోరలేదు.

పాత కొలువులే కాదు.. సృష్టించినవి సైతం ఉన్నాయి..

తెలంగాణ ప్రభుత్వం కొలువుల భర్తీకి పెద్ద ఎత్తున ప్రాధాన్యం ఇస్తున్నది. ప్రజాజీవితానికి సంబంధించిన కీలక అంశాలైన విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు వంటి రంగాల్లో కీలక ఉద్యోగాలు భర్తీచేస్తున్నది. గతంలో ఉన్న కొలువుల భర్తీతోపాటు నూతన రంగాల్లోనూ ఉద్యోగాలను సృష్టించి, భర్తీచేసేందుకు అనేక నోటిఫికేషన్లు విడుదలచేసింది. గురుకులాల్లో బోధన, బోధనేతర సిబ్బంది, మిషన్ భగీరథ ద్వారా భారీస్థాయిలో ఇంజినీర్లు, ఇతర సిబ్బంది, మిషన్ కాకతీయ సఫలంగా సాగేందుకు ఇంజినీర్ల భర్తీ వంటివన్నీ ప్రభుత్వం సృష్టించిన ఉద్యోగాలే. గతంలో ఇలాంటి దాఖలాలు లేవు.

ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను విజయవంతంగా నిర్వర్తిస్తాం..

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పంద్రాగస్టు ప్రసంగంలో భాగంగా భారీ స్థాయిలో ఉద్యోగాల భర్తీ ప్రకటన చేసి నిరుద్యోగులకు తీపికబురు చెప్పారు. 48,070 కొత్త ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ఇందులో మెజార్టీ కొలువులు టీఎస్‌పీఎస్సీ ద్వారానే భర్తీ కానున్నాయి. ఇది మాపై భారీ బాధ్యతే. దీన్ని సమర్థంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాం. టీఎస్‌పీఎస్సీ ద్వారా ఇప్పటికే 58 నోటిఫికేషన్ల ద్వారా 5932 ఉద్యోగాల భర్తీ పూర్తయింది. గురుకులాలు, గ్రూప్-1, గ్రూప్-2, ఎక్సైజ్ శాఖలోని కానిస్టేబుల్ ఉద్యోగాలు మొత్తం కలిపి 12,151 ఉద్యోగాల భర్తీ ఒకట్రెండు నెలల్లో పూర్తిచేస్తాం. తద్వారా కమిషన్ పని ప్రారంభించిన రెండేండ్లలో 17,955 కొలువులు భర్తీ చేసినట్టు అవుతుంది. ఈ నెలాఖరులో 851 ఏఈవోల భర్తీకి ప్రకటన విడుదల చేస్తాం. డీఎస్సీ వివరాలు రాగానే నోటిఫికేషన్ ఇస్తాం. నియామకాల ప్రక్రియకు సంబంధించి కొత్త జిల్లాలు లేదా పాత జిల్లాలు ఎలా ఉన్నా భర్తీ ప్రక్రియను పూర్తిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం. గ్రూప్-3, గ్రూప్-4 వంటి ఖాళీలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చినప్పటికీ భారీ సంఖ్యలో ఖాళీలు లేవు. అయితే కొత్త జిల్లాలకు సంబంధించిన ఖాళీలు కూడా రాబోతున్నాయి. వీటన్నింటిని కలిపి భర్తీ చేసే దిశగా ప్రభుత్వం కదులుతున్నందున రాబోయే కాలంలో నోటిఫికేషన్లను ఆశించవచ్చు. ఉద్యోగాల జాతరలో భాగంగా విడుదలచేసే నోటిఫికేషన్లను సంబంధిత శాఖలు సవివరంగా ఇస్తే.. నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుంచి 4 నెలల్లోగా భర్తీ ప్రక్రియ పూర్తయ్యేలా సన్నాహాలు చేస్తున్నాం. దీనికోసం సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం

టీఎస్‌పీఎస్సీ సంస్కరణలు దేశంలోనే ఆదర్శం

టీఎస్‌పీఎస్సీ ఆవిర్భవించినప్పటి నుంచి అభ్యర్థుల కోణంలో అనేక నిర్ణయాలు తీసుకున్నాం. వన్‌టైం రిజిస్ట్రేషన్, ఎస్సెమ్మెస్‌ల ద్వారా సేవలు, ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ, బయోమెట్రిక్ హాజరు, నిరీక్షణ లేకుండా ఉద్యోగాల భర్తీ షెడ్యూల్ వంటివి ఉద్యోగార్థుల కోణంలో తీసుకున్నాం. దేశంలోనే అత్యంత సీనియర్ కమిషన్ అయిన గుజరాత్ పీఎస్సీ మన రాష్ట్రంలో పర్యటించి, టీఎస్‌పీఎస్సీ పనితీరును అధ్యయనం చేసింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ల సదస్సును సైతం హైదరాబాద్‌లో నిర్వహించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లలో టెక్నాలజీ అమలుపై యూపీఎస్సీ ఏర్పాటుచేసిన కమిషన్ సారథ్య బాధ్యత టీఎస్‌పీఎస్సీకి దక్కింది.

సంక్షిప్తంగా...

ఇప్పటివరకు విడుదలైన నోటిఫికేషన్లు : 58
ప్రకటించిన ఖాళీలు : 17,955
భర్తీచేసినవి : 5,932
(1. 128 ఖాళీల గ్రూప్ 1 ఫలితాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.
2. 1032 ఖాళీల గ్రూప్ 2 ఫలితం కోర్టు కేసు కారణంగా ఆగి ఉంది
3. ఎక్సైజ్ శాఖలోని 340 ఖాళీల ఫలితం సైతం సిద్ధం)
ఫలితాలు రావాల్సినవి/తుదిదశకు చేరువగా ఉన్నవి : 12,151
అతి త్వరలో భర్తీ చేయనున్న కొలువులు : 9018

54% మరుగుదొడ్ల నిర్మాణం

నాలుగు జిల్లాల్లో వందశాతం పూర్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం దిశగా సాగుతున్నది. ఇప్పటికే రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్, మేడ్చల్ జిల్లాలో నూటికి నూరుశాతం మరుగుదొడ్లు నిర్మించారు. మెదక్ జిల్లాలో 83 శాతం పూర్తికాగా, ఖమ్మం జిల్లాలో 81 శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా 30 జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం 54 శాతం పూర్తయింది.



సింగరేణి ఔట్‌సోర్సింగ్ కార్మికుల జీతాలు పెంపు

ఎంపీ కవితకు ఔట్‌సోర్సింగ్, మహిళా ఉద్యోగుల కృతజ్ఞతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సింగరేణిలో వివిధ విభాగాలకు అనుబంధంగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సవరించిన కేంద్ర కనీస వేతన చట్టం ప్రకారం జీతాలు చెల్లించేందుకు యాజమాన్యం సిద్ధమయ్యింది. నైపుణ్యంలేని కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ కనీస వేతనంకింద ప్రస్తుతం రోజుకు రూ.313.25 చెల్లిస్తుండగా.. ఇది రూ.350కి పెరుగనుంది. ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు రూ.330.64 నుంచి 494కు పెరుగనుంది. జనవరి 19, 2017 నుంచి దీన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. తాజా నిర్ణయంతో సింగరేణి సంస్థలో పలు విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 14,921 మంది కార్మికులు లబ్ధిపొందనున్నారు. తాజా నిర్ణయంతో కంపెనీపై నెలకు రూ.2.07 కోట్ల అదనపు భారం పడనుందని శ్రీధర్ చెప్పారు. త్వరలో దీనిపై పూర్తి మార్గదర్శకాలను విడుదల చేస్తామని తెలిపారు. సంస్థ నిర్ణయం పట్ల ఔట్‌సోర్సింగ్ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

మెటర్నిటీ సెలవులు 26 వారాలకు పెంపు

ప్రస్తుతం అమల్లో ఉన్న 12 వారాల మెటర్నిటీ సెలవును 26 వారాలకు పెంచుతూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. డెలివరీ అంచనా సమయానికి ఎనిమిది వారాల ముందు నుంచి ఈ సెలవును వినియోగించుకోవాల్సి ఉంటుందని, మూడో ప్రెగ్నెన్సీకి మాత్రం 12వారాల సెలవు కొనసాగుతుందన్నారు. వీరి విషయంలో డెలివరీ అంచనా సమయానికి ఆరు వారాల ముందు నుంచి సెలవులు వినియోగించుకోవాలని సూచించింది. ఔట్‌సోర్సింగ్, మహిళా ఉద్యోగులు నిజామాబాద్ ఎంపీ కవితకు కృతజ్ఞతలు తెలిపారు.

రిజిస్ట్రేషన్ రోజే మ్యుటేషన్

మొదటిపేజీ తరువాయి...

గ్రామం యూనిట్‌గా ఈ సర్వే చేపడుతున్నాం. ఒక్కో గ్రామంలో నెల రోజులపాటు అధికారులు ఉండి, రైతుల సహకారంతో భూ రికార్డులను అప్‌డేట్‌చేస్తారు. వాటిని ఆన్‌లైన్‌లో ఉంచుతారు. రికార్డులన్నీ సరిచేసిన తర్వాత కొత్త పాసుపుస్తకాలు ఇస్తారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కూడా సంస్కరణలు తెస్తున్నాం. పారదర్శకంగా ఉండే రిజిస్ట్రేషన్ విధానం తెస్తున్నాం. రిజిస్టర్ అయిన రోజే మ్యుటేషన్ చేసేవిధంగా అధికారులకు ఆదేశాలు జారీచేశాం. ఇవన్నీ జరుగడానికి భూ వివరాలు సరిగ్గా ఉండడమే చాలా ముఖ్యం. తెలంగాణ ఏర్పడక ముందు ఏ వివరాలూ సరిగ్గా ఉండేవి కాదు. సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన తర్వాత ప్రభుత్వానికి ఏది ఎలా ఉంది? అనే విషయంలో అవగాహన వచ్చింది. ప్రభుత్వ కార్యక్రమాలు అమలుచేయడానికి నిర్దిష్ట ప్రాతిపదిక ఏర్పడింది. అలాగే ఇప్పుడు భూ సర్వేద్వారా అటు రైతులకు పెట్టుబడి పథకం, ఇటు రిజిస్ట్రేషన్ల వ్యవహారం సక్రమంగా జరుగుతుందని ఆశిస్తున్నాం. పెద్ద ఎత్తున చేపట్టే ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం తరపున సహకారం కావాలి. రాష్ట్రంలో ఈ కార్యక్రమం జరిగాక, దేశవ్యాప్తంగా కూడా నిర్వహించడానికి ఇక్కడి అనుభవం పనికొస్తుంది. త్వరలోనే పూర్తిస్థాయిలో ప్రాజెక్టు రిపోర్టు తయారుచేసి కేంద్రానికి పంపుతాం' అని ముఖ్యమంత్రి చెప్పారు.

కేసీఆర్ దార్శనికతతో సమగ్ర భూ సర్వే

ముఖ్యమంత్రి చెప్పిన వివరాలపై సంతోషం వ్యక్తంచేసిన హుకుమ్‌సింగ్ మీనా.. దేశవ్యాప్తంగా ఇలాంటి భూ సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికత వల్ల ఇప్పుడు తెలంగాణలో ఈ సర్వే జరుగడం సంతోషకరమన్నారు. సమగ్ర భూ సర్వే ఓ విప్లవమని, మిగతా రాష్ట్రాలకు ఆదర్శమని కొనియాడారు. ఈ పథకానికి కావల్సిన ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రాజెక్టు రిపోర్టు రాగానే కేంద్రం తరపున అందించగలిగే ప్రతి సహాయాన్ని అందిస్తామన్నారు. రాజకీయ సంకల్పంతో ప్రజలు, రైతుల భాగస్వామ్యం కూడా ఉన్నందున తెలంగాణలో ఈ కార్యక్రమం నూటికి నూరుశాతం విజయవంతమవుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. తెలంగాణ భౌగోళిక పరిస్థితులకు అనుగుణమైన సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే నిర్వహించాల్సి ఉంటుందని, ఈ విషయంలో కూడా తమ సహకారం ఉంటుందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 25 ఏజెన్సీలు కూడా సర్వే నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాయని, వాటి సహకారం కూడా తీసుకోవచ్చని హుకుమ్‌సింగ్ మీనా చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఆర్ మీనా, సీఎంవో ముఖ్య కార్యదర్శి ఎస్ నర్సింగ్‌రావు, కార్యదర్శి స్మితాసబర్వాల్, కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ భూ వనరుల విభాగం టెక్నికల్ డైరెక్టర్లు గౌతమ్ పాత్రు, దినేశ్‌కుమార్, డీఎస్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

20న భూ సర్వేపై సమావేశం

సమగ్ర భూ సర్వేపై ఈ నెల 20న ప్రగతిభవన్‌లో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ సమావేశంలో భూ సర్వే నిర్వహణకు కార్యాచరణ ప్రణాళికపై చర్చిస్తారు. ఇప్పటికే కొందరు కలెక్టర్లు, సీనియర్ రెవెన్యూ అధికారులతో కూడిన బృందం సర్వే సందర్భంగా చేయాల్సిన పనులపై అధ్యయనం చేస్తున్నది. వారిచ్చే నివేదికపై కూడా 20వ తేదీ సమావేశంలో చర్చించనున్నారు.

భూసర్వేకు ఎన్ని నిధులైనా ఇస్తాం

సమగ్ర భూసర్వేకు ఎంత ఖర్చయినా నిధులు ఇస్తామని, రూ.500 కోట్లు ఖర్చు అయినా ఫరవాలేదని కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి, భూవనరులశాఖ సంయుక్త కార్యదర్శి హుకుమ్‌సింగ్‌మీనా అన్నారు. భూసర్వేకు తాము గతంలో రూ.86 కోట్లు ఇచ్చినా అవి రాష్ట్రంలో ఇంకా పూర్తిగా వినియోగించలేదని తెలిపారు. ఆ నిధులను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపే ఖర్చు చేయాలని, లేకుంటే తిరిగి కేంద్రానికి వాపస్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. శుక్రవారం తన బృందం సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వచ్చిన హుకుమ్‌సింగ్ సమగ్ర భూసర్వేపై సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఆర్ మీనా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌లతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ భూమి ఎవరిదనే విషయంలో స్పష్టత ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన విజ్ఞప్తి మేరకు తాము ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భూసర్వే, రికార్డుల నవీకరణ కార్యక్రమం కోసం ఒక కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు.



డోక్లామ్ విషయాన్ని జపాన్ జాగ్రత్తగా గమనిస్తున్నది. భారత్‌తో భూటాన్ చేసుకున్న ఒప్పందాన్ని గౌరవించకుండా చైనా డోక్లామ్ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేస్తున్నది. అయినా రెండు నెలల తర్వాతనే భారత్ సేనలు అక్కడికి చేరుకున్నాయి. వ్యూహాత్మక రక్షణ విషయంలో భారత్ చర్యలు సమ్మతమైనవిగానే ఉన్నాయి. శాంతికోసం భారత్‌కు మా సంపూర్ణ మద్దతు ఉంటుంది.


హిరమత్సూ, భారత్‌లో జపాన్ దౌత్యవేత్త

దక్షిణ చైనా సముద్రం, తైవాన్ సమీపంలో దక్షిణ కొరియాకు దన్నుగా క్షిపణి విధ్వంసక మిసైళ్లను మోహరించటం అమెరికా మానుకోవాలి. మోహరింపు వల్ల చైనా-అమెరికా వ్యూహాత్మక రక్షణ ఒప్పందాలకు భంగం వాటిల్లే ప్రమాదమున్నది. వెంటనే అమెరికా తన చర్యను ఉపసంహరించుకోవాలి.

ఫాన్ చాంగ్‌లాంగ్, చైనా సెంట్రల్ మిలిటరీ కమిషన్ చైర్మన్



చరిత్రలో నేడు



1900

ప్యారిస్ ఒలింపిక్స్‌లో గ్రేట్ బ్రిటన్, ఫ్రెంచ్‌ల మధ్య జరిగిన ఒకే ఒక క్రికెట్ మ్యాచ్.

1960

అంతరిక్షంలోకి జీవులను తీసుకెళ్లి సజీవంగా భూమికి తిరిగివచ్చిన రష్యా అంతరిక్ష నౌక స్పుత్నిక్-5.





1988

ఎనిమిదేళ్ల యుద్ధం తర్వాత కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్న ఇరాక్, ఇరాన్.

కేరళ లో మతమార్పిడి, వివాహం విషయంలో చెలరేగిన వివాదం సుప్రీం కోర్టు తీర్పుతో సమసిపోయింది. అఖిల అనే యువతి మతం మార్చుకొని ముస్లిం యువకుడిని పెండ్లి చేసుకున్న విషయంపై అనేక అనుమానాలు తలెత్తాయి. అటు పోలీసులు, ఎన్ఐఏ కూడా ముస్లిం టెర్రరిస్టు గ్రూపుల ప్రమేయం ఉన్నదా అన్న కోణంలో విచారణ జరిపాయి. అఖిల తండ్రి కూడా మతమార్పిడి, వివాహం విషయంలో అనుమానం వ్యక్తం చేయటంతో దీనిపై విస్తృత చర్చ సాగింది. అయితే అనుమానాలన్నీ వట్టివేనని తేలటం, ఎవరికైనా మతం మార్చుకునే స్వేచ్ఛ, నచ్చిన వ్యక్తిని వివాహం చేసుకునే హక్కు ఉన్నదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పటం ఆహ్వానించదగినది.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

ప్రధాని మోదీ 'నవ భారతం' గురించి మాట్లాడుతున్నారు. దానికోసం అద్దం లాంటి రోడ్లు, అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఆకాశాన్నంటే బిల్డింగ్‌ల నిర్మాణమే నవభారతానికి నిదర్శనాలుగా చెప్తున్నారు. కానీ దేశంలోని ప్రజా సమూహాలు తమ అభివ్యక్తీకరణకు స్వేచ్ఛ మాత్రం ఉండటం లేదు. లింగమార్పిడితో థర్డ్ జెండర్‌గా పిలువబడుతున్న వారికి లైంగిక స్వేచ్ఛ లేదనటమే కాదు, చీర కట్టుకోవటం కూడా నిషేధిస్తున్నారు. ప్రజలకు భావ స్వేచ్ఛకు బంధాలు వేసి నవభారతం అంటే హర్షణీయం కాదు.

ది హిందూ

ఉగ్ర శకటాలు

స్పెయిన్‌లోని బార్సిలోనా నగరంలో గురువారం జరిగిన ఉగ్రవాద దాడి దిగ్భ్రాంతికరం. ఇస్లామిక్ స్టేట్‌కు చెందినట్టు భావిస్తున్న ఉగ్రవాదులు జనంలోకి వాహనాన్ని నడిపి పదమూడు మంది ప్రాణాలను బలిగొన్నాడు. ఈ దారుణ ఘటనలో కనీసం వందమంది గాయపడ్డారు. అమెరికా కూటమిలో భాగంగా ఉండి ఇరాక్, అఫ్ఘానిస్థాన్ దేశాల మీద దాడులు సాగిస్తున్నందుకు తాము ప్రతీకార చర్యకు పాల్పడినట్టు ఉగ్రవాదులు ప్రకటించారు. ఆయా దేశాలు ఒక కూటమిగా ఏర్పడి ఇతర దేశాలపై దాడికి పాల్పడటంలోని మంచి చెడుల గురించి మాట్లాడుకోవడం వేరు. ఇరు పక్షాలూ యుద్ధ క్షేత్రంలో పరస్పర దాడులకు పాల్పడుతూనే ఉన్నాయి. కానీ ఈ దారుణాలతో ఎటువంటి సంబంధం లేని అమాయక ప్రజల మీదికి వాహనాన్ని నడిపి బలిగొనడం సమర్థనీయం కాదు. ఇస్లామిక్ స్టేట్‌గా చెప్పుకుంటున్న వారు కూడా సొంత సైన్యంతో అమెరికా కూటమితో పోరాడుతున్నారు. అటువంటప్పుడు యుద్ధాన్ని అక్కడికే పరిమితం చేయకుండా అమాయక ప్రజలపై దాడులు చేయడం అంతర్జాతీయ సూత్రాలకు, యుద్ధ నియమాలకు విరుద్ధం. ఉగ్రవాదులు అమానుష దాడులకు పాల్పడటమే కాకుండా, తమ దారుణాలకు మతం రంగు పులుముకుంటున్నారు. మతం పేర యువతను ఆకర్షించి మత విరుద్ధమైన కార్యాలకు సాధనాలుగా వాడుకుంటున్నారు. యువకులను ఉన్మాదులుగా మార్చి వారి చేత ఘోరమైన దాడులు చేయించి అమాయకులను హతమార్చడాన్ని ఏ మతం సమర్థించదు. స్పెయిన్ ఇప్పటికే వేర్పాటువాద దాడులతో ఎంతో క్షోభను అనుభవించింది. బాస్క్ స్వాతంత్ర్య పోరాటం పేర సాగిన పోరాటం ఇటీవలే నీరుగారిపోయింది. ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న దశలో మళ్ళా ఉగ్రవాద దాడి జరిగింది.

ఒకప్పుడు నిర్దిష్ట ప్రాంతంలో ప్రాబల్యం ఉన్న శక్తుల మధ్య యుద్ధాలు జరిగేవి. అంతర్జాతీయంగా గుర్తింపు ఉన్న దేశాలు కాకున్నా, నిర్దిష్ట ప్రాంతంలో ఉన్న మిలిటెంట్లు పోరాడేవారు. వారితో చర్చలు జరిపి ఒక పరిష్కారం అన్వేషించడం సులభమయ్యేది. కనీసం ఒత్తిడి చేసి ఒక మేర రాజీ కుదిర్చిన అనుభవాలు అంతర్జాతీయ సమాజానికి ఉన్నాయి. కానీ ఇప్పుడు రాజ్యేతరశక్తుల వల్ల ప్రపంచానికి పెను ప్రమాదం ఏర్పడ్డది. ఒక దేశమంటూ లేకుండా, అన్ని దేశాలలో విస్తరించి ఉన్న ఉగ్రవాదం వల్ల దానిని కట్టడి చేయడం కష్టమైపోతున్నది. ఈ కొత్తరకం సమస్యకు సాధారణ పద్ధతుల్లో కాకుండా ఏదైనా కొత్తరీతిలో పరిష్కారాన్ని అన్వేషించాలె.

బార్సిలోనా నగరంలో దాడికి ఉగ్రవాదులు వాహనాన్ని ఎంచుకోవడం కూడా ఆందోళన కలిగిస్తున్నది. ఒకప్పుడు బాంబులు, తుపాకులతో దాడులు సాగేవి. తీవ్ర నిర్బంధం అమలు చేయడం ద్వారా యూరప్ ప్రభుత్వాలు ఈ దాడులను నిరోధించ గలుగుతున్నాయి. కానీ ఇటీవలి కాలంలో ఉగ్రవాదులు వాహనాలను సాధనాలుగా వాడుకుంటున్నారు. ఫ్రాన్స్ నగరంలోని నీస్ నగరంలో ఉగ్రవాదులు మొదటిసారిగా వాహనాన్ని ఆయుధంగా చేసుకొని దాడి చేశారు. గత ఏడాది జూలై పద్నాలుగవ తేదీన ఉగ్రవాదులు వాహనాన్ని జనంపై నడిపించి 86 మందిని బలిగొన్నారు. ఇస్లామిక్ స్టేట్‌కు మరో రూపమైన దాయిష్ ఉగ్రవాదులు ఇందుకు బాధ్యులమని ప్రకటించారు. ఆనాటి నుంచి ఉగ్రవాదులు ఇప్పటి వరకు యూరప్‌లోనే మొత్తం ఎనిమిది సార్లు వాహనాల ద్వారా వివిధ నగరాలలో దాడులు సాగించి అనేక మంది ప్రాణాలను హరించారు. దాయిష్ ఉగ్రవాదులు గత ఏడాది ఆగస్టు 19న (దాదాపు ఏడాది కిందట) ప్యారిస్ నగరంలో వాహనాన్ని ఉపయోగించి రెండు చోట్ల దాడులకు పాల్పడ్డారు. కానీ ఎవరికీ ప్రాణ హాని జరుగలేదు. మార్చి ఒకసారి, జూన్‌లో రెండుసార్లు లండన్‌నగరంలో వాహనాలతో దాడులు సాగాయి. ఒక దాడిలో ఐదుగురు, రెండవ దాడిలో ఎనమండుగురు, మూడవ దాడిలో ఒకరు మరణించారు. ఆ తరువాత దాడి డిసెంబర్‌లో బెర్లిన్ నగరంలో జరిగింది. ఈ దాడిలో పన్నెండు మంది బలయ్యారు. ఏప్రిల్ ఏడవ తేదీన స్టాక్‌హోంలో జరిగిన వాహన దాడిలో ఐదుగురు మరణించారు. ఈ విధంగా ఉగ్రవాదులు యూరప్‌లోని ఒక్కో నగరంలో దాడులు సాగిస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారు. ఈ క్రమంలో జరిగిందే బార్సిలోనా దాడి.

బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, స్పెయిన్ ఇట్లా ఒక్కో దేశాన్ని లక్ష్యం చేసుకోవడం వల్ల యూరప్ ఖండం అప్రమత్తం అయింది. అయితే మారణాయుధాలు కాకుండా వాహనాలను వాడటం పెద్ద సమస్యగా మారింది. మారణాయుధాలను సేకరించడం, ఉపయోగించడం కష్టమైన పని. ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉన్నందువల్ల వాటి సరఫరా కూడా కష్టంగా మారింది. కానీ వాహనాలు లభించడం తేలిక. వాటిని ఉపయోగించే క్రమంలో అనుమానానికి తావుండదు. ఒక్కోసారి ఉగ్రవాదులు దొంగిలించిన వాహనాలను వాడుతున్నారు. తాజాగా మారు పేర తీసుకున్న వాహనాన్ని వాడారు. ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవడం కూడా సాధ్యం కాదు. అందువల్ల వాహనాల దాడులను ఉగ్రవాదులు ఎంచుకుంటున్నారు. ఒకప్పుడు నిర్దిష్ట ప్రాంతంలో ప్రాబల్యం ఉన్న శక్తుల మధ్య యుద్ధాలు జరిగేవి. అంతర్జాతీయంగా గుర్తింపు ఉన్న దేశాలు కాకున్నా, నిర్దిష్ట ప్రాంతంలో ఉన్న మిలిటెంట్లు పోరాడేవారు. వారితో చర్చలు జరిపి ఒక పరిష్కారం అన్వేషించడం సులభమయ్యేది. కనీసం ఒత్తిడి చేసి ఒక మేర రాజీ కుదిర్చిన అనుభవాలు అంతర్జాతీయ సమాజానికి ఉన్నాయి. కానీ ఇప్పుడు రాజ్యేతరశక్తుల వల్ల ప్రపంచానికి పెను ప్రమాదం ఏర్పడ్డది. ఒక దేశమంటూ లేకుండా, అన్ని దేశాలలో విస్తరించి ఉన్న ఉగ్రవాదం వల్ల దానిని కట్టడి చేయడం కష్టమైపోతున్నది. ఈ కొత్తరకం సమస్యకు సాధారణ పద్ధతుల్లో కాకుండా ఏదైనా కొత్తరీతిలో పరిష్కారాన్ని అన్వేషించాలె. ఇందుకు అమెరికా కూటమిలోని దేశాలే చొరవ చూపించాలె.

సందర్భం

దృశ్యానికి జీవం పోస్తున్న ఫొటోగ్రఫీ

మనిషి తన జీవన పోరాటంలో, ప్రకృతితో సహజీవనంలో తాను చూసిన ప్రకృతి అందాలకు రూపం, ఆకృతిని వ్వటంతో చిత్రకళ, శిల్పకళ ప్రారంభమయ్యాయి. మనిషి ఆరాట, పోరాటాలకు ప్రతిరూపంగా నిలిచాయి.ఈ క్రమంలోనే మనిషి జీవితంలోని వెలుగు నీడల చిత్రమాలికే ఫొటోగ్రఫీగా చెప్పుకోవచ్చు. ఆధునిక 'ఫొటో'కు రెండువందల ఏళ్ల చరిత్ర ఉన్నది. మొదట చిత్రకారులతో రాజకుటుంబీకులు, కులీనులు తమ చిత్రాలను గీయించుకునేవారు. కాలక్రమంలో చిత్రకళ స్థానంలో ఆధునిక ఫొటోగ్రఫీ పురుడు పోసుకున్నది. ఫ్రెంచీ దేశానికి చెందిన లూయిస్ డాగరే, జోసఫ్ ఎన్.నీప్సే 1837లో ఫొటో గ్రఫీకి ప్రాణంపోశారు. వీరు రూపొందించిన ఫొటో విధానానికి 'డాగరే టైప్' ఫొటో విధానంగా ఫ్రెంచీ అకాడమీ గుర్తించింది. దీన్నే మరుసటి సంవత్సరం ఫ్రెంచీ ప్రభుత్వం ఆగస్టు 19న ఆధికారికంగా గుర్తించి ప్రపంచానికి చాటి చెప్పింది. నాటినుంచి ప్రారంభమైన ఫొటోగ్రఫీ ఎంతో



దూరం ప్రయాణం చేసి నేడు నిత్యజీవితంలో భాగమైపోయింది. 1861లో వచ్చిన కలర్ ఫొటో మనిషి జీవితాన్ని సజీవంగా నిలిపి ఉంచటంలో ఉన్నత శిఖరాలకు చేరింది. ఈ క్రమంలోనే ఫొటోగ్రఫీకి ఎనలేని ప్రాధాన్యం ఏర్పడింది. మానవ వికాస చరిత్రకు సజీవ రూపం ఇస్తున్న 'ఫొటో' జీవకళకు ప్రతిరూపం.

- కంది సన్ని, 'నమస్తే తెలంగాణ' ఫొటోగ్రాఫర్

(నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం)

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ముక్తసరి



దేవులపల్లి ప్రభాకరరావు

మోదంలో ఖేదం

ఏటా చైత్ర మాస ఆరంభంలో ఉగాది పండుగ మానవ జీవతం ఎటువంటిదో రుచి చూపిస్తుంది, తాత్త్విక దృష్టితో. తీపి, చేదు మిళితమైనట్లే మోదం, ఖేదం మిళితమవుతుంటాయి. స్వతంత్ర భారతదేశం డెబ్బై ఒకటవ సంవత్సరంలో అడుగుపెట్టిన శుభ సందర్భంగా ఓ వంక కోట్లాది భారతీయులు స్వదేశంలో, ఇతర దేశాల్లో సంబురాలు జరుపుకుంటున్న సమయాన, దేశంలోని అన్నికంటే పెద్ద రాష్ట్రం యూపీలోని గోరఖ్‌పూర్‌లో, బాబా రాఘవదాస్ ప్రభుత్వ మెడికల్ కాలేజ్ హాస్పిటల్‌లో 2017 ఆగస్టు 7 నుంచి వరుసగా సంభవించిన శిశు మరణాలు ప్రమోద వాతావరణంలో అమిత ఖేదం కల్గించాయి.

గత డెబ్బై ఏండ్ల స్వతంత్ర దేశంలో ఏ రాష్ట్రంలోనూ, ఏ ప్రభుత్వ దవాఖానలోనూ ఇంత పెద్ద సంఖ్యలో ఒకేసారి, వరుసగా ఇన్ని శిశు మరణాలు బహుశా ఇంతకు ముందెన్నడూ సంభవించలేదు. ఈ హృదయ విదారక విషాద సంఘటనతో స్వతంత్ర భారతదేశం డెబ్బై ఒక్క సంవత్సరం ఆరంభమైనందుకు దేశ ప్రజలు బాధపడాలె, ఆత్మావలోకనానికి సిద్ధపడాలె. ఇవి కొద్దిపాటి దూరదృష్టితో, విజ్ఞతతో, స్వల్ప సమర్థతతో, అలక్ష్య ధోరణి లేకుండా అధికారంలో ఉన్నవారు వ్యవహరించినట్లయితే, ప్రతి ప్రాణం విలువైనదన్న స్పృహ ఉండినట్లయితే, శిశు మరణాలను తగ్గించడం స్వతంత్ర భారత ప్రభుత్వాల జాతీయ ఆరోగ్య విధానాల్లో ముఖ్య లక్ష్యం అన్న అవగాహన ఉన్నట్లయితే వందకు మించిన శిశువులు పుట్టిన వారం రోజుల్లోనే ప్రాణాలు కోల్పోయేవారు కాదు. ఒక తల్లికి ఆగస్టు 2న పుట్టిన కవలలను మరునాడు బాబా రాఘవదాస్ మెడికల్ కాలేజీ దవాఖాలో చేర్పించారు మెరుగైన వైద్య సహాయం అందుతుందన్న గంపెడాశతో. ఆ తల్లి ఎనిమిదేండ్ల నుంచి సంతానం కోసం కలలు గంటున్నది. బాబా రాఘవదాస్ దవాఖానలో చేర్చిన తర్వాత తగిన వైద్య సహాయం అందక ఎనిమిది రోజుల్లోనే ఆ కవలలు మృతిచెందారు. మూడు, నాలుగు నెలల కిందట రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో బీజేపీ అఖండ విజయం సాధించి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఇప్పటి ముఖ్యమంత్రి కాషాయాంబర ధారి ఆదిత్యనాథ్ జీ గత 25 ఏండ్ల నుంచి వరుసగా గోరఖ్‌పూర్ నియోజక వర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. పక్కనే ఉన్న వారణాసి నియోజకవర్గం నుంచి ప్రధాని మోదీ జీ లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఇక తమకు మంచి రోజులొచ్చాయని, తమ రాష్ట్రం ప్రభుత్వ దవాఖానల్లో, విశేషించి గోరఖ్‌పూర్ ప్రభుత్వ దవాఖానలో అత్యాధునిక వైద్య సదుపాయాలతో అత్యుత్తమ చికిత్స జరుగుతుందని యూపీ ప్రజలు ఆశించడం సహజమే. కానీ, అనతి కాలంలోనే ఆశాభంగం తప్పడం లేదు. ఇంతవరకు మోదీజీ ప్రభుత్వం మూడేండ్లు అయినప్పటికీ జాతీయ ఆరోగ్య విధానాన్ని రూపొందించలేదు. పొరుగుదేశం నేపాల్ వరకు గొప్ప దవాఖానగా పేరొందిన బాబా రాఘవదాస్ మెడికల్ కాలేజీ దవాఖానలో గత ఏప్రిల్ నుంచే ఆక్సిజన్ సిలిండర్‌ల కొరత ఏర్పడింది. రూ.యాభై లక్షల బిల్లు చెల్లించడం లేదని ప్రైవేట్ ఏజెన్సీ సిలిండర్ల సరఫరాను నిలిపివేసింది. ఈ సంగతులన్నీ రాష్ట్ర ముఖ్యమంత్రికి, వైద్య శాఖ మంత్రికి, డైరెక్టర్‌కు, ప్రిన్సిపాల్‌కు తెలుసని అధికార పత్రాలు పలుకుతున్నాయి. యూపీ ముఖ్యమంత్రి స్వచ్ఛభారత్, స్వాస్థ్య భారత్ గురించి ఉపదేశాలిస్తున్నారు. ఇటీవల యూపీలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి వ్యయం 13 శాతం తగ్గిందని నిన్నమొన్నటి ఆర్థిక సర్వే వెల్లడించింది. పసిబిడ్డల ప్రాణ రక్షణకు అత్యావశ్యకమైన ఆక్సిజన్ సిలిండర్ల బిల్లును సకాలంలో చెల్లించలేని దయనీయ స్థితి ఆ రాష్ట్రం తిరోగమనానికి ఒక సూచిక. పంద్రాగస్టు నాడు ఢిల్లీలో ఎర్రకోట నుంచి ప్రధాని ఈ దేశానికి ఇచ్చిన సందేశంలో న్యూ ఇండియా నిర్మాణం పిలుపునిచ్చారు. మనం ఇంకా ఓల్డ్ ఇండియాలోనే కునికిపాట్లు పడుతున్నామని గోరఖ్‌పూర్ శిశుమరణాలు వెల్లడించాయి.

ప్రపంచమంతా పసిబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నది. డెబ్బై ఏండ్ల స్వతంత్ర భారతదేశంతో పోల్చినప్పుడు, విశేషించి గత మూడేండ్లలో గణనీయమైన మలుపు వచ్చిందంటున్న భారత దేశంతో పోల్చినప్పుడు మన పొరుగున ఉన్న చిన్న దేశాల్లో శిశు మరణాల రేటు తక్కువగా ఉంది. ఒకదేశం, ఒక సమాజం ఆరోగ్య స్థాయికి శిశు మరణాల రేటు ముఖ్యమైన సూచిక అన్నది ఆరోగ్య నిపుణుల నిశ్చితాభిప్రాయం. దాదాపు నలభై ఏండ్ల కిందట 1978 సెప్టెంబర్‌లో, అల్మాఅటాలో (కజకిస్తాన్), ఐరాస ఆధ్వర్యంలో 'ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణ' అంశంపై నిర్వహించిన వివిధ దేశాల అంతర్జాతీయ సమావేశంలో 'అందరికీ ఆరోగ్యం' నినాదంతో ఆమోదించిన తీర్మానం 'అల్మా అటా డిక్లరేషన్'గా ప్రసిద్ధి పొందింది. అంతర్జాతీయ స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ఆమోదించిన మొట్టమొదటి డిక్లరేషన్ అది. ప్రపంచ ప్రజలందరి ఆరోగ్య పరిరక్షణ కోసం వెలువరించిన ఈ డిక్లరేషన్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థలో సభ్యత్వం గల దేశాలన్నీ ఆమోదించాయి. 'అందరికీ ఆరోగ్యం' నినాదంలో పసిబిడ్డల ఆరోగ్య పరిరక్షణ, శిశు మరణాలు-మాతృ మరణాల రేటు తగ్గింపు ప్రాధాన్యం వహించాయి. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు అల్మా అటా డిక్లరేషన్ స్ఫూర్తికి తగిన గుర్తింపు నూతన రాష్ట్రం తెలంగాణలో లభించడం విశేషం. యూపీతో పోల్చినప్పుడు తెలంగాణ మూడేండ్ల కిందట అవతరించిన కొత్త, చిన్న రాష్ట్రం. కానీ, సర్వతోముఖ ప్రగతి పథంలో ఈరోజు మొత్తం దేశంలో అన్ని రాష్ట్రాల కంటే ముందున్న రాష్ట్రం తెలంగాణ కావడం గర్వకారణం. ఓ వంక ఆర్థికాభివృద్ధికి, సంక్షేమ కార్యక్రమాలకు, సామాజిక వికాసానికి గత మూడేండ్ల నుంచి రాష్ట్రంలో కొనసాగుతున్న అద్భుత కృషి మరోవంక సామాన్య ప్రజల, పేదల జీవన ప్రమాణాలు పెరుగడానికి, తద్వారా వారి ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతున్నాయి. (మిషన్ భగీరథ ద్వారా ఇంటింటా సురక్షిత మంచినీటి సరఫరా జరుగడంతో నీటితో వ్యాపించే అనేక వ్యాధుల నిరోధం జరుగుతుంది). గోరఖ్‌పూర్ ప్రభుత్వ దవాఖాన దుస్థితికి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వ దవాఖానల ఆధునికాభివృద్ధికి ప్రభుత్వం అపూర్వ ప్రయత్నాలు జరుపుతున్నది. పసిబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు, బాలారిష్టాల నివారణకు కేసీఆర్ కిట్లు శ్రీరామ రక్ష. నలభై ఏండ్ల తర్వాత, రాష్ట్రంలో అల్మా అటా డిక్లరేషన్ ఆచరణలోకి రావడం అసాధారణ పరిణామం.

పంద్రాగస్టు ప్రసంగంలో ప్రధాని మోదీజీ క్విట్ ఇండియా ఉద్యమంలో గాంధీజీ 'భారత్ ఛోడో' అన్నారని, ఇప్పుడు 'భారత్ జోడో' భావనతో నూతన భారత్ నిర్మాణం జరుగాలన్నారు. మత, కుల తత్వం, టెర్రరిజం, అవినీతి, బంధు ప్రీతి ఉండని నవభారత్ నిర్మాణం జరుగాలన్నది ఉత్కృష్ట సంకల్పం. సోషలిస్ట్ నాయకుడు డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా తన అనుచరులకు 'తోడో యా జోడో' అన్న ఉపదేశం ఇచ్చేవాడు. ఇప్పటికీ మిగిలి ఉన్న ఆయన కొందరు అనుచరుల్లో ముఖ్యులు 'తోడో' ఉపదేశానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. 'భారత్ జోడో' 'న్యూ ఇండియా' ప్రధాని పంద్రాగస్టు ప్రసంగంలో వినిపించిన సరికొత్త నినాదాలు. నినాదాలతో, గంభీర భాషణలతో దేశం ముందుకెళ్తే డెబ్బై ఏండ్లలో చాలా ముందుకు వెళ్లి ఉండేది. 'గరీబీ హఠావో' నినాదం చాలా ఏండ్లు దేశ ప్రజలను తన్మయపరిచింది. "An apple a day keeps doctor away" అంటారు. "A slogan a day Keeps people away" అని ఇప్పుడనాలె. నినాదాలతో కొందరు కొంతకాలం కాలక్షేపం చేయవచ్చు. నోట్ల రద్దుతో అవినీతి, టెర్రరిజం, నల్లడబ్బు అన్నీ అంతమవుతాయనుకున్నాం. సర్జికల్ స్ట్రయిక్స్‌తో టెర్రరిజం నడ్డి విరుగుతుందనుకున్నాం. ఇప్పుడు జీఎస్టీతో 'ఒకే పన్ను, ఒకే దేశం' అంటున్నాం. ప్రధాని మోదీజీ మూడేండ్ల నుంచి ఎడతెగకుండా అవినీతి, టెర్రరిజం గురించి మాట్లాడుతున్నారంటే ఇవింకా అంతం కాలేదనుకోవాలె. వీటిది మొండి ఆయుస్సు. ఆయుధాలు కాదు ఆలింగనం ముఖ్యమని మోదీజీ పంద్రాగస్టు ప్రవచనంలో అన్నారు. పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌తో ఆలింగనం (గలే మిలాప్) తర్వాత పఠాన్‌కోట్, యూరీ దాడులతో, కశ్మీర్ లోయలో భారత సైనికులతో రాళ్ల యుద్ధంతో పరిస్థితి మరింత విషమించింది. గాంధీజీ పాద ధూళితో పవిత్రమైన సబర్మతి ఆశ్రమంలో చైనా అధ్యక్షుడికి సకల మర్యాదలు జరిపిన తర్వాత డోక్లామ్ సమస్య ఉరుముతున్నది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మన దోస్తనుకున్నాం. ఇక్కడ మనం స్వాతంత్ర్య సంబురాలు జరుపుకుంటున్న వేళ అక్కడ వాషింగ్టన్‌లో అమెరికా విదేశాంగ శాఖ భారత్‌లో మత దురభిమానం, అసహనం పెచ్చరిల్లుతున్నవని ఉదాహరణలతో వివరిస్తూ ఒక అధికార ప్రకటనను జారీచేసింది. మన దేశం సహనం, అసహనం సంగతుల గురించి మన దేశ వ్యవహారాల శాఖలో లేనన్ని వివరాలు అమెరికా (యూఎస్ఏ) స్టేట్ డిపార్ట్‌మెంట్‌లో ఉండటం విచిత్రం. మన అసహనం వైపు వేలెత్తి చూపిస్తున్న, మన నేతలకు వీసాలు నిరాకరిస్తున్న అమెరికాలో జాతి వివక్ష, జాతి విద్వేషం వెర్రితలలు వేసి తీవ్ర స్వరూపం ధరిస్తున్నాయి. అధ్యక్షుడు ట్రంప్ ఈ జాతి వివక్ష (రేసిస్ట్, సుప్రమసిస్ట్) దుష్టశక్తులను ప్రోత్సహిస్తున్నాడని, ఆయన ఫాసిస్టు అని అక్కడ విమర్శిస్తున్న వాళ్లున్నారు. ఇక్కడ అసహన శక్తులను ఏ ఇస్టులంటారో? ప్రధాని దృష్టిలో అవినీతి భయంకరమైనది, అంటరానిది, అస్పృశ్య. అవినీతి నిర్మూలనకు ఆయన కంకణం కట్టుకున్నారు. జయలలిత గూటిపక్షుల సంగతి వేరే కథ. అవినీతికి పాల్పడిందని ఆమెను జైల్లో పెట్టారు. బతికి ఉంటే ఆమె బెంగళూరు అగ్రహారం జైల్లో మరోమారు కారాగారవాసం చేయవలసి వచ్చేది. ఆమె అనుంగు చెలి శశికళ అదే అవినీతి కేసులో కటకటాల పాలయ్యారు. వీరిని ఇప్పటికీ ఆరాధిస్తున్న, ఆ చెట్ల మీది ఈ పిట్టలే సెల్వం, పళనిస్వామి ప్రధాని మోదీజీతో తరచూ మంతనాలు జరుపుతున్నారు. ఈ అవినీతి కుక్షులను ఆసరాగా చేసుకుని బీజేపీ తమిళనాడులో అరంగేట్రం చేయాలనుకుంటున్నదన్న వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. పంద్రాగస్టు రోజే దేశంలో కొన్నిచోట్ల అసహనం బుసలుకొట్టింది. ఇది జోడో భారత్‌కు దారితీస్తుందా? ప్రధాని పంద్రాగస్టు ప్రసంగంలో ప్రస్తావనకు రానివి దేశంలో చెలరేగుతున్న ద్రవ్యోల్బణం, ఆర్థికమాంద్యం, పలు పరిశ్రమల మూసివేత, తగ్గుతున్న ఎగుమతులు, పెరుగుతున్న దిగుమతులు, వికృతరూపంలో నిరుద్యోగం, రైతులోకంలో నిరాశా, నిస్పృహలు!

పంద్రాగస్టు రోజే దేశంలో కొన్నిచోట్ల అసహనం బుసలుకొట్టింది. ఇది జోడో భారత్‌కు దారితీస్తుందా? ప్రధాని పంద్రాగస్టు ప్రసంగంలో ప్రస్తావనకు రానివి దేశంలో చెలరేగుతున్న ద్రవ్యోల్బణం, ఆర్థికమాంద్యం, పలు పరిశ్రమల మూసివేత, తగ్గుతున్న ఎగుమతులు, పెరుగుతున్న దిగుమతులు, వికృతరూపంలో నిరుద్యోగం, రైతులోకంలో నిరాశా, నిస్పృహలు!

బీసీలకు కమిషన్ బాసట

సామాజికం



డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

ఆధునిక భారతంలో స్వాతంత్ర్యానంతరం కుటీర పరిశ్రమలను, ఉపాధి కల్పనను, సంపద సృష్టిని వికేంద్రీకరించాలని గాంధీజీ, రామ్‌మనోహర్ లోహియా వంటి జాతీయోద్యమ నాయకులు బలంగా ప్రచారం చేశారు. జాతీయోద్యమంలో సాగిన స్వదేశీ ఉద్యమంలో చేనేత రాట్నం చేబూని గాంధీజీ స్వయంగా నూలు ఒడుకుతూ దినచర్యలో భాగంగా గాంధీజీ ఇచ్చిన ప్రాధాన్యం, దూరదృష్టిని తెలుపుతున్నది. స్వాతంత్ర్యానంతరం పారిశ్రామికీకరణ ద్వారా భారీ పరిశ్రమలు, ప్రాజెక్టులు, పెట్టుబడుల ద్వారా సంపద, ఉత్పత్తి, ఉపాధి కల్పన, పారిశ్రామికీకరణ, నగరీకరణ పెరిగింది. ఈ క్రమంలోనే వ్యవసాయంలో ఆధునికీకరణ వేగం పుంజుకోవాలని ప్రణాళికాసంఘం, కేంద్ర ప్రభుత్వం పంచవర్ష ప్రణాళికల్లో ప్రాధాన్యం ఇచ్చాయి. కానీ శతాబ్దాలుగా కొనసాగుతూ వచ్చిన కుటీర పరిశ్రమల సంపద సృష్టిని, ఉత్పత్తిని, సేవలను, వాటి ఆధునీకరణలో కొంత నిర్లక్ష్యం కూడా చోటు చేసుకున్నది. శతాబ్దాలుగా దేశానికి మూలస్తంభంగా నిలిచిన ఈ ఉత్పత్తి విధానాన్ని, వాటి నిపుణులను, నైపుణ్యాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారు. కొన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినా చేతి వృత్తులు పూర్వవైభవం క్రమంగా కోల్పోయాయి. స్వయం పోషకంగా ఉండిన కోట్లాది ప్రజలను ఆశ్రితులుగా దిగజార్చారు. ఆక్రమంలో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని, ఉపాధి, ఉత్పత్తి వ్యవస్థలను దెబ్బతీశారు.

అందమైన భవనాలు, కత్తులు, కటారులు, నగలు, అలంకరణలు, బట్టలు, ఆహారం, ఆహార్యం అన్నీ ఉత్పత్తి కులాలైన శూద్రులు సృష్టించిన సంపదే. వైజ్ఞానికంగా, పారిశ్రామికంగా, సంపద, నైపుణ్యాల పరంగా చూసినప్పుడు భారతీయ చరిత్ర నిర్మాతలు శూద్రులే. రెండువేల ఏండ్లుగా ఎన్ని యుద్ధాలు జరిగినా, రాజ్యాలు, సామ్రాజ్యాలు మారినా, మతాలు, సంఘర్షణలు ఎన్ని జరిగినా కుల వృత్తులు చెక్కు చెదరకుండా ఉన్నాయి. సమాజం అల్లకల్లోలమైనా, కుటీర పరిశ్రమలు, చేతి వృత్తులు నిరంతరం సంపదను సృష్టిస్తూ, ఉత్పత్తులు అందించాయి.

సమాజం స్థిరంగా కొనసాగడానికి చేసిన త్యాగాలు, నైపుణ్యాల అభివృద్ధి చరిత్రలో నమోదు కాలేదు. ప్రాధాన్యం ఇవ్వబడలేదు. భారతదేశం ఎన్ని దండయాత్రలకు గురైనా సకల సంపదలతో విరాజిల్లుతూ, ఇతర దేశాలను ఆకర్షించడానికి, కుటీర పరిశ్రమల ద్వారా, చేతివృత్తుల ద్వారా, ప్రకృతి వనరుల ద్వారా సృష్టించిన సంపద, ఉత్పత్తులు, నైపుణ్యాలే ప్రధాన కారణం.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత అనేక పోరాటాలు ఉద్యమాలు, త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ తనను తాను స్వయంశక్తిగా ఎదిగించుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర తొలి బీసీ కమిషన్ గురుతర కర్తవ్యాలను నిర్ణయించుకొని ముందుకు సాగుతున్నది. వాటి చరిత్రను, సంస్కృతిని చరిత్రలో వారు నిర్వహించిన పాత్రను బీసీ కమిషన్ సేకరిస్తున్నది. డాక్యుమెంటేషన్‌కు కార్యాచరణను మొదలుపెట్టింది. రాష్ట్రాన్ని నూతన జవసత్వాలతో అభివృద్ధిపరుచడానికి జరుగుతున్న ప్రయత్నాల్లో కీలక భూమిక వహించాలనుకుంటున్నది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అనేక ప్రణాళికలు దేశంలోని పలు రాష్ట్రాలు మార్గదర్శకంగా తీసుకోవడం గమనించదగింది. కొన్ని పథకాలను కేంద్రం కూడా స్వీకరించి అమల్లోకి తీసుకువస్తున్నది. రాష్ట్ర కీర్తి ప్రతిష్ఠలను, గౌరవాన్ని ఇనుమడించే విధంగా తొలి బీసీ కమిషన్ కృషి కొనసాగిస్తున్నది. దశాబ్దాలుగా బీసీలు చరిత్ర పరిణామంలో జరిగిపోయిన అన్యాయాలను, అణచివేతను, వివక్షను, అవకాశాల నిరాకరణను తొలగించింది. ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించి, ఆత్మవిశ్వాసం కలిగించడంలో నూతన తరాలు అభివృద్ధి పథంలో ముందుకు నడుస్తూ సంపదను పెంచడంలో రాష్ట్ర ప్రభుత్వం చేసే కృషికి బీసీ కమిషన్ సిఫార్సులు బాసటగా నిలువాలని ప్రయత్నిస్తున్నది.

ఉపాధి కల్పన, కుటీర పరిశ్రమలు, సంపద సృష్టి, సేవలు, ఉపాధి ప్రాధాన్యాన్ని బీసీ కమిషన్ గుర్తించింది. అయితే అప్పటికే కొన్నితరాలు శిథిలమైపోయాయి. శతాబ్దాలుగా కొనసాగిన నైపుణ్యాలు, వాటి వారసత్వం అందుకునేవారు లేక నశిస్తూ వచ్చాయి. ఆధునిక విద్యావిధానం శతాబ్దాల సంపద సృష్టి, ఉత్పత్తి ప్రక్రియలు, సేవలను చిన్నచూపు చూసేట్టు చేసింది. ఆయుర్వేదాన్ని నిరాకరించింది. అల్లోపతిని ఆహ్వానించింది. గ్రామీణ చేనేత, చెప్పులు, వడ్రంగుల ఫర్నీచర్ ఉత్పత్తులు, విశ్వబ్రాహ్మణుల ఇత్తడి బిందెలు, చెంబులు, నాగటికర్రు, బండిచక్రం లాంటివి నిర్లక్ష్యం చేయబడ్డాయి. మార్కెట్లోకి వ్యాపార పారిశ్రామిక సరుకులు, ఆ తర్వాత పాలిస్టర్, ప్లాస్టిక్, ఫైబర్ ఉత్పత్తులు ముంచెత్తాయి.

ప్రపంచీకరణలో అన్ని బహుళజాతి కంపెనీలకు తలుపులు బార్లా తెరువడంతో ఆట వస్తువులు మొదలుకొని సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, ఐప్యాడ్ల దాకా దేశాన్ని ముంచెత్తి లక్షల కోట్లు తరలించబడుతున్నాయి. ఇవి ఈ దేశంలోనే తయా రుచేసే ప్రణాళికలు, నైపుణ్యాభివృద్ధిపరిచి ఉంటే కోట్లాదిమందికి ఉపాధి నైపుణ్యాలు పెరిగి ఉండేవి. దేశ సంపద దేశంలోనే మిగిలి ప్రజల జీవన ప్రమాణాలు వృద్ధిచెంది ఉండేవి. దూపయినప్పుడే బావి తవ్వాలనుకోవడం వల్ల దూప తీరదు. ప్రపంచీకరణ వెల్లువెత్తి దేశ సంపదను కొల్లగొడుతుంటే నేటికీ కనువిప్పు కలుగటం లేదు.

ఈ దశలో నూతన భాగ్యోదయంతో 'తెలంగాణ రాష్ట్రం సమగ్ర అభివృద్ధి నమూనా'తో ముందుకువచ్చింది. తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ఉత్పత్తులను, ఉపాధి అవకాశాలను పెంచడానికి ప్రణాళికలు రచించింది. చరిత్రలో గత 150 ఏండ్లుగా జరిగిన నష్టాన్ని గమనించి గ్రామీణ నైపుణ్యాలను, ఉపాధి అవకాశాలను పెంచి సంపద సృష్టిని వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతున్నది. వాటి ఫలితాలు కూడా కళ్ళ ముందు కనపడుతున్నది.

తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ఉత్పత్తులను, ఉపాధి అవకాశాలను పెంచడానికి ప్రణాళికలు రచించింది. చరిత్రలో గత 150 ఏండ్లుగా జరిగిన నష్టాన్ని గమనించి గ్రామీణ నైపుణ్యాలను, ఉపాధి అవకాశాలను పెంచి సంపద సృష్టిని వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ముందుకుపోతున్నది.

(వ్యాసకర్త: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నెత్తురోడిన తుర్కు

- ఫిన్లాండ్ కత్తిపోట్లలో ఇద్దరు మృతి.. జర్మనీలో మరొకరు
- ఉగ్రవాదుల చర్యగా అనుమానం
- 14కు చేరిన స్పెయిన్ మృతుల సంఖ్య
- 9మంది అనుమానితుల కాల్చివేత



తుర్కు మార్కెట్‌స్క్వేర్‌లో దుండగుడి కత్తిపోట్లకు గురై మరణించిన వ్యక్తి (వృత్తంలో) చుట్టూ గుమిగూడిన ప్రజలు

హెల్సింకి/బెర్లిన్/బార్సిలోనా, ఆగస్టు 18: బార్సిలోనాలో ఉగ్రవాదుల చేతిలో హతమైన పౌరుల నెత్తుటి తడిఆరకముందే, ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో దుండగుల దాడిలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ రెండు ఘటనల్లో తొమ్మిది మంది గాయపడ్డారు. ఫిన్లాండ్‌లోని తుర్కు నగరంలో ఓ దుండగుడు కనబడినవారినల్లా కత్తితో కిరాతకంగా గాయపరిచాడు. ఈ కత్తిపోట్లలో ఇద్దరు పౌరులు మృతిచెందగా, ఎనిమిది మంది గాయపడ్డారని ప్రాథమిక సమాచారం. రద్దీగా ఉండే నగరంలోని దక్షిణ ప్రాంతాన్నే ఆగంతకుడు ఎంచుకున్నాడని, అతడి కాళ్లపై కాల్పులు జరిపి సజీవంగా పట్టుకున్నామని ఫిన్లాండ్ పోలీసులు తెలిపారు. దీనివెనుక టెర్రరిస్టుల ప్రమేయం ఉండవచ్చని వారు అనుమానిస్తున్నారు. ఇక బెర్లిన్‌లోనూ ఇదే తరహాలో జరిగిన దాడిలో ఓ పౌరుడు మృతిచెందారు. పశ్చిమ జర్మనీ నగరమైన వుప్పర్‌టాల్‌లోని ఎల్బర్‌ఫెల్డ్ ప్రాంతంలో జరిగిన ఈ కత్తిపోట్లలో మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనకు పాల్పడింది ఎందరో తెలియదని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు చెప్పారు. బార్సిలోనాలో జరిగిన జంట ఘటనల్లో 14మంది చనిపోయిన నేపథ్యంలో యూరప్‌లోని పలుదేశాలు అప్రమత్తమయ్యాయి. నిఘాను తీవ్రం చేసి, ముఖ్యనగరాల్లో భద్రతను పెంచారు. మరికొన్ని నగరాల్లోనూ ఉగ్రవాదులు రకరకాల తరహాలో దాడులకు తెగబడవచ్చని భావిస్తున్నారు.

స్పెయిన్‌లో 9 మంది అనుమానితుల కాల్చివేత

స్పెయిన్‌లోని బార్సిలోనా, కాంబ్రిల్స్ నగరాల్లో ఉగ్రవాదులు జరిపిన జంట దాడుల్లో మృతుల సంఖ్య 14కు చేరింది. ఈ రెండు ఘటనల్లోనూ సుమారు వందమంది వరకు గాయపడ్డారు. గురువారం నగరంలోని లాస్ రాంబ్లాస్ బోలేవర్డ్ వీధిలో టెర్రరిస్టులు జరిపిన దాడిలో 13మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే కాంబ్రిల్స్ నగరంలోనూ దాడి జరిగింది. బార్సిలోనాలో జరిగిన ఉగ్రదాడిని కాంబ్రిల్స్‌లోనూ పునరావృతం చేయాలన్న ఉగ్రవాదుల యత్నాన్ని పోలీసులు భగ్నంచేశారు. కొందరు వ్యక్తులు ఓ వ్యాన్‌ను విచక్షణారహితంగా ప్రజలపైకి తీసుకెళ్లారు. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా పలువురు గాయపడ్డారు. బార్సిలోనా ఘటనను పునరావృతం చేయడమే లక్ష్యంగా ఈ దుశ్చర్యకు ఒడిగట్టారు. వారిని లొంగిపోవాలని పోలీసులు హెచ్చరించినా ఫలితం లేకపోవడంతో భద్రతాదళాలు నలుగురు దుండగులను కాల్చిచంపాయి. బార్సిలోనాలోనూ ఐదుగురు అనుమానితులనూ స్పెయిన్ పోలీసులు శుక్రవారం కాల్చిచంపారు. లాస్‌రాంబ్లాస్ వీధిలో జరిగిన వ్యాన్ దాడి ఘటన తర్వాత పోలీసులు ఉగ్రవాదుల కోసం అన్వేషణను ముమ్మరం చేశారు.



దాడి అనంతరం వ్యాన్‌లో తిరుగుతున్న ఇద్దరు అనుమానితులను బార్సిలోనా పిక్చర్‌స్క్వేర్‌లాస్ వద్ద అరెస్టు చేశారు. వ్యాన్ డ్రైవర్ కాలినడకన పారిపోయాడు. దాడులకు పాల్పడింది తామేనని ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ ప్రకటించింది. ఉగ్రదాడి అనంతరం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులకు శుక్రవారం తెల్లవారుజామున బెల్టుబాంబులు కలిగిన ఐదుగురు అనుమానితులు కనిపించారు. వారిని అక్కడికక్కడే కాల్చిచంపారు.

స్పెయిన్ దాడిలో తప్పించుకున్న భారత సంతతి నటి

భారత సంతతికి చెందిన టెలివిజన్ నటి లైలా రూసాస్ స్పెయిన్ ఉగ్రవాదుల దాడి నుంచి తృటిలో తప్పించుకున్నారు. లాస్‌రాంబ్లాస్ వీధిలోని రెస్టారెంట్‌లోకి టెర్రరిస్టులు దూసుకెళ్లినప్పుడు లైలా (46) తన పదేండ్ల కుమార్తె ఇనేజ్ ఖాన్‌తో కలిసి అక్కడే ఉన్నారు. టెర్రరిస్టులు రెస్టారెంట్‌లోకి ప్రవేశించగానే, తన కూతురిని తీసుకుని లైలా మెరుపువేగంతో ఓ ఫ్రీజర్‌లో దాక్కున్నారు. కాల్పుల శబ్దం వింటూ ఆందోళనకు గురయ్యామని, ఆ సమయంలో అందరినీ కాపాడాలంటూ దేవుడ్ని ప్రార్థించానని లైలా ట్విట్టర్‌లో తెలిపారు. మొరాకో తండ్రికి, భారతీయ తల్లికి పుట్టిన లైలా రూసాస్ బ్రిటన్‌లో ప్రఖ్యాత టీవీ నటీమణుల్లో ఒకరు. ఆమె తన టెలివిజన్ కెరీర్‌ను భారత్‌లోనే ప్రారంభించారు. 1990లో 'చానల్-వీ'లో ఆమె వీడియోజాకీగా పనిచేశారు. బ్రిటిష్ స్నూకర్ ప్లేయర్ రోనీ ఓసులివన్‌ను ఆమె పెళ్లాడారు. 'అదృష్టవశాత్తు తాను, తన కూతురు బతికామని, అంతటి భయోద్విగ్న పరిస్థితుల్లోనూ నాలాంటి వారందరికీ ధైర్యం చెప్పిన రెస్టారెంట్ సిబ్బందికి ధన్యవాదాలు. ఐ లవ్ బార్సిలోనా' అని లైలా ట్వీట్ చేశారు.

సోషల్ మీడియాకు ఈసీ కళ్లెం

- రాజకీయ పార్టీలకు అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని మార్చే సంస్థల నియంత్రణ
- ఓ విధానాన్ని రూపొందిస్తున్నట్టు వెల్లడించిన ఎలక్షన్ కమిషనర్ రావత్



ఎలక్షన్ కమిషనర్ రావత్

న్యూఢిల్లీ, ఆగస్టు 18: రాజకీయ పార్టీలు ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మలుచుకొనేందుకు కొన్ని పౌర సంబంధాల సంస్థల సహాయం తీసుకుంటున్నట్టు ఎన్నికల కమిషన్ గుర్తించింది. ఈ సమస్యను పరిష్కరించేందుకుగాను త్వరలోనే సామాజిక మాధ్యమాలకు కళ్లెం వేసే విధానాన్ని రూపొందించనున్నది. పౌర సంబంధాల సంస్థల ఆధ్వర్యంలో పనిచేసే కొందరు ఆపరేటర్లు డబ్బులు తీసుకొని ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయాన్ని కొన్ని రాజకీయ పార్టీలకు అనుకూలంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని ఎలక్షన్ కమిషనర్ ఓపీ రావత్ పేర్కొన్నారు. మొబైల్ ఇంటర్నెట్ పరిజ్ఞానం విస్తరణతో సామాజిక మాధ్యమాల ప్రభావం కూడా పెరిగిందన్నారు. దీంతో సామాజిక మాధ్యమాలను కూడా మీడియాగా గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందని, వాటిలో వచ్చే అంశాలను పరిశీలించాల్సి ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. 'ఇందుకోసం ఎలక్షన్ కమిషన్ ఒక విధానాన్ని రూపొందిస్తున్నదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను' అని ఆయన అన్నారు. 'ఎన్నికలు, రాజకీయ సంస్కరణలు' అంశంపై అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) ఢిల్లీలో నిర్వహించిన సంప్రదింపుల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాజకీయ వర్గాలు నైతిక విలువలకు తిలోదకాలిచ్చి గెలువడమే ముఖ్యమన్నట్టుగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా, పారదర్శకంగా జరిగినప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని అన్నారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులను ప్రలోభపెట్టి తమవైపు తిప్పుకోవడాన్ని తెలివైన రాజకీయంగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. తమ మాట వినని వారిని ప్రలోభపెట్టేందుకు లేదా బెదిరించేందుకు ధనాన్ని, ప్రభుత్వ యంత్రాంగాన్ని వ్యూహాత్మకంగా ప్రయోగిస్తున్నారని రావత్ చెప్పారు. గుజరాత్‌లో ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న నాటకీయ పరిణామాల నేపథ్యంలో ఎలక్షన్ కమిషనర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'నేటి నయా రాజకీయ విధానంలో ఎన్ని ఎత్తులైనా వేసి గెలుస్తే చాలు.. విజేతగా నిలిచిన వ్యక్తికి ఏ పాపం అంటదు. అధికార పక్షంవైపు పార్టీ ఫిరాయిస్తే అంతకుముందు ఎన్ని తప్పులు, నేరాలు చేసినా స్వచ్ఛమైనవారుగా మారుతారు' అని రావత్ వ్యాఖ్యానించారు. రాజకీయ నైతిక విలువలకు ఇది కొత్త నిర్వచనంగా మారుతున్నదని అన్నారు. ఈ విపరిణామాలను అరికట్టేందుకు, మెరుగైన ఎన్నికల వ్యవస్థ, ఉత్తమ భవిష్యత్ కోసం అన్ని రాజకీయ పార్టీలు, నాయకులు, మీడియా, పౌర సమాజం, రాజ్యాంగ అధికారులు, ప్రజాస్వామ్యంపై విశ్వాసమున్న వారందరూ ముందుకు రావాలని చెప్పారు.

ముందుకుసాగని విలీన ప్రక్రియ

- తమ తమ గ్రూపులతో చర్చిస్తున్న అన్నాడీఎంకే నేతలు
- క్యాబినెట్ సహచరులతో సీఎం పళనిస్వామి భేటీ
- మద్దతుదారులతో మాజీ సీఎం పన్నీర్ సెల్వం సమావేశం



చెన్నై, ఆగస్టు 18: అన్నాడీఎంకే విలీనం దిశగా చీలికగ్రూపులు ప్రయత్నిస్తున్నప్పటికీ, చర్చల దశను దాటి పురోగతి కనిపించడం లేదు. ఫలితంగా విలీనానికి మరి కొంత సమయం పట్టవచ్చని భావిస్తున్నారు. శుక్రవారానికల్లా విలీన ప్రకటన వెలువడుతుందని అంతా అనుకున్నప్పటికీ, మరికొన్ని రోజులు పట్టవచ్చని తెలుస్తున్నది. పన్నీర్ సెల్వం వర్గం డిమాండ్ మేరకు జయలలిత మృతిపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశిస్తున్నట్లు తమిళనాడు సీఎం పళనిస్వామి గురువారం ప్రకటించిన నేపథ్యంలో ఇరుగ్రూపుల మధ్య విలీనానికి మార్గం సుగమమైంది. శుక్రవారం సీఎం పళనిస్వామి, మాజీ సీఎం పన్నీర్‌సెల్వం తమ తమ వర్గం నేతలతో చర్చలు జరిపారు. పళనిస్వామి తన క్యాబినెట్ సహచరులతో భేటీ అయ్యారు. విలీనానికి ఉన్న ఆటంకాలతో పాటు, దినకరన్ వైపు నుంచి వచ్చే ఒత్తిళ్లపైనా వారు చర్చించినట్లు సమాచారం. ఇక మద్దతుదారులతో పన్నీర్ సెల్వం తన నివాసంలో సమావేశమయ్యారు. పన్నీర్ సెల్వానికి 10మంది శాసనసభ్యులు, 12మంది ఎంపీల మద్దతు ఉంది. జయలలిత మృతిపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని, ఆమె నివాసమైన పోయెస్ గార్డెన్‌లోని వేదనిలయాన్ని స్మృతికేంద్రంగా మార్చాలని పన్నీర్ సెల్వం వర్గం మొదటినుంచీ డిమాండ్ చేస్తూ వస్తున్నది. ఆ షరతులను అంగీకరిస్తూ.. సీఎం పళనిస్వామి గురువారం ప్రభుత్వ నిర్ణయాలను ప్రకటించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి శశికళను, ఆమె మేనల్లుడు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ టీటీవీ దినకరన్‌ను పార్టీ నుంచి బహిష్కరించాలన్న మరో డిమాండ్ కూడా నెరవేరిన నేపథ్యంలో ఏఐఏడీఎంకే విలీనానికి అన్ని అడ్డంకులు తొలిగినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు. తొలుత సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు పన్నీర్‌సెల్వం లాంఛనంగా ఒక ప్రకటన చేసే అవకాశముందని వారు చెప్తున్నారు.

విలీనం ఎక్కువ కాలం కొనసాగలేదు : దినకరన్

ఏఐఏడీఎంకేలోని పళనిస్వామి వర్గం, పన్నీర్ సెల్వం వర్గం ఒక్కటైనా, విలీనం ఎక్కువ కాలం కొనసాగదని ఏఐఏడీఎంకే (అమ్మ) వర్గం నేత టీటీవీ దినకరన్ అభిప్రాయపడ్డారు. శశికళ జన్మదినం సందర్భంగా ఆమెను కలిసేందుకు శుక్రవారం కర్ణాటక లోని పరంపన అగ్రహార జైలుకు వెళ్లిన దినకరన్ అనంతరం మీడియాతో మాట్లాడారు. దివంగత నేత జయలలిత నివాసం పోయెస్‌గార్డెన్‌ను స్మృతికేంద్రంగా మారుస్తామన్న సీఎం పళనిస్వామి ప్రకటనను జయలలిత మేనకోడలు దీపా జయకుమార్ తప్పుబట్టారు. దీనిపై కోర్టుకెళ్తామని స్పష్టంచేశారు.

కశ్మీర్ సమస్య, ఉగ్రవాదం, నక్సలిజం 2022 కల్లా మాయం : రాజ్‌నాథ్

న్యూఢిల్లీ, ఆగస్టు 18: కశ్మీర్ సమస్యకు 2022నాటికి పరిష్కారం దొరుకుతుందని, దాంతోపాటు ఉగ్రవాదం, నక్సలిజం, ఈశాన్య రాష్ట్రాల తీవ్రవాదం వంటి సమస్యలన్నీ పరిష్కారమవుతాయని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. శుక్రవారం ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో 'నవభారత నిర్మాణ సంకల్పం' పేరిట జరిగిన ఓ కార్యక్రమానికి రాజ్‌నాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. '2022 నాటికి నవభారత్ నిర్మిస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. 2022 నాటికి దేశంలో అశాంతికి కారణమవుతున్న ఉగ్రవాదం, నక్సలిజం వంటి సమస్యలన్నిటికీ పరిష్కారాలు దొరుకుతాయి. ఆ మేరకు దేశ ప్రజలకు మేము హామీ ఇస్తున్నాం' అని హోంమంత్రి తెలిపారు. 2022 నాటికి దారిద్ర్యం, ఉగ్రవాదం లేని, అవినీతి రహిత భారత్‌ను నిర్మిద్దామని ఆయన కార్యక్రమానికి హాజరైన వారిచే ప్రతిజ్ఞ చేయించారు.



సిక్కింలోని సరిహద్దులో భారత్, చైనా సైనికులు (ఫైల్)



జపాన్ రాయబారి కెంజి హిరామత్సు

డోక్లామ్‌పై భారత్‌కు జపాన్ మద్దతు

- యథాతథస్థితిని బలప్రయోగంతో మార్చవద్దంటూ చైనాకు హితవు
- జపాన్‌కు వాస్తవాలు తెలియవన్న చైనా

న్యూఢిల్లీ, ఆగస్టు 18: డోక్లామ్ వివాదంలో చైనా క్రమంగా దౌత్యపరమైన పట్టును కోల్పోతున్నది. డోక్లామ్ ప్రతిష్టంభనలో భారత్ వైఖరికి ఇప్పటికే అమెరికా, బ్రిటన్‌లు మద్దతునివ్వగా, తాజాగా జపాన్ కూడా తోడయ్యింది. డోక్లామ్‌లో చైనా రోడ్డు నిర్మించడంపై జపాన్ స్పందిస్తూ ఏ దేశమైనా యథాతథ స్థితిని ఏకపక్షంగా బలప్రయోగంతో మార్చేందుకు ప్రయత్నించరాదని స్పష్టం చేసింది. డోక్లామ్‌లో పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని భారత్‌లోని జపాన్ రాయబార కార్యాలయం తెలిపింది. 'భూటాన్, చైనా మధ్య డోక్లామ్ వివాదాస్పద ప్రదేశమని గుర్తించాం. ఉభయ దేశాలు సరిహద్దుపై చర్చలు జరుపుతున్నాయి. భూటాన్‌తో ఉన్న ఒప్పందం కారణంగానే భారత సైన్యాలు డోక్లామ్ అంశంలో జోక్యం చేసుకున్నాయని తెలుసు' అని భారత్‌లో జపాన్ రాయబారి కెంజి హిరామత్సు పేర్కొన్నారు. అనేక ప్రపంచ దేశాలతో దౌత్యపరంగా సానుకూల సంబంధాలు కలిగి ఉన్న నేపథ్యంలో భారత్‌కు డోక్లామ్ అంశంలో మద్దతు పెరుగుతున్నది.

జపాన్ మద్దతుపై చైనా విస్మయం

డోక్లామ్ అంశంలో భారత్‌కు జపాన్ మద్దతు తెలుపడం చైనాను విస్మయపరిచింది. డోక్లామ్ గురించి జపాన్‌కు వాస్తవాలు తెలియవని వ్యాఖ్యానించింది. సిక్కిం సరిహద్దులోని డోక్లామ్‌లో యథాతథస్థితిని మార్చేందుకు భారత్ ప్రయత్నించిందని, తాము కాదని తెలిపింది. వాస్తవాలు తెలియకుండా జపాన్ రాయబారి అటువంటి వ్యాఖ్యలు చేయరాదని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి హువా చున్యింగ్ పేర్కొన్నారు.

జపాన్ మద్దతు వెనుక కారణాలివీ

తూర్పు చైనా సముద్రంలో చైనా ఆధిపత్యాన్ని జపాన్ మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నది. తూర్పు చైనా సముద్రంతోపాటు హిమాలయాల్లో చైనా దురాక్రమణను అడ్డుకొనేందుకు ఒక కూటమిని ఏర్పాటు చేయాలని 2014లో జపాన్ భారత్‌కు సూచించింది. తూర్పు చైనా సముద్రంలో చైనా ఎయిర్ డిఫెన్స్ ఐడెంటిఫికేషన్ జోన్‌ను ఏర్పాటు చేయడాన్ని జపాన్ వ్యతిరేకించింది. ఇక ఈ ఏడాది మే నెలలో చైనాకు చెందిన నాలుగు యుద్ధ నౌకలు, ఒక మానవ రహిత విమానం జపాన్‌కు చెందిన సెంకాకు దీవులలో ప్రవేశించాయి. అప్పుడు కూడా జపాన్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. డోక్లామ్ విషయంలో చైనా వాదనను సమర్థిస్తే సెంకాకు దీవుల విషయంలో మూల్యం చెల్లించాల్సి వస్తుందని జపాన్ గ్రహించింది.

చర్చలు కొనసాగిస్తాం : భారత్

డోక్లామ్ ప్రతిష్టంభనకు పరస్పరం ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం చైనాతో చర్చలు కొనసాగిస్తామని భారత్ శుక్రవారం పునరుద్ఘాటించింది. అంతకన్నా ముందు సరిహద్దులో శాంతి నెలకొనాలని విదేశాంగ శాఖ ప్రతినిధి రవీశ్ కుమార్ పేర్కొన్నారు.

పవర్‌గ్రిడ్, టెలికాం నిబంధనలు కఠినతరం

- చైనాకు చెక్ పెట్టేందుకే..

దేశంలోని కీలకమైన రంగాలలోకి చైనా ప్రవేశాన్ని నియంత్రించేందుకు విద్యుత్, టెలికాం రంగాల్లో నిబంధనలను భారత్ మరింత కఠినతరం చేయనుంది. చైనాకు చెందిన హార్బిన్ ఎలక్ట్రిక్, డోంగ్‌ఫాంగ్ ఎలక్ట్రానిక్స్, షాంగై ఎలక్ట్రిక్, సిఫాంగ్ ఆటోమేషన్ తదితర సంస్థలు దేశంలోని 18 నగరాలలో విద్యుత్ సరఫరా నెట్‌వర్క్‌ను నియంత్రిస్తున్నాయి. విద్యుత్ రంగంలో చైనా భాగస్వామ్యాన్ని దేశీయ సంస్థలు మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నాయి. తమకు చైనా మార్కెట్లలో ప్రవేశం లేకపోగా, ఆ దేశ కంపెనీలు ఇక్కడ ఆధిపత్యం చెలాయిస్తున్నాయని మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం చర్యలకు దిగింది.

భూములు వినియోగించని పరిశ్రమలకు జరిమానా

టీఎస్ఐఐసీ పాలకమండలి నిర్ణయం ■ ఆస్తిపన్ను చెల్లింపులకు ప్రత్యేక యాప్ ఆవిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పరిశ్రమలకు కేటాయించిన భూములను నిర్ణీత గడువులోగా వినియోగించని పారిశ్రామికవేత్తలపై అపరాధ రుసుం విధించాలని టీఎస్ఐఐసీ నిర్ణయించింది. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని టీఎస్ఐఐసీ కార్యాలయంలో చైర్మన్ గ్యాదరి బాలమల్లు అధ్యక్షతన సంస్థ 13వ పాలకమండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. పరిశ్రమల స్థాపనలో జాప్యం చేసిన వారిపై మూడు రకాల పద్ధతుల్లో 15శాతం వరకు జరిమానా విధించాలని, కేటాయించిన ప్లాట్లను పారిశ్రామికవేత్తలు విక్రయించుకోవడాన్ని నిలువరించాలని పాలకవర్గం ఈ సందర్భంగా నిర్ణయించింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో విలీనమైన గ్రామ పంచాయతీలలోని 24 ఐలాలకు(పారిశ్రామిక ప్రాంత స్థానిక ప్రాధికార సంస్థలకు) మున్సిపల్ కార్పొరేషన్ అధికారాలను, విధులను బదిలీ చేయడానికి టీఎస్ఐఐసీ పాలకవర్గం అంగీకరించింది. దీంతో ఐలాల పరిధిలో వసూలైన ఆదాయపన్నులో ఇకపై 35శాతం వాటా మాత్రమే పన్ను మున్సిపల్ కార్పొరేషన్‌కు వెళుతుంది. ఇప్పటివరకు 35 శాతం నుంచి 50 శాతం వాటా కార్పొరేషన్‌కు వెళ్లేది. సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో వైద్యపరికరాల ఉత్పత్తి కొరకు 546 ఎకరాల్లో ప్రత్యేక పారిశ్రామికవాడ ఏర్పాటుకు సమావేశం ఆమోదం తెలిపింది. పారిశ్రామిక పార్కుల పరిధిలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్, గ్యాస్ ఔట్‌లెట్లు ఏర్పాటు చేయాలని పాలకవర్గం నిర్ణయించింది. దీనికి అవసరమైన విధివిధానాలను రూపొందించే బాధ్యతను టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డికి అప్పగించింది. సమావేశంలో పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, విద్యుత్‌శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్‌మిశ్రా, పరిశ్రమలశాఖ కమిషనర్ అహ్మద్ నదీం, కాలుష్యనియంత్రణమండలి కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపులకు యాప్..

పారిశ్రామిక ప్రాంత స్థానిక ప్రాధికార సంస్థ(ఐలా) పరిధిలో ఆస్తిపన్నులను ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు వీలుగా టీఎస్ఐఐసీ ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. దీనిని సంస్థ చైర్మన్ బాలమల్లు లాంఛనంగా ప్రారంభించారు. యాప్ ద్వారా పారిశ్రామిక ప్రాంతాల్లో ఆస్తులున్న వారు ఎక్కడి నుంచైనా పన్ను చెల్లించే వెసులుబాటు కలుగుతుంది. ఈ కార్యక్రమంలో టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, సీఈ లక్ష్మీకాంతరెడ్డి, సీజీఎం గీతాంజలి, జీఎం శ్యాంసుందర్, డీజీఎం శారద, మేనేజర్ విఠల్ పాల్గొన్నారు.

అత్యవసరంగా వినియోగించే కార్లకే బుగ్గలు

మార్గదర్శకాలు రూపొందించిన కేంద్రం ■ రాష్ట్రాలు విధిగా అమలుచేయాలని స్పష్టీకరణ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బుగ్గ కార్లపై కేంద్ర ఉపరితల రవాణాశాఖ మార్గదర్శకాలు రూపొందించింది. అత్యవసరంగా వినియోగించే కార్లకు మాత్రమే బుగ్గలు ఉండేందుకు అనుమతినిచ్చింది. ఎరుపు, నీలి రంగు బుగ్గలపై ఇప్పటికే కేంద్రప్రభుత్వం నిషేధం విధించగా.. దానికి అనుబంధంగా కేంద్ర ఉపరితల రవాణాశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, ముంబై, కోల్‌కతా, హైదరాబాద్ సహా వివిధ నగరాలు, పట్టణాల్లో ఆంక్షలు విధిస్తున్నట్లు మార్గదర్శకాల్లో పేర్కొన్నది. వీటిని అన్ని రాష్ట్రాలు కచ్చితంగా పాటించాలని స్పష్టంచేసింది. దానికి సంబంధించి నోటిఫికేషన్ ప్రతులను అన్ని రాష్ట్రాలకు పంపించినట్లు పేర్కొన్నది. వైద్యం, విపత్తుల నివారణ (అగ్నిప్రమాదాల)కు అత్యవసరంగా వినియోగించే వాహనాలకు ఎరుపు, నీలి రంగు బుగ్గలు వినియోగించుకునేలా ప్రత్యేక పాసులు జారీచేయనున్నారు. దీంతోపాటు వాహనం ముందుభాగంలో పాస్‌కు సంబంధించిన స్టిక్కర్‌ను అంటించాల్సి ఉంటుంది. అగ్ని ప్రమాదాలు, భూకంపం, వరద, తుఫాన్, సునామీ విపత్తుల నుంచి ప్రజలను రక్షించే విధుల్లో అత్యవసర సహాయ చర్యలకు ఉపయోగించే వాహనాలకు ఎరుపు, నీలి రంగు బుగ్గలను వాడుకునేందుకు ఉపరితల రవాణాశాఖ అనుమతినిచ్చింది.

ప్రతి ఏడాది అనుమతి తీసుకోవాలి

ఆపద సమయంలో వినియోగించే వాహనాలు, ఇతరత్రా అనుమతి పొందిన వాహనం ప్రతి ఏడాది విధిగా రవాణాశాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధిత అధికారి పేరు, హోదా, వాహనం నంబర్ వివరాలు విధిగా పేర్కొనాలని సూచించింది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో కొంత మంది వీఐపీలు, వీవీఐపీలు ఎర్ర, నీలి రంగు బుగ్గలను స్వచ్ఛందంగా తొలిగిస్తున్నారు. ఉపరితల రవాణాశాఖ తాజా మార్గదర్శకాలతో బుగ్గ కార్లు మాయమైపోనున్నాయి.



శుక్రవారం సిరిసిల్లలో జరిగిన సభలో ప్రసంగిస్తున్న మంత్రి కే తారక రామారావు



సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగానికి హర్షం వ్యక్తం చేస్తున్న ఓ మహిళ

అభివృద్ధి పాఠాలు చెప్తున్నాం

మొదటిపేజీ తరువాయి...

నిరూపించిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలకు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులపై సోయి ఉండదని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో ఒకప్పుడు ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు నిలదీసేవని, ఈ రోజు ప్రభుత్వమే ప్రతిపక్షాలను మీరు ఏమి చేశారంటూ ప్రశ్నించే పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 55 వేల కోట్ల రైతు రుణమాఫీ చేస్తే, నూతనంగా ఆవిర్భవించిన రాష్ట్రమైనా.. ఆర్థికపరిస్థితి అంతంతగానే ఉన్నా.. మన రాష్ట్రం రూ.17 వేల కోట్ల రుణమాఫీ చేసి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. వచ్చే వానాకాలం నుంచే ఎకరానికి రూ. 8 వేల చొప్పున రైతుకు పెట్టుబడి కూడా అందించబోతున్నామని చెప్పారు. ఈ విషయమై కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్‌ను కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అడిగి ఇదెలా సాధ్యమంటూ ఆశ్చర్యపోయారన్నారు. గొల్ల,కుర్మలకు గొర్రెలను పంపిణీ చేసినట్లుగా గీత కార్మికుల సొసైటీలకు ఐదెకరాల భూమి, సబ్సిడీపై పంపుసెట్లు ఇస్తామన్నారు.

నీళ్లు కావాలని నినదించండి..

కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల పథకాలతోపాటుగా మిషన్‌కాకతీయ ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని కోటి ఎకరాల మాగాణిగా తీర్చిదిద్దుకుంటున్నామని కేటీఆర్ చెప్పారు. ఈ నెల 26న గంభీరావుపేట మండలం నర్మాలకు వచ్చే కేంద్ర జల మండలి బృందానికి ' మా ప్రాంతానికి ప్రాజెక్టుల నీళ్లు కావాలంటూ...' వాదనను గట్టిగా వినిపించాలని పిలుపునిచ్చారు.

ఉద్యానపంటలమీద దృష్టి పెట్టండి..

వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అన్నదాతలు ఉద్యాన పంటల వైపు దృష్టిపెట్టాలని, ప్రధానంగా కూరగాయలతో అధిక లాభాలు ఆర్జించవచ్చనని అన్నారు. సిరిసిల్లకు వ్యవసాయ కళాశాల మంజూరుతో పాటు రైతులకు అడిగినన్ని యంత్రాలు, ట్రాక్టర్లు ఇస్తామని ప్రకటించారు. రైతులకు సహకరించేందుకు కొత్తగా 1000 మంది వ్యవసాయాధికారులను నియమించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.1074 కోట్లతో 1554 గోదాములను నిర్మించినట్లు మంత్రి తెలిపారు. ఐటీ రంగంలో మంత్రి కేటీఆర్ తెలంగాణకు అంతర్జాతీయ కీర్తిని తీసుకొచ్చారని పోచారం కొనియాడారు. సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి కేసీఆర్ దేశానికి ఆదర్శంగా నిలిస్తే, కేటీఆర్ అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జెడ్పీచైర్మన్ తుల ఉమ, కలెక్టర్ కృష్ణభాస్కర్, డీఆర్వో శ్యాంప్రసాద్‌లాల్, సెస్ చైర్మన్ దోర్నాల లక్ష్మారెడ్డి, జడ్పీటీసీ మంజుల, ఎంపీపీ శ్రీలత, సర్పంచ్ అగ్గిరాములు పాల్గొన్నారు.



సిరిసిల్లలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభిస్తున్న మంత్రులు కేటీఆర్, పోచారం, ఎంపీ వినోద్. చిత్రంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జెడ్పీటీసీ మంజుల తదితరులు

దేశంలోనే ప్రత్యేకంగా అంబేద్కర్ విగ్రహ స్థాపన

■ విద్యుత్, ఎస్సీ అభివృద్ధిశాఖల మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అంబేద్కర్ విగ్రహ స్థాపన దేశంలో ప్రత్యేకంగా నిలువాలని రాష్ట్ర విద్యుత్, ఎస్సీ అభివృద్ధిశాఖల మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం సచివాలయంలో విగ్రహ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. డిజైన్ స్టూడియో రూపొందించిన నమూనాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించారు. అంబేద్కర్ 125వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని నెక్లెస్‌రోడ్ సమీపంలో 125 అడుగుల ఎత్తులో విగ్రహం ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని ఆయన తెలిపారు. విగ్రహ ఏర్పాట్లపై ప్రభుత్వం నియమించిన అంబేద్కర్ విగ్రహ కమిటీ చైనా, సిక్కింలో పర్యటించి అక్కడ నెలకొల్పిన విగ్రహాలను పరిశీలించిందని తెలిపారు. నోయిడాకు చెందిన డిజైన్ స్టూడియో అసోసియేట్స్ కొన్ని నమూనాలను సిద్ధం చేశారని, వాటికి కొన్ని మార్పు చేర్పులు సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుద్ధవనం అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య, ఎమ్మెల్యేలు కిశోర్‌కుమార్, వేముల వీరేశం, ఎస్సీ అభివృద్ధిశాఖ ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, రోడ్లుభవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి, ఎస్సీ అభివృద్ధిశాఖ డైరెక్టర్ కరుణాకర్, జేఎన్టీయూ శిల్పి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహ కమిటీతో చర్చిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

నారులేని వరి పంట

■ కర్ణాటక సాగుతీరుపై తెలంగాణ బృందం అధ్యయనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నారు పోసినవాడే నీరు పోస్తాడనేది సామెత. కానీ కర్ణాటకలో మాత్రం అది పూర్తి భిన్నం. అసలు నారే కాదు కదా.. కనీసం నీళ్లు కూడా పోయకుండానే వరి పండిస్తారు. సీఎం కేసీఆర్ ఆదేశానుసారం కర్ణాటకలో పర్యటిస్తున్న తెలంగాణ బృందం శుక్రవారం తొలిరోజు గమనించిన ఆసక్తికర అంశమిదే. తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కిషన్‌రావు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూమ్‌రెడ్డితోపాటు పలువురు అధికారులు కర్ణాటకలోని వ్యవసాయ సాగు విధానాన్ని, ఆధునిక యంత్రాలపై అధ్యయనం చేసేందుకు వెళ్లారు. తొలిరోజు శుక్రవారం రాయచూరు జిల్లాలో బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ.. 'తెలుగు రాష్ట్రాల్లో నారు పోసి వరినాట్లు వేస్తారు. ఖరీఫ్‌లో నాలుగునెలలు పూర్తిగా, యాసంగిలో 15 రోజులకో తడి చొప్పున కనీసంగా ఆరుతడుల నీళ్లు ఇస్తారు. కానీ రాయచూరు ప్రాంతంలో అత్యధికంగా వరినారు లేకుండా వరి పండించే విధానం అమలవుతున్నది. దీనిపై రైతుల నుంచి సమగ్ర వివరాలు తెలుసుకున్నాం. పొట్ట దశ కొచ్చిన తర్వాత ఒక తడి నీళ్లు ఇస్తారు. నీటి లభ్యత లేని ప్రాంతాల్లో వరుణుడే ఆధారం. కాకపోతే తడి ఇచ్చిన దానికి, ఇవ్వని దానికి దిగుబడిలో తేడా ఉంటుంది. మంచి తడి ఉన్న భూముల్లో ఎకరాకు దిగుబడి 40-45 బస్తాల వరకు ఉంటుంది' అని వివరించారు.



కర్ణాటకలోని రాయచూరులో వరి పంటను పరిశీలిస్తున్న తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి తదితరులు

పేదలకు ఉచితంగా డయాలిసిస్

మొదటిపేజీ తరువాయి...

లక్ష్మారెడ్డి ప్రారంభించారు. మిగిలిన చోట్ల డయాలిసిస్ కేంద్రాలను ఈ నెలాఖరు లోపు నెలకొల్పేందుకు సంబంధిత విభాగాలు చర్యలు చేపట్టాయి. దేశంలో ఎక్కడాలేని విధంగా సింగిల్ యూజ్డ్ ఫిల్టర్ పద్ధతిలో ప్రభుత్వ వైద్యశాలల్లో ఆరోగ్యశ్రీ కార్డుదారులకు ఉచితంగా డయాలిసిస్ చేస్తారు. వివిధ కారణాలతో రోజురోజుకు పెరుగుతున్న కిడ్నీ బాధితులను ఆదుకునేందుకు ఈ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కిడ్నీ సమస్యలున్న వారికి వారానికి రెండుమూడుసార్లు డయాలిసిస్ చేయాల్సి ఉంటుంది. అటువంటి వారికి ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వరంగంలో డయాలిసిస్ చేసేందుకు ఒకట్రెండు డయాలిసిస్ కేంద్రాలు మాత్రమే ఉండేవి. ఆ పరిస్థితిని గుర్తించిన తెలంగాణ సర్కారు.. అదనంగా 39 డయాలిసిస్ కేంద్రాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. యుద్ధ ప్రాతిపదికన వీటి ఏర్పాటుపై దృష్టి సారించింది.

39 కేంద్రాల్లో..

ప్రభుత్వం అనుమతించిన 39 డయాలిసిస్ కేంద్రాలకుగాను గతంలో నిమ్స్, నిజామాబాద్, గాంధీ, ఉస్మానియా, మహబూబ్‌నగర్ జిల్లా వైద్యశాలల్లో యూనిట్లు పనిచేస్తున్నాయి. శుక్రవారం సిద్దిపేట ఏరియా హాస్పిటల్‌లో కేంద్రాన్ని రాష్ట్ర భారీ నీటిపారుదల, మార్కెటింగ్ శాఖల మంత్రి టీ హరీశ్‌రావు, వైద్యారోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి ప్రారంభించారు. మిగిలిన వాటిని ఈ నెలాఖరులోపు ప్రారంభించనున్నారు. అందులో రిమ్స్ ఆదిలాబాద్, నల్లగొండ, కరీంగనర్, తాండూరు, సంగారెడ్డి జిల్లా దవాఖానలు ఉన్నాయి. వీటితోపాటు వనస్థలిపురం, మెదక్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, గోదావరిఖని, జనగామ, కొత్తగూడెం, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, మలక్‌పేట, జహీరాబాద్, బాన్సువాడ, జగిత్యాల, గద్వాల, నాగర్‌కర్నూలు, వనపర్తి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, బోధన్, సూర్యాపేట, భద్రాచలం, కామారెడ్డి ఏరియా దవాఖానల్లో, వికారాబాద్, మహేశ్వరం, నర్సంపేట, సత్తుపల్లి, ఉట్నూరు, ఏటూరునాగారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో డయాలిసిస్ కేంద్రాలను నెలకొల్పనున్నారు.

కిడ్నీ బాధితులకోసం ఉచితంగా..

కిడ్నీ బాధితుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని అదనంగా డయాలసిస్ కేంద్రాలను రాష్ట్రవ్యాప్తంగా నెలకొల్పుతున్నాం. వాటిని నిరుపేదలకు ఉచితంగా అందుబాటులోకి తెచ్చాం. రోగులకు ఎటువంటి ఖర్చు లేకుండా అందిస్తున్న ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి. సింగిల్ యూజ్డ్ ఫిల్టర్ పద్ధతివల్ల ఇన్‌ఫెక్షన్లు వంటివి ఉండవు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న నిరుపేద కుటుంబాల వారికి ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తున్నాం.

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి

దేశంలోనే మొదటిసారి

రాష్ట్రంలోని సర్కారు దవాఖానల్లో డయాలిసిస్ కేంద్రాలను సింగిల్ యూజ్డ్ ఫిల్టర్ పద్ధతిన ఏర్పాటుచేస్తున్నారు. డయాలిసిస్ చేసే ఫిల్టర్లను ఎక్కువమంది రోగులకు ఉపయోగించే పద్ధతి ఎక్కువగా కొనసాగుతున్నది. ఒకే ఫిల్టర్‌ను శుభ్రం చేసి మళ్లీ మళ్లీ వాడేవారు. ఆ విధానం వల్ల ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రతి వ్యక్తికి కొత్త ఫిల్టర్ వినియోగిస్తారు. ఈ పద్ధతిని ఇప్పటివరకు దేశంలోని ఏ ప్రభుత్వ దవాఖానలోనూ ఈ పద్ధతిలేదు. మొదటిసారి తెలంగాణలోనే అమలులోకి తీసుకురావడం విశేషం. మొదటిసారిగా రాష్ట్రంలో పీపీపీ పద్ధతిన ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో డయాలిసిస్ కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నారు. డయాలిసిస్ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన నీరు, విద్యుత్, గది వంటి వసతులను ప్రభుత్వం కల్పిస్తుంది. యంత్రాలను స్థానికంగా ఆయా దవాఖానలతో ఒప్పందం కుదుర్చుకున్న ప్రైవేటు సంస్థలు సమకూరుస్తాయి. ఇందు కు అవసరమైన సాంకేతిక, ఇతర సిబ్బందిని ఆ సంస్థ లే నియమించుకుంటాయి. డయాలిసిస్ కేంద్రం నిర్వహించే సంస్థకు ఒక్కో డయాలసిస్‌కు రూ.1325ను ప్రభుత్వం చెల్లిస్తుంది.

కాళేశ్వరంపై కాంగ్రెస్ మరో కుట్ర!

ప్రజాభిప్రాయ సేకరణ వాయిదాకు ఎత్తు

- ■ కేంద్ర పర్యావరణ కార్యదర్శిని కలిసిన మర్రి శశిధర్‌రెడ్డి
- ■ అవును..ఆపమని ఫిర్యాదు చేశా: అంగీకరించిన శశిధర్‌రెడ్డి
- ■ డిజైన్ మారడంతో ఖర్చు పెరిగింది
- ■ ప్రజాభిప్రాయ సేకరణపై ప్రచారం చేయలేదు

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ:

కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకోవడానికి కాంగ్రెస్ మరో కుట్రకు తెరతీసింది. ప్రాజెక్టు క్లియరెన్స్‌కు కీలకమైన ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయించేందుకు ఎత్తు వేసింది. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఈ నెల 22వ తేదీ నుంచి 26వ తేదీ వరకు చేపట్టిన ఈ ప్రక్రియను వాయిదా వేయించేందుకు ఆ పార్టీకి చెందిన మర్రి శశిధర్‌రెడ్డి శుక్రవారం ఢిల్లీకి వచ్చి కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ కార్యదర్శి అజయ్ నారాయణ్ ఝాను కలిశారు. మండలి నిబంధనలను సరిగ్గా పాటించలేదు కాబట్టి ఈ ప్రజాభిప్రాయసేకరణను వాయిదా వేయాలని కోరారు. ప్రజాభిప్రాయ సేకరణకు ముందు 'పర్యావరణ ప్రభావ అంచనా' తుది నివేదికను తెలుగులోకి తర్జుమా చేసి పబ్లిక్ డొమెయిన్‌లో పెట్టాల్సి ఉండగా అందులో ముసాయిదా నివేదికను మాత్రమే పెట్టారని ఫిర్యాదు చేశారు. ఇది కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నిబంధనలకు విరుద్ధమైనదని పేర్కొన్నారు. 15 ప్రదేశాల్లో ప్రజాభిప్రాయ సేకరణకు షెడ్యూలును ఖరారు చేసినా.. ఆ వేదికలకు చేరుకోడానికి ప్రజలకు సరైన రవాణా సౌకర్యాలు లేవని చెప్పారు. తగినంత ప్రచారం కూడా చేయలేదన్నారు.

జాప్యం కోసమే ఈ కుట్రలన్నీ...

కాంగ్రెస్ లక్ష్యం సుస్పష్టం. ఏం చేసైనా సరే కాళేశ్వరం పూర్తి కాకూడదు. వీలైన ప్రతి మార్గంలో దానికి అడ్డంకులు కల్పించాలి. ఏ వేదిక దొరికినా వాడుకోవాలి. ఈ దిశగా ఇప్పటికే హైదరాబాద్‌లోని హైకోర్టు, చెన్నయ్‌లోని గ్రీన్ ట్రిబ్యునల్ బెంచ్, ఢిల్లీ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రిన్సిపల్ బెంచ్, సుప్రీంకోర్టులో రకరకాల పిటిషన్లు వేయించారు. అన్ని చోట్లా చేదు అనుభవాలు ఎదురయ్యాయి. దిక్కుతోచక ఇప్పుడు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రభావితం చేయడానికి ఎత్తు వేసింది. అందులో భాగంగా పర్యావరణ మంత్రిత్వ శాఖ కార్యదర్శిని మర్రి శశిధర్‌రెడ్డి కలిశారు.

ఫిర్యాదు వాస్తవమే...

ఈ విషయమై మర్రి శశిధర్‌రెడ్డిని 'నమస్తే తెలంగాణ' ప్రశ్నించగా పర్యావరణ కార్యదర్శికి ఫిర్యాదు చేసిన విషయాన్ని ధ్రువీకరించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు డిజైన్ మార్పు వల్ల వ్యయం రూ. 80 వేల కోట్లకు పెరిగిందన్నారు. అంతిమంగా ఈ భారం ప్రజలపై పడుతుందన్నారు. 'ఫోర్ వాటర్' స్కీమ్, వాటర్‌షెడ్ అంశాలను , రాజస్థాన్, హర్యానా అనుభవాలను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. వైఎస్సార్ హయాంలో పర్యావరణ అనుమతులు లేకుండా నిర్మాణాలు జరిగాయని గుర్తు చేయగా అప్పటి పరిస్థితులకు, ఇప్పటి పరిస్థితులకు తేడా ఉందని సమర్థించుకున్నారు. పోలవరం ప్రాజెక్టుపై కూడా ఇలాంటి ప్రయత్నాలు ఎందుకు చేయరని ప్రశ్నిస్తే ఆ ప్రాజెక్టును కూడా తాము తప్పుపడుతున్నామన్నారు. కాంగ్రెస్ చర్యలు అంతిమంగా తెలంగాణ అభివృద్ధిని కుంటుపరిచేవి కావా? అంటే.. తానుగానీ, కాంగ్రెస్ పార్టీగానీ ప్రాజెక్టులకు వ్యతిరేకం కాదన్నారు. కేవలం ప్రాజెక్టు డిజైన్, నిర్మాణం, భూసేకరణను మాత్రమే తప్పుపడుతున్నామని వివరణ ఇచ్చారు. కోర్టు కేసులు, ఫిర్యాదుల ద్వారా ప్రాజెక్టులు జాప్యం చేయడానికి కాంగ్రెస్ కారణమవుతుందని ప్రస్తావిస్తే ప్రాజెక్టు డిజైన్ కారణంగా వ్యయం పెరిగిందని, అశాస్త్రీయంగా వందలాది మీటర్ల ఎత్తులో ఉన్న ప్రాంతాలకు నీటిని తరలించడంలో సమస్యలున్నాయని, రిజర్వాయర్లు అవసరం లేకపోయినా కడుతున్నారని,ప్రజలు నిర్వాసితులు అవుతున్నారని అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ జరిగితే ప్రజలు వారి అభిప్రాయాలను వెల్లడిస్తారు కదా? అని అడిగినపుడు ప్రభుత్వం రైతుల్ని భయపెడుతున్నదని, సమావేశాలకు హాజరుకాకుండా అడ్డుకుంటున్నదని, కేసులు పెట్టి వేధిస్తున్నదని అన్నారు. ప్రజలు స్వేచ్ఛగా వారి అభిప్రాయాల్ని వెల్లడించుకునే వాతావరణం ఏర్పడేదాకా ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాలను వాయిదా వేయాలని కేంద్రాన్ని కోరామని చెప్పారు.

కాళేశ్వరంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

- ■ అసెంబ్లీలో పీఏసీ సుదీర్ఘ భేటీ
- ■ సాగునీటిశాఖలోని మూడు ఆడిట్ పేరాలపై చర్చ
- ■ త్వరలో మరోసారి సమావేశం కావాలని నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సాగునీటిశాఖ అంశాలపై తెలంగాణ అసెంబ్లీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) శుక్రవారం అసెంబ్లీ కమిటీ హాల్-1లో సుదీర్ఘంగా భేటీ అయ్యింది. పీఏసీ చైర్మన్ డాక్టర్ జే గీతారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సాగునీటిశాఖ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎస్కే జోషి కమిటీకి కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రాజెక్టు నిర్మాణ పనులను కమిటీకి వివరించారు. అంతకుముందు సాగునీటి శాఖకు చెందిన నాలుగు ఆడిట్ పేరాలపై చర్చ జరుగాల్సి ఉండగా, మూడింటిపై దాదాపు నాలుగున్నర గంటలపాటు చర్చించారు. మరో ఆడిట్ పేరాలో సాగునీటిశాఖకు చెందిన 11 మీడియం ప్రాజెక్టుల అంశం ఉండటంతో సమయాభావం వల్ల ప్రత్యేకంగా దానిపై మరో సమావేశంలో చర్చిద్దామని కమిటీ వాయిదా వేసింది. ప్రాజెక్టుల ఖర్చులు, నిర్మాణం వంటి అంశాల్లో కమిటీలో ఉన్న విపక్ష పార్టీల సభ్యులు అభ్యంతరాలు వ్యక్తంచేయగా, అధికారులు వాటికి సమాధానం ఇచ్చారు. చర్చ జరిగిన మూడు ఆడిట్ పేరాల్లో రెండుపేరాలు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనివే. కాంగ్రెస్ హయాంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు కాంట్రాక్టర్‌కు సుమారు రూ.14 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు లబ్ధి చేకూర్చినట్టు ఆడిట్‌పేరాలో గుర్తించారు. ఆదిలాబాద్ జిల్లాలోని టేకుమట్ల ప్రాజెక్టు పనుల్లోనూ కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చారని, గోదావరి ఎత్తిపోతల పథకంలోని ఒక పనిలో అదనపు రేట్ల చెల్లింపు (ప్రైస్ ఎస్కలేషన్) వర్తింపజేయడానికి కాంట్రాక్టర్‌కు సుమారు రూ.4 కోట్ల మేరకు లబ్ధి చేకూరినట్టు గుర్తించారు. తర్వాత కాంట్రాక్టర్ నుంచి సుమారు రూ.4 కోట్లను రికవరీ చేసినట్టు ఉన్నతాధికారులు.. కమిటీకి వివరించారు. అసలుతోపాటు ఆ మొత్తానికి వడ్డీని కూడా కాంట్రాక్టర్ నుంచి రాబట్టాలని కమిటీ అభిప్రాయపడినట్టు తెలిసింది. కమిటీ సభ్యులు ఏ జీవన్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, హన్మంతు షిండే, గువ్వల బాలరాజు, టీ జీవన్‌రెడ్డి, డాక్టర్ కే లక్ష్మణ్, భానుప్రసాద్‌రావు, రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్, ఆ శాఖ అధికారులు, సాగునీటి శాఖ కార్యదర్శి వికాస్‌రాజ్, ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్, వివిధ ప్రాజెక్టుల ఇంజినీర్లు, తెలంగాణ లెజిస్లేటివ్ సెక్రటేరియట్ కార్యదర్శి డాక్టర్ రాజా సదారాం, జాయింట్ సెక్రటరీ డాక్టర్ నరసింహాచార్యులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పోలీసుశాఖలో
పదోన్నతులపై కసరత్తు!

- ఉమ్మడిరాష్ట్ర తప్పిదాలతో ఇబ్బందులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలీసుశాఖలో పదోన్నతులపై కసరత్తు కొనసాగుతున్నది. ఉమ్మడిరాష్ట్రంలో జరిగిన కొన్ని తప్పిదాల వల్ల ఇప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఒక్కో అడ్డంకిని తొలిగించుకుంటూ వెళుతున్నామని ఉన్నతాధికారులు చెప్తున్నారు. ఎవరికీ అన్యాయం జరుగకుండా పదోన్నతులు కల్పించడానికి నిబంధనలు రూపొందిస్తున్నామని తెలిపారు. అన్ని అంశాల్లో న్యాయసలహా తీసుకుంటున్నామన్నారు. ఇన్‌స్పెక్టర్ నుంచి ఎస్పీ, నాన్ క్యాడర్ ఎస్పీ స్థాయిల వరకు పదోన్నతులపై పోలీసు శాఖ ఏడాదిగా కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. డీజీపీ పర్యవేక్షణలో నలుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులు ఈ పనిలో నిమగ్నమయ్యారు. సీనియారిటీ ప్రకారం, రిమార్క్‌లేని సిబ్బందికి నిబంధనల ప్రకారం పదోన్నతులు కల్పించాలని డీజీపీ అనురాగ్‌శర్మ భావిస్తున్నారు. గతంలో అడ్డదారుల్లో పదోన్నతి పొందిన కొంతమంది సమస్యలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిసింది. దీన్ని గుర్తించిన డీజీపీ ఉన్నతాధికారులతో పలుమార్లు సమావేశమై చర్చించారు. గతంలో అమలైన తీరు, ప్రస్తుతం తీసుకుంటున్న నిర్ణయాలు వివరిస్తూ సలహాలు, అభ్యంతరాలు సేకరిస్తున్నారు. ఈసారి పదోన్నతులకు పోలీసుల వ్యక్తిగత రికార్డులను పరిశీలిస్తున్నారు. రిమార్కులు, కేసులు, శాఖాపరమైన విచారణలు వంటివి ఉంటే పరిశీలిస్తూ క్యాటగిరీల వారిగా సీనియరిటీ లిస్టును తయారు చేస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ స్థాయి నుంచి పైస్థాయి వరకు పదోన్నతులపై కసరత్తు ముమ్మరంగా జరుగుతున్నదని సీనియర్ పోలీసు అధికారులు తెలిపారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని పూర్తిచేస్తామన్నారు.

జీఎస్టీ అమలుకు ప్రత్యేక బృందాలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల నిర్ణయం
- వాణిజ్యపన్నులు, సెంట్రల్ ఎక్సైజ్ అధికారులతో టీంలు

ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ: వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) చట్టాన్ని సమర్థంగా అమలుచేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమన్వయంతో ముందుకు కదలాలని నిర్ణయించారు. జిల్లాలవారీగా ప్రత్యేక సమన్వయ బృందాలను ఏర్పాటు చేయనున్నారు. జీఎస్టీ పన్ను వసూళ్లలో అయోమయం లేకుండా కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్, రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ అధికారులు పరస్పర సహకారంతో వ్యవహరించనున్నారు. శుక్రవారం రెడ్ హిల్స్‌లోని ఫెటాప్సీ (ఫ్యాప్సీ) భవన్‌లో సెంట్రల్ ఎక్సైజ్, రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ అధికారుల సమావేశం జరిగింది. దీనికి రెవెన్యూ (ఆబ్కారీ, వాణిజ్యపన్నుల) శాఖ ముఖ్య కార్యదర్శి సోమేశ్‌కుమార్, వాణిజ్యపన్నుల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, సెంట్రల్ ఎక్సైజ్ హైదరాబాద్ చీఫ్ కమిషనర్ బీవీ అగర్వాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో వ్యాట్ నుంచి జీఎస్టీకి ఎంత మంది ట్రేడర్లు ఇంకా మారాల్సి ఉంది? జీఎస్టీ రిటర్న్‌ల దాఖలు ఎప్పటినుంచి తీసుకోవాలి? ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వినియోగదారునికి అందుతున్నదా? ఏయే ట్రేడర్లు ఏ అధికారుల పరిధిలోకి వస్తారు తదితర అంశాలపై చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోని అన్ని రకాల పన్నులు జీఎస్టీ గొడుగు కిందకు రావడం వల్ల ట్రేడర్లు, డీలర్లు, ప్రజల్లో ఉన్న అపోహలు, అనుమానాలను తొలిగించి అవగాహన కలిగించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్ పేర్కొన్నారు. దాదాపు 91నుంచి 92శాతం మంది డీలర్లు, ట్రేడర్లు వ్యాట్ నుంచి జీఎస్టీకి మారారని చెప్పారు. రెండుశాఖల అధికారులు జిల్లాలవారీగా ఇకపై ప్రతీ రెండో, నాలుగో బుధవారం సమావేశమై పరస్పరం సమన్వయ సహకారం అందించుకోవాలని సోమేశ్‌కుమార్ ప్రతిపాదించగా.. సెంట్రల్ ఎక్సైజ్ హైదరాబాద్ చీఫ్ కమిషనర్ బీవీ అగర్వాల్ అంగీకరించారు. పన్ను వసూళ్ల కోసం ఏయే ట్రేడర్ల వద్దకు రాష్ట్ర అధికారులు, ఏ డీలర్ల వద్దకు కేంద్ర అధికారులు వెళ్లాలన్నదానిపై స్పష్టత ఉండాలని అగర్వాల్ చెప్పారు. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను పొందడానికి రిటర్న్‌ల దాఖలుకు గడువును మరో 15రోజులు పొడిగించినట్టు అధికారులు వెల్లడించారు.

సంక్షేమ హాస్టళ్ల
సన్నబియ్యంపై నజర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంక్షేమ హాస్టళ్ల సన్నబియ్యంపై పౌరసరఫరాల శాఖ నిఘా పెట్టింది. శుక్రవారం పాఠశాల విద్య డైరెక్టర్ కిషన్, గురుకులాల కమిషనర్ ప్రవీణ్‌కుమార్ సహా సంక్షేమ హాస్టళ్ల అధికారులతో సివిల్ సప్లై కమిషనర్ సీవీ ఆనంద్ పౌరసరఫరాల భవన్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. సన్నబియ్యం పంపిణీలో, నాణ్యతలో అక్రమాలు జరుగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించారు. పౌరసరఫరాల శాఖలో ఏర్పాటుచేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించగా, పలుచోట్ల అక్రమాలు బయటపడ్డాయి. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నివేదికను తయారుచేసి కమిషనర్ సీవీ ఆనంద్‌కు అందించింది. దీనిపై ఆనంద్ చర్యలకు ఉపక్రమించారు. సన్నబియ్యం విషయంలో ప్రత్యేక దృష్టిసారించి సంబంధిత విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. ఇందులో అధికారులు పలు విలువైన సూచనలు చేసినట్టు తెలుస్తున్నది. 25కిలోల బ్యాగుల్లో బియ్యం అందించడం, స్కూల్ పాయింట్‌కు నేరుగా తరలించడం వంటి అంశాలపై చర్చించినట్టు సమాచారం.



పోలీసుల అదుపులో గాడ్‌పవర్.. స్వాధీనం చేసుకొన్న కొకైన్, ఫోన్లు

డ్రగ్స్ దందాలో నైజీరియన్ అరెస్ట్

- 20 గ్రాముల కొకైన్ స్వాధీనం

హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: డ్రగ్స్ విక్రయిస్తున్న నైజీరియన్‌ను నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. యుగోచుక్వో చుక్వేబుక అలియాస్ గాడ్‌పవర్ అనే వ్యక్తి వ్యాపార వీసాపై భారత్‌కు వచ్చి డ్రగ్స్ దందా చేస్తున్నాడు. గతంలో రెండుసార్లు పోలీసులకు పట్టుబడి.. జైలు పాలయ్యాడు. తాజాగా గోల్కొండ ప్రాంతంలో డ్రగ్స్ విక్రయిస్తూ నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బల్వంతయ్య బృందానికి పట్టుబడ్డాడని డీసీపీ లింబారెడ్డి తెలిపారు. 20గ్రాముల కొకైన్, మూడుసెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ఎన్సీబీ సహకారంతో డ్రగ్స్ అక్రమ రవాణాకు చెక్!

పొరుగు రాష్ర్టాల నుంచి డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర ఎక్సైజ్ అధికారులు కేంద్ర సంస్థ అయిన నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) సహకారాన్ని కోరాలని నిర్ణయించారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గోవా, ఒడిశా రాష్ర్టాల నుంచి డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు ఎన్సీబీతో రాష్ట్ర అధికారులు పలు దఫాలుగా సంప్రదింపులు జరిపారు. మరోమారు సమావేశం కావాలని భావిస్తున్నారు. రాష్ట్ర పోలీసుల సహకారంతో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో ప్రమాదకరమైన ఎల్లెస్డీ, ఎమ్డీఎంఏ, కొకైన్, గంజాయి తదితర మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్న 35 మంది నిందితులను ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

సెప్టెంబర్‌లో చార్జిషీట్లు

డ్రగ్స్ కేసులో నిందితులపై సెప్టెంబర్‌లో చార్జిషీట్లు దాఖలు చేసేందుకు ఎక్సైజ్ అధికారులు సన్నద్ధమవుతున్నారు. నిందితులిచ్చిన వాంగ్మూలాలు, ఫొటోలు, వీడియోలు, మొబైల్ కాల్‌డేటా ఆధారంగా సిట్ అధికారులు తదుపరి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఈలోగా పలువురు ప్రముఖుల నుంచి సేకరించిన గోళ్లు, రక్త నమూనాలకు సంబంధించిన ఎఫ్ఎస్సెల్ నివేదిక వస్తుందని సిట్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆరు నెలల్లోపు డ్రగ్స్ తీసుకొని ఉంటేనే వారు తీసుకున్న మోతాదు తదితర అంశాలు విషయాలు వెల్లడయ్యే అవకాశం ఉందని డాక్టర్లు పేర్కొంటున్నారు.



సచివాలయంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీని కలిసిన రెవెన్యూ ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు

ఉద్యోగులూ ఆందోళన వద్దు

- రెవెన్యూ ఉద్యోగులను వ్యవసాయశాఖలో కలిపే ఉద్దేశం లేదు
- తనను కలిసిన సంఘాల నాయకులకు స్పష్టంచేసిన డిప్యూటీ సీఎం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెవెన్యూ ఉద్యోగులను వ్యవసాయ శాఖలో కలిపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ స్పష్టంచేశారు. రెవెన్యూ ఉద్యోగులను వ్యవసాయ శాఖలో కలుపుతారని వస్తున్న వార్తలన్నీ నిరాధారమైనవని శుక్రవారం సచివాలయంలో తనను వేర్వేరుగా కలిసిన రెవెన్యూ ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులకు తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులు రెవెన్యూశాఖలోనే పనిచేస్తారని, ఎవరూ ఆందోళన పడొద్దన్నారు. పెట్టుబడి కింద ఏడాదికి ఇచ్చే రూ.8 వేలు నిజమైన రైతులకే అందేలా సమగ్ర భూసర్వే చేస్తున్నామన్నారు. తెలంగాణ రెవెన్యూ జేఏసీ నాయకులు, తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లచ్చిరెడ్డి, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, తహసీల్దార్ల సంఘం అధ్యక్షుడు గౌతంకుమార్, తెలంగాణ వీఆర్వోల సంఘం నేతలు బీ రాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, తెలంగాణ వీఆర్ఏల జేఏసీ నాయకులు రాజయ్య, ఈశ్వర్ ఒక బృందంగా, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివ శంకర్, తెలంగాణ వీఆర్వోల సంఘం నేత గోల్కొండ సతీశ్ తదితరులు మరో బృందంగా డిప్యూటీ సీఎంను కలిశారు.

డీజీపీ అనురాగ్‌శర్మతో మేజర్ జనరల్ భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ ఎన్ శ్రీనివాసరావు శుక్రవారం డీజీపీ అనురాగ్ శర్మను పోలీసుశాఖ ప్రధాన కార్యాలయంలో కలిశారు. సైనికుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురు చర్చించారు.

ఆన్‌లైన్ పరిధిలోకి విద్యాశాఖ సేవలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇంటర్మీడియట్ విద్యామండలి తరహాలో పాఠశాల విద్యాశాఖలోని అన్నిరకాల సేవలను ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకురావాలని ఆ శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. సీజీజీ అధికారులతో ఆ శాఖ డైరెక్టర్ జీ కిషన్ శుక్రవారం సమావేశమయ్యారు. నెల రోజుల్లో ఆన్‌లైన్‌లో తీసుకొచ్చే సేవల వివరాలతో నివేదిక ఇవ్వాలని కోరినట్లు తెలుస్తున్నది.

28, 29 తేదీల్లో ఢిల్లీలో నరెడ్కో సదస్సు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల 28, 29 తేదీల్లో ఢిల్లీలో నరెడ్కో (నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ కౌన్సిల్) సదస్సును నిర్వహిస్తున్నామని నరెడ్కో తెలంగాణ చీఫ్ కన్వీనర్ పీ ప్రేమ్‌కుమార్ శుక్రవారం మీడియాతో తెలిపారు. కార్యక్రమంలో నరెడ్కో ఉపాధ్యక్షుడు పీ చలపతిరావు, అప్రెడా అధ్యక్షుడు హరిబాబు, ట్రెడా అధ్యక్షుడు పీ రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ పరీక్షలకు బీసీ స్టడీ సర్కిళ్లలో ఉచిత శిక్షణ

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసెస్ కమిషన్ ఆధ్వర్యంలో భర్తీకానున్న ఫారెస్ట్ ఆఫీసర్స్ రిక్రూట్‌మెంట్ పరీక్షకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 31లోగా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 040 – 24071178లో సంప్రదించాలన్నారు.

త్వరలో 11 వర్సిటీల్లో 1551 పోస్టుల భర్తీ



శుక్రవారం వరంగల్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి. చిత్రంలో ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ తదితరులు ఉన్నారు.

- తొలిదశలో 1,061 పోస్టులు.. వచ్చే ఏడాది మిగతావి
- భర్తీ బాధ్యత వర్సిటీలదే
- రూ.10 కోట్లతో ఉస్మానియా సెంటినరీ బ్లాక్ నిర్మాణం
- ఓయూలో సమావేశ హాళ్ల నిర్మాణాలపై దృష్టి
- విలేకరుల సమావేశంలో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి

వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ:

ఉన్నత విద్యా ప్రమాణాలు పెంచేందుకు సర్కారు సిద్ధమయింది. రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1551 ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయనున్నట్టు ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి శుక్రవారం ప్రకటించారు. త్వరలోనే నియామక ప్రక్రియ చేపడుతామని చెప్పారు. ఇందులో తొలివిడుతగా 1,061 పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. ఈ భర్తీ బాధ్యతల్ని ఆయా యూనివర్సిటీలకే అప్పగించామని కడియం తెలిపారు. శుక్రవారం వరంగల్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కడియం మాట్లాడుతూ.. దాదాపు రెండు దశాబ్దాలుగా వర్సిటీల్లో ఎటువంటి నియామకాలు చేపట్టకపోవడంవల్ల ఉన్నతవిద్య కుంటుపడిందనే విషయాన్ని సీఎం కేసీఆర్ గుర్తించారన్నారు. రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల మొత్తం కలిపి 1551 ఖాళీలు ఉన్నట్టు గుర్తించామని చెప్పారు. వీటిలో తొలి విడుతగా 99 ప్రొఫెసర్ పోస్టులు, 270 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, మరో 692 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల (మొత్తం 1061)ను ఈ ఏడాదే భర్తీ చేయనున్నట్టు వెల్లడించారు. మిగిలిన 490 పోస్టులను వచ్చే ఏడాది భర్తీ చేస్తామని పేర్కొన్నారు. నియామక ప్రక్రియను విశ్వవిద్యాలయాలకే అప్పగించామని, వీసీలు, రిజిస్ట్రార్లు ఈ బాధ్యత తీసుకుంటారని చెప్పారు. వర్సిటీల్లో మౌలిక సదుపాయాల కల్పన ఎండమావిగా మారిందనే విషయాన్ని పెద్ద మనసుతో అర్థంచేసుకున్న సీఎం కేసీఆర్.. బడ్జెట్‌లో రూ.420 కోట్లు కేటాయించారని వివరించారు. ఒకప్పుడు ఉస్మానియాకు పీజీ సెంటర్‌గా ఉన్న ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రాంగణంలో సెంటినరీ బ్లాక్ నిర్మాణం కోసం రూ.10 కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ఆర్ట్స్ కాలేజీ ఆడిటోరియాన్ని కూల్చి దానిస్థానంలో అత్యాధునిక హంగులతో శతాబ్ది బ్లాక్‌ను నిర్మించనున్నట్టు వివరించారు. రెండెకరాల స్థలంలో ఒకేసారి 1500 మంది కూర్చునేలా సమావేశహాలు, రెండువందల మంది సామర్థ్యం కలిగిన మరో హాల్, వందమందితో సమావేశానికి అనువైన మినీ హాళ్ల నిర్మాణాలను చేపట్టేందుకు నెలరోజుల్లో డీపీఆర్లు సిద్ధం చేయాలని, ఆ బాధ్యతను ఆయన కలెక్టర్‌కు అప్పగించారు. వర్సిటీల్లో భవనాల మరమ్మతులు, గ్రంథాలయాలు తదితర నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధంచేసి ప్రభుత్వానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆయన కోరారు. ప్రస్తుతం న్యాక్ బృందం ఓయూను పరిశీలిస్తున్నదని, ఆ తరువాత కాకతీయ, జవహర్‌లాల్ సాంకేతిక విశ్వవిద్యాలయాల్లోనూ పర్యటిస్తుందని ఆయన తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలు పాటించి, నైపుణ్యంగల విద్యార్థులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. అంతకుముందు ఆయన ఆర్ట్స్ కాలేజీ ఆడిటోరియాన్ని పరిశీలించారు. ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు దాస్యం వినయభాస్కర్, కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సాయన్న, వరంగల్ అర్బన్ జిల్లా జాయింట్ కలెక్టర్ సొంగల దేవానంద్, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న ఐలయ్య, రాష్ట్ర వికలాంగుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కే వాసుదేవరెడ్డి, కార్పొరేటర్ (రీసెర్చ్ స్కాలర్) జోరిక రమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 11 వర్సిటీల్లో గుర్తించిన ఖాళీలు, మొదటి విడుతగా భర్తీ చేసే పోస్టుల వివరాలను డిప్యూటీ సీఎం వెల్లడించారు.

అన్ని పట్టణాలకు బైపాస్ రోడ్లుండాలి



ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని అన్ని పట్టణాలకు బైపాస్ రోడ్లు ఉండే విధంగా చర్యలు చేపట్టాలని జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులను రాష్ట్ర రోడ్లు,భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కోరారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో సమావేశమై జాతీయ రహదారుల అంశాన్ని ఆయన సమీక్షించారు. జనాభాతోపాటు పట్టణాల్లో రద్దీ విపరీతంగా పెరుగుతున్నదని, పట్టణాల మధ్యలోకి రాకుండా వాహనాలను బైపాస్‌ల ద్వారా మళ్లిస్తే బాగుంటుందని ఈ సందర్భంగా వారితో అన్నారు. రోడ్ల నిర్మాణంపై కేంద్రం రూపొందించిన నియమ నిబంధనలను మంత్రికి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు వివరించారు. భూసేకరణ, రోడ్ల నిర్మాణాల వ్యయం పరిమితులను మించరాదని కేంద్రం ఆదేశించిందని, అన్ని పట్టణాల్లో బైపాస్‌ల నిర్మాణాలు సాధ్యం కాదని వారు తెలిపారు. దీంతో అవసరమైతే కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడి అనుమతి తీసుకుంటామని మంత్రి తుమ్మల చెప్పారు. ఖమ్మం- అశ్వారావుపేట, ఖమ్మం- సూర్యాపేట రహదారి ఎలైన్‌మెంట్లపై కూడా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఏఐ ప్రాంతీయ అధికారి వాత్సవ, ప్రాజెక్టు డైరెక్టర్ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో టీయూడబ్ల్యూజే నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మంత్రి లక్ష్మారెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తదితరులు ఉన్నారు

జర్నలిస్టుల కష్టాలు
సీఎం కేసీఆర్‌కు తెలుసు

- పాత్రికేయుల సంక్షేమ చర్యల్లో తెలంగాణ ఆదర్శం
- టీయూడబ్ల్యూజే నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి టీ హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జర్నలిస్టుల సంక్షేమ చర్యల్లో ఇతర రాష్ర్టాలకు తెలంగాణ ఆదర్శమని భారీ నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడంతో సీఎం కేసీఆర్ దేశానికి రోల్‌మోడల్‌గా ఉన్నారని చెప్పారు. టీయూడబ్ల్యూజే నూతన కార్యాలయాన్ని శుక్రవారం ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయన ప్రారంభించారు. మంత్రి సీ లక్ష్మారెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు ప్రసంగిస్తూ, జర్నలిస్టులు ఎప్పుడూ జనంతోనే ఉంటారని, వారి కష్టాలు తెలిసినందుకే వారికోసం సీఎం వందకోట్లు కేటాయించారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వారికి హెల్త్‌స్కీంను అమలు చేస్తూ వైద్య ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరిస్తున్నదని, జర్నలిజం వృత్తిలో ఉన్నవారికి, వారి తల్లిదండ్రులకు కూడా వర్తించేలా హెల్త్‌స్కీంను అమలుచేస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనన్నారు. టీయూడబ్ల్యూజే భవనం కోసం ప్రభుత్వ స్థలం కేటాయింపుపై సీఎంతో చర్చిస్తానని హరీశ్‌రావు హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపు సమస్య త్వరలో పరిష్కారమవుతుందని చెప్పారు. మంత్రి సీ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకోసం రూపొందించిన హెల్త్‌స్కీం చాలా ఉపయోగపడుతున్నదని, ఉద్యోగులతోపాటు వారికి ప్రభుత్వ దవాఖానలు, కార్పొరేట్ దవాఖానల్లో మెరుగైన సేవలు లభిస్తున్నాయని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన నిధులతో జర్నలిస్టుల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలను చేపట్టామని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు కూడా కీలక పాత్ర పోషించారని ఎమ్మెల్యే వీ శ్రీనివాసగౌడ్ అన్నారు. ప్రజాసమస్యలను వెలికి తీయడంతో పాత్రికేయ లోకం ముందున్నదన్నారు. తొలుత డీజీపీ అనురాగ్‌శర్మ మాట్లాడుతూ, జర్నలిస్టులు ప్రజల కష్టాలను ప్రభుత్వానికి తెలియజేస్తూ సమాజానికి సేవ చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ, నగర మేయర్ బొంతు రామ్మోహన్, వరంగల్ మేయర్ ఎన్ నరేందర్, టీయూడబ్ల్యూజే ఉపాధ్యక్షుడు పల్లె రవికుమార్, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర టెక్స్‌టైల్ పాలసీ విడుదల

నేతన్నలకు అండదండలు



జౌళి, అపారెల్ రంగాలకు భారీ రాయితీలు • ఐదు క్యాటగిరీలుగా కంపెనీలు

వ్యాట్, సీఎస్టీ, ఎస్‌జీఎస్టీలపై రాయితీ ఐదు సంవత్సరాలపాటు అమలు

రెండు కోట్ల వరకు మూలధన రాయితీ

భారీగా విద్యుత్ సబ్సిడీ.. • ప్రతి యూనిట్‌కు రూపాయి తిరిగి చెల్లింపు

స్థానికులకు ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో జౌళి, అపారెల్ రంగాలను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా రాయితీలను ప్రకటించింది. దేశంలో వ్యవసాయం తరువాత ఉపాధి కల్పించే అతిపెద్ద రంగంగా ఉన్న జౌళిరంగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టింది. ఈ మేరకు రాష్ట్ర టెక్స్‌టైల్ పాలసీని శుక్రవారం విడుదల చేసింది. ఏటా 60లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తితో ఈ రంగంలో తెలంగాణ దేశంలోనే మూడో స్థానంలో ఉంది. అయితే వీటి వినియోగానికి సరైన ప్రణాళిక లేదు. రాష్ట్రంలో పది లక్షల బేళ్లను 35 స్పిన్నింగ్ మిల్లుల ద్వారా 9.3 లక్షల స్పిండిల్స్ తయారుచేసే సామర్థ్యం రాష్ట్రంలో ఉంది. పూర్తిస్థాయిలో వీటిని వినియోగించి ఫైబర్ టూ ఫ్యాబ్రిక్ విధానంలో పరిశ్రమలను ఆకర్షించడానికి వరంగల్‌లో రెండు వేల ఎకరాల్లో మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఇక్కడ పెట్టుబడి పెట్టేవారికి ప్రోత్సాహకాలు అందించేందుకు తాజాగా జారీచేసిన పాలసీ కీలకంగా మారనుంది. జౌళి, అపారెల్ రాయితీలపై జీవో విడుదలచేస్తూ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వం ప్రకటించిన రాయితీలు ప్రస్తుతమున్న కంపెనీలు, కొత్తగా స్థాపించబోయే వాటికి ఐదేండ్లపాటు వర్తిస్తాయి. పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు అందించడానికి ఐదు క్యాటగిరీలుగా విభజించారు. గతంలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి, తిరిగి రాష్ర్టానికి వచ్చే తెలంగాణ ప్రాంత నేతన్నలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి 50% (గరిష్ఠంగా రూ.2కోట్లు) క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌ను ప్రభుత్వం సాయంగా అందిస్తుంది. ఈ సాయానికి ఆ సంఘంలోని సభ్యులు 60% ఇతర రాష్ర్టాల నుంచి వచ్చిన తెలంగాణ ప్రాంతానికి చెందిన వారై ఉండాలి. టెక్స్‌టైల్ రంగాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపే దిశగా ప్రణాళికను రూపొందించారు. వరంగల్‌లో ప్రతిపాదించిన మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టడానికి కొరియాకు చెందిన కంపెనీలు ముందుకొచ్చాయి. స్వయంగా వరంగల్ వెళ్లి స్థల పరిశీలన కూడా చేశాయి. మరికొన్ని భారీ కంపెనీలు సైతం ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయి. వీటన్నింటిద్వారా రాష్ర్టాన్ని టెక్స్‌టైల్ రంగానికి కేంద్రంగా చేయడానికి అడుగులు పడుతున్నాయి.

ఐదు రకాలుగా ప్రోత్సాహకాలు

ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలను ఐదు రకాలుగా అందించాలని నిర్ణయించారు. వీటిలో క్యాపిటల్ అసిస్టెన్స్, ఆపరేషనల్ అసిస్టెన్స్, మౌలిక సదుపాయాలు, కెపాసిటీ బిల్డింగ్, స్కిల్ డెవలప్‌మెంట్ సపోర్ట్, ఫైబర్ టూ ఫ్యాబ్రిక్ ఇన్సెంటివ్‌లుగా విభజించారు. చేనేత, జౌళి రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1283కోట్లు కేటాయించింది. వీటికి అదనంగా నిధులు ఇవ్వనుంది.

వ్యాట్, సీఎస్టీ, ఎస్‌జీఎస్టీలపై రాయితీ

వ్యాట్, సీఎస్టీ, ఎస్‌జీఎస్టీలపై రాయితీ ఇస్తారు. ఉత్పత్తి ప్రారంభించిన ఏడేండ్ల దాకా వంద శాతం రీయింబర్స్‌మెంట్ అందజేస్తారు. ప్రస్తుత యూనిట్లు విస్తరించినా, ఆధునీకరించినా ఇదే రాయితీ వర్తింపజేస్తారు. ప్రస్తుత యూనిట్లకు విద్యుత్తు, నీరు, పర్యావరణం వంటి అంశాల్లో 50% దాకా సాయాన్ని అందిస్తారు. దాదాపు మూడేండ్లదాకా ఈ సదుపాయం ఉంటుంది. ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని భావించే పరిశ్రమలకు వారు పెట్టే పెట్టుబడిలో కనీసం 50% దాకా ఆర్థిక సాయంచేస్తారు. ఇది ఒక్కో ప్రాసెస్ లేదా వస్తువుకు గరిష్ఠంగా రూ.10 లక్షలదాకా ఉంటుంది. ఎగుమతులు చేసే సంస్థలకు రవాణాలో సబ్సిడీ ఉంటుంది. ముడిసరుకు దిగుమతి, తయారీ వస్తువు ఎగుమతి రవాణాలో సబ్సిడీ అందజేస్తారు. మొదటి రెండేండ్లు 75% మూడు, నాలుగేండ్లలో 50%, ఐదో ఏట 25% సబ్సిడీ ఇస్తారు. ఒక ఏడాదిలో డిజైన్, వస్తువు అభివృద్ధి కోసం చేసే ఖర్చులో ఇరవై శాతం, గరిష్ఠంగా ఏడాదికి రూ.2 లక్షల దాకా ఆర్థిక సాయాన్ని అందిస్తారు. అయితే, జెనెరిక్ వస్తువులను తయారీచేసే యూనిట్లకు ఈ సాయం ఉండదు. జిన్నింగ్, స్పిన్నింగ్, వీవింగ్, నిట్టింగ్, ప్రాసెసింగ్, దుస్తుల తయారీ, ఉత్పత్తి, టెక్నికల్ టెక్స్‌టైళ్లు, చేతవస్త్రాల తయారీ, జౌళి యంత్రాలు వంటి వాటికి మౌలిక సదుపాయాల్లో సహకారాన్ని అందజేస్తారు.

- జౌళి పరిశ్రమలను మూడు రకాలుగా వర్గీకరించి భూములను కేటాయిస్తారు.
- టీఎస్ఐఐసీ అభివృద్ధిచేసే టెక్స్‌టైల్ పార్కుల్లో ప్లాట్లు కొనుగోలు చేసినా, లీజుకు అందించినా ఈటీపీ, మౌలిక సదుపాయాలు, పరిశోధన, అభివృద్ధి వంటివి ఉంటాయి.
- టీఎస్ఐఐసీ పారిశ్రామిక పార్కుల నుంచి దూరంగా ఉన్న వ్యక్తిగత ప్లాట్లు.
- పీపీపీ (పబ్లిక్, ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్) విధానంలో ఇండస్ట్రియల్ పార్కులు, జౌళి పార్కులు, జౌళి క్లస్టర్లు.
- ప్రతి కొత్త పరిశ్రమ, అపారెల్ పార్కు, ఇతర సంస్థలు మొదటిసారి వస్తే ధరలో యాభై శాతం మినహాయింపునిస్తారు. ఎకరాకు గరిష్ఠంగా రూ.20 లక్షలుగా పేర్కొన్నారు. ఇక సాంకేతిక జౌళి పరిశ్రమలైతే.. పాతిక శాతం మినహాయింపు, అంటే ఎకరాపై రూ.10 లక్షల దాకా అందజేస్తారు.

నిర్మాణ స్థలం:

ప్రతి పరిశ్రమ, అపారెల్ పార్కులో ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్మాణ స్థలాన్ని అభివృద్ధిచేస్తుంది. దీన్ని ఎంఎస్ఎంఈ యూనిట్లు వాడుకోవడానికి ఆస్కారం ఉంటుంది. కార్యకలాపాలను నిర్వహించే మొదటి ఐదేండ్ల దాకా అద్దెలో దాదాపు 25% సబ్సిడీ ఇస్తారు. ప్రస్తుత, కొత్త నీటిపారుదల వనరుల నుంచి ఈ పరిశ్రమల కోసం పది శాతం నీటిని కేటాయించారు. స్టాండ్ ఎలోన్ పరిశ్రమల ముఖద్వారం దాకా రహదారులు, విద్యుత్తు, మంచినీరు వంటివి యాభై శాతం ధరకే, గరిష్ఠంగా కోటి రూపాయల దాకా అందజేస్తారు.

పర్యావరణ మౌలిక సదుపాయాలు

ప్రభుత్వం అభివృద్ధి చేసిన జౌళి, అపారెల్ పార్కుల్లో వ్యర్థాలను శుద్ధి చేయడానికి అవసరమయ్యే కామన్ ఎఫ్లూయంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను పీపీపీ విధానంలో ఏర్పాటుచేస్తారు. ప్రభుత్వమే పూర్తి బాధ్యత తీసుకుని వీటి ఏర్పాటులో సహకరిస్తుంది. ఇందుకోసం ప్రముఖ సంస్థలను వినియోగిస్తుంది. వ్యక్తిగత యూనిట్లు వదిలే వ్యర్థాలను బట్టి ధరను వసూలు చేస్తారు.

- సీఈటీపీ, ఈటీపీలపై ప్రభుత్వం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) చార్జీలపై రాయితీలు అందిస్తుంది. మొదటి రెండు సంవత్సరాలకు 75%, మూడు నాలుగు సంవత్సరాల్లో 50%, ఐదో సంవత్సరంలో 25% ఓ అండ్ ఎం చార్జీలను భరిస్తుంది.
- ఉద్యోగులు, కార్మికులకు నైపుణ్యాభివృద్ధికి శిక్షణ ఇవ్వడానికి ఒక్కో ఉద్యోగికి రూ.3వేలు ప్రభుత్వం సాయమందిస్తుంది. వేయి మందికంటే ఎక్కువ ఉద్యోగులున్న సంస్థల్లో ఒక్కో ఉద్యోగికి రూ.5వేలు అందిస్తారు.

విద్యుత్ సబ్సిడీ

క్యాటగిరీ	సబ్సిడీ
ఏ1, ఏ2	రూ.1లకు యూనిట్
ఏ3	రూ.1.50యూనిట్
ఏ4	రూ.1.75యూనిట్
ఏ5	రూ.2లకు యూనిట్

పరిశ్రమ క్యాటగిరీ	పెట్టుబడి కనీస (రూ.కోట్లలో)	ఉపాధి అవకాశాలు
ఏ1	10	50
ఏ2	10-50	200
ఏ3	50-100	300
ఏ4	100-200	500
ఏ5	200 కంటే ఎక్కువ	1000

క్యాటగిరీ	క్యాపిటల్ సబ్సిడీ సంప్రదాయ టెక్స్‌టైల్స్	క్యాపిటల్ సబ్సిడీ టెక్నికల్ టెక్స్‌టైల్స్
ఏ1	25శాతం(గరిష్ఠంగా రూ.కోటి)	35 శాతం (గరిష్ఠంగా రూ.2.5కోట్లు)
ఏ2	25 శాతం (గరిష్ఠంగా రూ.3కోట్లు)	35 శాతం (గరిష్ఠంగా రూ.5కోట్లు)
ఏ3	25 శాతం(గరిష్ఠంగా రూ.5కోట్లు)	35 శాతం (గరిష్ఠంగా రూ.10కోట్లు)
ఏ4	25 శాతం(గరిష్ఠంగా రూ.10కోట్లు)	35 శాతం (గరిష్ఠంగా రూ.20కోట్లు)
ఏ5	25శాతం (గరిష్ఠంగా రూ.20కోట్లు)	35 శాతం (గరిష్ఠంగా రూ.40కోట్లు)



ఆర్ట్స్‌కళాశాల భవనానికి పునాదిరాయి వేస్తున్న నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్



రాళ్లను తరలించడానికి ప్రత్యేకంగా రైల్వేట్రాక్ వేస్తున్న కూలీలు



నిర్మాణంలో ఉన్న ఆర్ట్స్‌కళాశాల

కండ్ల ముందు వందేండ్ల వైభవం



యూనివర్సిటీ ప్రారంభోత్సవం

హైదరాబాద్ ఆర్ట్స్‌కళాశాల.. అద్భుత నిర్మాణశైలికి, శతాబ్దకాలంగా వెలుగుతున్న విద్యాజ్యోతికి నిదర్శనం. ఈ కళాఖండం నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యేదాకా ప్రతీది ఓ విశేషమే. భవిష్యత్ తరాలకు ఆసక్తిగొలిపే ఓ పాఠమే. అందుకే ఆర్ట్ కళాశాలతోపాటు అనుబంధ భవనాల నిర్మాణ విశేషాలను వివరిస్తూ జర్నలిజం అండ్ మాస్ కమ్యునికేషన్ విభాగం 'పిక్సెల్' పేరుతో ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసింది. ఆర్ట్స్‌కళాశాలలో ఏర్పాటుచేసిన ఈ ఎగ్జిబిషన్‌లో నిజాం మ్యూజియంలో భద్రపరిచిన అరుదైన ఫొటోలను ప్రదర్శనకు ఉంచారు.



‘లోధా’కు 29 వరకు గడువు

- కొనుగోలుదారుల ఫిర్యాదులపై స్పందించాలి
- ఆదేశించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్ రెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనలో ఒప్పందాలకు భిన్నంగా వ్యవహరించడం వంటి ఆరోపణలపై సమాధానం ఇచ్చేందుకు ప్రముఖ నిర్మాణ సంస్థ 'లోధా కన్‌స్ట్రక్షన్స్'కు జీహెచ్‌ఎంసీ ఈనెల 29వ తేదీ వరకు గడువు ఇచ్చింది. జీహెచ్‌ఎంసీ మంజూరుచేసిన నమూనా ప్రకారమే నిర్మాణాలు ఉండాలని, ఉల్లంఘనలు లేకుండా చూడాలని అధికారులు స్పష్టం చేశారు. కేపీహెచ్‌బీ సమీపంలో లోధా కన్‌స్ట్రక్షన్స్ తొమ్మిది ఎకరాల విస్తీర్ణంలో బెలిజ పేరుతో, దాని పక్కనే మరో నాలుగు ఎకరాల్లో మెరీడియన్ పేరుతో నివాస సముదాయాలు నిర్మించింది. రెండింటినీ విభజిస్తూ గోడ ఏర్పాటు చేసింది. తమకు కొనుగోలు సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం పార్కింగ్, క్లబ్ హౌస్, గ్రీనరీ, లిఫ్టులు తదితర సౌకర్యాలు కల్పించలేదని పేర్కొంటూ మెరీడియన్‌లో ప్లాట్లు కొనుగోలు చేసినవారు జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేశారు. బెలిజాలో కల్పించిన సౌకర్యాలపై తమకు కూడా హక్కు ఉందని, గోడ తొలగించాలని వాదిస్తున్నారు. అయితే గోడ తొలిగించేది లేదని, మెరీడియన్ ఫ్లాట్ల కొనుగోలుదారులకు ఎటువంటి హక్కులు లేవని బెలిజ ఫ్లాట్ల యజమానులు వాదిస్తున్నారు. ఈ వ్యవహారం కోర్టు వరకు వెళ్లింది. ఈ నేపథ్యంలో శుక్రవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ బీ జనార్దన్‌రెడ్డి తమ కార్యాలయంలో ఇరు పక్షాలతో సమావేశమయ్యారు. మంజూరుచేసిన నమూనా ప్రకారం నిర్మాణాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని నిర్మాణ సంస్థకు స్పష్టం చేశారు. అపార్ట్‌మెంట్ వాసులు లేవనెత్తిన అంశాలపై సమాధానం ఇచ్చేందుకు లోధా కన్‌స్ట్రక్షన్స్ తరఫున నిర్ణయం తీసుకునే వ్యక్తి హాజరుకాకపోవడంతో సమావేశాన్ని మరోసారి నిర్వహించాలని నిర్ణయించారు. అపార్ట్‌మెంట్లవాసులు లేవనెత్తిన అంశాలపై 29వ తేదీన తమకు సమాధానాలు ఇవ్వాలని నిర్మాణ సంస్థను కమిషనర్ ఆదేశించారు.



చిక్కడపల్లిలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న మండలి చైర్మన్ స్వామిగౌడ్, ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యేలు కే లక్ష్మణ్, వీ శ్రీనివాగౌడ్ తదితరులు

పాపన్న పోరాటం స్ఫూర్తిదాయకం

మండలి చైర్మన్ స్వామిగౌడ్

రాంనగర్: సర్దార్ సర్వాయి పాపన్న పోరాటం స్ఫూర్తిదాయకమని, ఆయన జయంతి వేడుకలను ప్రతి బస్తీలో ఘనంగా నిర్వహించాలని శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి కల్లు దుకాణంలో నిర్వహించిన సర్వాయి పాపన్న జయంతి వేడుకలకు ఆయన హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా పాపన్న విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని నిర్వాహకులు మండలి చైర్మన్‌ను కోరారు. గోల్కొండ కోట వద్ద లేదా నగరంలో ఎక్కడైనా విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యేలు డాక్టర్ కే లక్ష్మణ్, వీ శ్రీనివాస్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు వీ శ్రీనివాస్‌రెడ్డి, గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్, హైదరాబాద్ జిల్లా తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు గడ్డమీది విజయ్‌కుమార్ గౌడ్, గౌడ హాస్టల్ అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్, అంబాల నారాయణగౌడ్, పవన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడ.. మగ.. సమానమే

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

- మార్పుకోసం ప్రయత్నిస్తున్న జేఎన్‌టీయూ
- 'జెండర్ సెన్సిటైజేషన్' కోర్సుతో విద్యార్థులకు అవగాహన
- రెండేండ్లలో ఎంతో మార్పు
- కొత్త అంశాలు చేర్చేందుకు సన్నద్ధమవుతున్న అధికారులు



జహీరాబాద్‌కు చెందిన రాగసుధ ఇంజినీరింగ్ చదివేందుకు హైదరాబాద్ జేఎన్‌టీయూలో చేరింది. అమ్మాయిలు మగ పిల్లలతో కలిసి తిరుగడాన్ని చూసి అస్సలు సహించేది కాదు. కాలేజీలో కొత్తగా ప్రవేశపెట్టిన 'జెండర్ సెన్సిటైజేషన్' కోర్సు ఆమెలో మార్పు తెచ్చింది. లింగ వివక్షను అర్థం చేసుకున్నది. ఆడ.. మగ తేడాలపై అవగాహన కలిగింది. అప్పటి నుంచి అందరితో కలివిడిగా ఉండడంతో స్నేహితులు పెరిగారు. కష్టాలు దూరమయ్యాయి.

మహబూబాబాద్ జిల్లాకు చెందిన వెంకన్న 15 రోజుల కిందట తన బంధువు చనిపోయాడని తెలిసి పరామర్శించేందుకు వెళ్లాడు. చనిపోయిన వ్యక్తి భార్య బొట్టుపెట్టుకొని ఉండడం చూసి అవాక్కయ్యాడు. ఇలా చేయడం తప్పు కదా అని ప్రశ్నింగా.. వితంతువులు బొట్టు, పూలు పెట్టుకోవద్దని ఎక్కడైనా ఉందా? చూపించు.. వంటి వరుస ప్రశ్నలు ఎదురయ్యాయి. దీంతో వెంకన్న నోరెళ్లబెట్టాడు. తన పొరపాటును గ్రహించాడు.

సంప్రదాయం పేరిట గతంలో ఎప్పుడో పెట్టిన కొన్ని అర్థంపర్థం లేని నియమాలు, కట్టుబాట్లు ఇవ్వాళ్ల వివక్షకు దారితీస్తున్నాయి ఇంట్లో, కాలేజీల్లో, స్నేహాల్లో.. ఇలా సమాజంలో ప్రతీచోట ఏదో ఒక రూపంలో లింగ వివక్ష పాతుకుపోయి ఉన్నది. సంస్కృతీ సంప్రదాయాలు, కట్టుబాట్లతో సన్మార్గంలో నడువాల్సిన సమాజం వెర్రితలలు వేసి వక్రమార్గాలు పట్టింది. ఆధునిక సమాజంలో లింగ వివక్ష అతిపెద్ద సమస్యగా మారింది. వీటికి తరగతి గదుల్లో మాత్రమే పరిష్కారం చూపగలమని హైదరాబాద్ జేఎన్‌టీయూ అధికారులు నిరూపిస్తున్నారు. భావితరానికి ప్రతినిధులైన విద్యార్థుల మధ్య లింగవివక్షపై చర్చ లేవనెత్తి.. అవగాహన కల్పించి మార్పు తీసుకొస్తున్నారు. బీటెక్, బీఫార్మసీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 'జెండర్ సెన్సిటైజేషన్' కోర్సును నిర్వహిస్తున్నారు. లింగవివక్షపై ఒక కోర్సును రూపొందించి అమలు చేయడం దేశంలో ఇదే మొదటిసారి. ఈ కోర్సు గురించి ఇటీవలే 'సీఎన్‌ఎన్ న్యూస్ 18' ఛానెల్ జాతీయ స్థాయిలో ప్రసారం చేసింది. జేఎన్‌టీయూకు అభినందనలు తెలుపుతూ పురపాలక, ఐటీ శాఖ మంత్రి కే తారకరామారావు ట్వీట్ చేశారు.

పూర్తిగా ల్యాబ్ కోర్సు..

ఇది పూర్తిగా ల్యాబ్ కోర్సు. యాక్టివిటీలు, బయోగ్రఫీ, రియల్‌లైఫ్ కేస్ స్టడీస్‌లతో కూడిన కార్యక్రమాలు ఉంటాయి. ప్రతి కాలేజీలో జెండర్ సెన్సిటైజేషన్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఎక్కువగా చర్చలు నిర్వహించి విద్యార్థుల అభిప్రాయాలను క్రోడీకరిస్తారు. కేస్‌స్టడీస్‌ను తీసుకొని అందుకు గల కారణాలు, పరిష్కారాలను అక్కడికక్కడే అన్వేషిస్తారు. సాంఘీకరణ, సమస్యలసాధన నైపుణ్యాలు, అమ్మాయిల శాతం తగ్గిపోవడం, గృహహింస, లైంగిక హింస, చట్టాలపై చర్చలు చేపడుతున్నారు. ఇందులో పాల్గొన్న విద్యార్థికి రెండు క్రెడిట్స్‌ను కేటాయిస్తారు. మినీ ప్రాజెక్ట్, అసైన్‌మెంట్లు ఇస్తూ, ఇంటర్నల్స్, రాత పరీక్షలు నిర్వహించి విద్యార్థి సామర్థ్యాన్ని పరిగణిస్తారు. 40 శాతం మార్కులు తెచ్చుకుంటే పాసైనట్టు పరిగణిస్తారు. రెండేండ్లలో ఎంతో మార్పు కనిపిస్తుండడంతో అదనంగా మరిన్ని అంశాలు చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

సిగ్గు, బిడియాన్ని వదిలించుకుంటున్నారు



కోర్సులో చేరిన తర్వాత విద్యార్థులు ఓపెన్‌అప్ అవడం, సిగ్గు, బిడియాన్ని వదిలిపెట్టి కలివిడిగా ఉంటున్నారు. ఆడ.. మగ తేడాల్లేవనే భావన పెరుగుతున్నది. ఈ కోర్సుకు అదనంగా పాఠాలు, కొత్త పుస్తకాలను జోడించి విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నాం.

- ప్రొఫెసర్ గోవర్ధన్, ప్రిన్సిపల్, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీ

అమ్మాయిలు, అబ్బాయిలు కలిసే కూర్చుంటున్నారు



జెండర్ సెన్సిటైజేషన్ కోర్సు ప్రవేశపెట్టిన తర్వాత విద్యార్థుల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తున్నది. ఒకప్పుడు అమ్మాయిలు, అబ్బాయిలు రెండు వరుసల్లో వేర్వేరుగా కూర్చోగా, ఇప్పుడు పక్క పక్కనే కూర్చుంటున్నారు.

- డాక్టర్ పార్వతి, ప్రొఫెసర్

మాకే కొత్తగా అనిపిస్తున్నది



జెండర్ సెన్సిటైజేషన్ కోర్సులో చేరిన తర్వాత మాకే కొత్తగా అనిపిస్తున్నది. ఆడ పిల్లలుగా మేం ఇంత కాలం ఏం కోల్పోయామో తెలుసుకున్నాం. మా పట్ల సమాజం ఎందుకు వివక్ష చూపుతున్నదో అవగాహన చేసుకోవడంతోపాటు పరిష్కారమార్గాలను అన్వేషిస్తున్నాం.దిగువ తరగతుల్లోనూ ఈ కోర్సును ప్రవేశపెట్టాలి.

- నితీష, బీటెక్ సెకండ్ ఇయర్



దేశంలోనే తొలి అడుగు

సమాజంలో మహిళలపై దాడులు, వివక్ష, హింసాత్మక సంఘటనలు పెచ్చుమీరుతున్న నేపథ్యంలో యువతకు స్త్రీ పురుష సమానత్వం, లింగ వివక్షపై డిగ్రీ స్థాయిలోనే అవగాహన కల్పించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ (యూజీసీ) భావించింది. 'జెండర్ సెన్సిటివిటీ' పేరుతో ప్రత్యేక కోర్సులు ప్రవేశపెట్టాలని యూనివర్సిటీలకు పిలుపునివ్వగా.. దేశంలోనే తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ప్రభుత్వ సూచన మేరకు జేఎన్‌టీయూ ప్రత్యేక కోర్సు ప్రవేశపెట్టింది. ఇప్లూ ప్రొఫెసర్‌తో 'టూవర్డ్స్ ఏ వరల్డ్ ఈక్వల్స్' పేరుతో తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో పాఠ్యపుస్తకాన్ని తయారుచేశారు. మొత్తం 13 అధ్యాయాలున్న ఈ పుస్తకంలో సమాజంలోని స్త్రీ, పురుష సంబంధాలు, స్త్రీల శ్రమశక్తి, భ్రూణ హత్యలు, గృహహింస, ప్రేమదాడులు సహా చాలా అంశాలను చర్చించారు. 2015-16 నుంచి ఈ కోర్సును యూనివర్సిటీ కాలేజీలతో పాటు, అనుబంధ, అటానమస్ కాలజీల్లో అమలుచేస్తున్నారు. బీటెక్, బీఫార్మసీ సెకండియర్ రెండో సెమిస్టర్‌లో ఒక సబ్జెక్ట్‌గా బోధిస్తున్నారు.



దేవులపల్లి రామానుజరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పొత్తూరి వెంకటేశ్వరరావు, దేవులపల్లి ప్రభాకర్‌రావు, ఆచార్య ఎస్వీ సత్యనారాయణ

దేవులపల్లి కృషి ఎనలేనిది

తెలుగుయూనివర్సిటీ: తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి పరిఢవిల్లాలనే తపనతో జీవిత చరమాంకం వరకు డాక్టర్ దేవులపల్లి రామానుజరావు పోరాడారని సీనియర్ పాత్రికేయులు డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వరరావు కొనియాడారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ సేవావిభాగం ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ దేవులపల్లి రామానుజరావు శతజయంతి ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పొత్తూరి మాట్లాడుతూ తెలుగులో ప్రాచీన గ్రంథాలను ముద్రించి అతితక్కువ ధరకే సామాన్య పాఠకులకు అందించిన సాహితీ పిపాసి అని పేర్కొన్నారు. శోభ మాసపత్రిక ద్వారా తెలంగాణలోని ప్రముఖ కవులను రామానుజరావు పరిచయం చేశారని అధికార భాషా సంఘం అధ్యక్షుడు దేవులపల్లి ప్రభాకర్‌రావు గుర్తుచేశారు. సారస్వత సేవతోపాటు విద్య, వైజ్ఞానిక రంగానికి విశేషమైన సేవ చేశారన్నారు. 2016 ఆగస్టు 24 నుంచి తెలంగాణ జిల్లాల్లో దేవులపల్లి శతజయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, ఈ నెల 24న తెలంగాణ సారస్వత పరిషత్‌లో దేవులపల్లి రచనల సమాహారాన్ని, శతజయంతి ప్రత్యేక సంచికను, జీవిత చరిత్రను ఆవిష్కరించనున్నట్టు తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జే చెన్నయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, రిజిస్ట్రార్ సత్తిరెడ్డి, విస్తరణ సేవావిభాగం ఇన్‌చార్జి రింగు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్టార్టప్‌ల వేదికగా హైదరాబాద్

- ఔత్సాహికులను ప్రోత్సహించడంలో తెలంగాణ నంబర్‌వన్: జయేశ్‌రంజన్
- సీసీఎంబీలో 'అటల్ ఇంక్యుబేషన్' ప్రారంభం



సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్‌మిశ్రాతో ఎంవోయూ కుదుర్చుకుంటున్న ప్రతినిధులు. చిత్రంలో ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

స్టార్టప్‌లను ప్రోత్సహించడంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే అగ్రగామిగా ఉన్నదని, హైదరాబాద్ ఇంక్యుబేషన్ల కేంద్రంగా నిలుస్తున్నదని ఐటీ, పరిశ్రమల శాఖల ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జ్ క్యాపిటల్‌గా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నదని చెప్పారు. ఉప్పల్‌లోని సీసీఎంబీలో 'అటల్ ఇంక్యుబేషన్ సెంటర్'ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. లైఫ్‌సైన్సెస్‌లో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు దేశంలో 10 అటల్ ఇంక్యుబేషన్లు ఏర్పాటు కానుండగా, అందులో ఒకటి తెలంగాణకు కేటాయించడం సంతోషంగా ఉన్నదన్నారు. దేశంలోనే మొట్టమొదటి సెంటర్‌ను సీసీఎంబీలో ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇంక్యుబేషన్ సెంటర్‌తో రాష్ట్రంతో పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. ఐటీ రంగం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు స్టార్టప్‌ల గురించి మాట్లాడుతున్నా.. నిధుల విషయంలో వెనక్కు తగ్గాయని, తెలంగాణ ప్రభుత్వం ఏకంగా రూ.250 కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. మొదటి విడుతలో భాగంగా టీహబ్ నిర్మాణానికి రూ.50 కోట్లు ఖర్చు చేసిందని, మిగితా మొత్తాన్ని స్టార్టప్‌ల అభివృద్ధికి వెచ్చిస్తున్నదని వివరించారు. యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడానికి నగరంలో ఏర్పాటు చేసిన టీ హబ్ దేశంలోనే అతిపెద్ద ఇంక్యుబేషన్ సెంటరని గుర్తు చేశారు. సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్‌మిశ్రా మాట్లాడుతూ.. లైఫ్‌సైన్సెస్ ఆసక్తి ఉన్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఈ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్‌మిశ్రాతో మూడు సంస్థలు ఒప్పంద పత్రాలు మార్చుకున్నాయి. అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌తో.. మెగలాన్ బయో సైన్సెస్ (నేచురల్ స్వీట్‌నర్), లైకాన్ ల్యాబ్ (బయో త్రీడీ ప్రింటింగ్), సాత్రా సంస్థ (ప్రొఫెషనల్ సర్వీసెస్ స్టార్టప్స్ ఇన్ బయోటెక్నాలజీ) ఎంఓయూ కుదుర్చుకున్నాయి. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.



ఆదిబట్లలోని న్యూకాన్ ఏరోస్పేస్ మిసైల్ విడిభాగాల తయారీ కేంద్రం

ఆదిబట్లలో 'ఏరోస్పేస్ మిసైల్ యూనిట్'

నేడు ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్

ఆదిబట్ల: హైదరాబాద్ శివారు ఆదిబట్ల ఇండస్ట్రియల్ పార్క్‌లోని న్యూకాన్ ఏరోస్పేస్‌లో మిసైల్ యూనిట్ కేంద్రాన్ని ఐటీ, పురపాలకశాఖల మంత్రి కే తారక రామారావు, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డితో కలిసి శనివారం ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. బీడీఎల్ రూపొందిస్తున్న ఆకాశ్ మిసైల్ తోకభాగాన్ని న్యూకాన్ ఏరోస్పేస్‌లో తయారుచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏరోస్పేస్ రంగానికి పెద్దపీట వేస్తున్న సంగతి తెలిసిందే. న్యూకాన్ ఏరోస్పేస్ ఏర్పాటుకు ఆదిబట్ల పారిశ్రామికవాడలో ఐదు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఈ సంస్థలో ఇప్పుడు ఆకాశ్ మిసైల్‌కు సంబంధించిన విడిభాగాల తయారీ కేంద్రం రూపుదిద్దుకున్నది. ఇక్కడ తయారుచేసే విడిభాగాలను జర్మనీకి ఎగుమతి చేస్తారు. ఇదివరకు మిసైల్‌కు సంబంధించిన పరికరాలు ఇతరదేశాల నుంచి దిగుమతి అయ్యేవి. నేడు రాష్ట్రంలోని ఆదిబట్ల న్యూకాన్ ఏరోస్పేస్ మిసైల్ పరికరాలను ఇతరదేశాలకు సరఫరా చేసేస్థాయికి ఎదుగడం విశేషం. ఈ కేంద్రంతో 600 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. శనివారం జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో మహేశ్వరం ఎమ్మెల్యే తీగలకృష్ణారెడ్డి, న్యూకాన్ ఎండీ హేమంత్ జలాన్ పాల్గొననున్నారు.

సైబరాబాద్‌లో సీఐ.. ఎస్సైల బదిలీలు

త్వరలో 'సెటిల్మెంట్' పోలీసుల అరెస్టులు?

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలను బదిలీ చేస్తూ కమిషనర్ సందీప్ శాండీల్య శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. అవినీతి, అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై సీపీ చర్యలకు ఉపక్రమించారు. ఇటీవల రాచకొండ కమిషనరేట్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్ అదనపు డీసీపీ పులిందర్‌రెడ్డి, రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ ఆ స్టేషన్‌లో పనిచేసే ఎస్సైపై భూదందా సెటిల్మెంట్, కిడ్నాప్ తదితర ఆరోపణలు వచ్చాయి. వారిపై రాయదుర్గం పీఎస్‌లో కేసులు నమోదైన సంగతి తెలిసిందే. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న సీపీ రాయదుర్గం ఇన్‌స్పెక్టర్, ఎస్సైని బదిలీ చేసినట్టు తెలుస్తున్నది. పూర్తిస్థాయి నివేదిక వచ్చిన తర్వాత వారి పాత్ర ఉన్నట్టు తేలితే సస్పెన్షన్‌తో పాటు, అరెస్ట్ వంటి కీలక పరిణామాలు చోటు చేసుకుంటాయని అధికారులు చెప్తున్నారు. షాద్‌నగర్ ఎస్‌హెచ్‌వో, ఎస్సైపైనా అవినీతి ఆరోపణలు రావడంతో బదిలీవేటు పడ్డట్టు తెలిసింది.

బదిలీ అయిన అధికారులు వీరే..

పేరు	హోదా	ప్రస్తుతం	బదిలీ స్థానం
ఎం గంగాధర్	ఇన్‌స్పెక్టర్	ఎస్‌వోటీ, మాదాపూర్ జోన్	ఎస్‌హెచ్‌వో, రాయదుర్గం పీఎస్, అదనంగా ఎస్‌వోటీ బాధ్యతలు
డీ దుర్గాప్రసాద్	ఇన్‌స్పెక్టర్	రాయదుర్గం పీఎస్, ఎస్‌హెచ్‌వో	సీపీ కార్యాలయానికి అటాచ్
జీ రాజశేఖర్	సబ్ ఇన్‌స్పెక్టర్	రాయదుర్గం పీఎస్	సీపీ కార్యాలయానికి అటాచ్
ఎస్ శ్రీనివాసచారి	ఇన్‌స్పెక్టర్	షాద్‌నగర్ పీఎస్, ఎస్‌హెచ్‌వో	సీపీ కార్యాలయానికి అటాచ్
ఎం దాస్	సబ్ ఇన్‌స్పెక్టర్	షాద్‌నగర్ పీఎస్	సీపీ కార్యాలయానికి అటాచ్
టీ విజయ్‌కుమార్	సబ్ ఇన్‌స్పెక్టర్	వీఆర్	షాద్‌నగర్ పీఎస్

ఆకాశంలోకి బెలూన్ ఫ్లైట్‌లు

- హైదరాబాద్ నుంచి టీఐఎఫ్‌ఆర్ ప్రయోగం
- సమీప జిల్లాలో దిగే అవకాశం
- గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: వాతావరణంపై శాస్త్రీయ పరిశోధనల కోసం హైదరాబాద్ కేంద్రంగా బెలూన్ ఫ్లైట్‌లు ప్రయోగించనున్నట్టు టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్‌ఆర్) శాస్త్రవేత్త బీ సునీల్‌కుమార్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈసీఐఎల్‌లోని బెలూన్ ఫెసిలిటీ ఆఫ్ టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ నుంచి ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ మధ్య పది బెలూన్ ఫ్లైట్‌లను ఆకాశంలోకి వదులుతామన్నారు. ఈ బెలూన్లలో హైడ్రోజన్ గ్యాస్, ప్లాస్టిక్ ఫిల్మ్‌లు, శాస్త్ర పరికరాలు ఉంటాయని చెప్పారు. ఇవి 50 మీటర్ల నుంచి 85 మీటర్ల వ్యాసం కలిగి ఉంటాయన్నారు. 17 కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్ల ఎత్తు వరకు వెళ్తాయని చెప్పారు. అక్కడ వివరాలు, నమూనాలు సేకరించిన తర్వాత కిందికి వస్తాయని చెప్పారు. అవి భూమిమీదికి వచ్చేటప్పుడు పారచూట్స్ సాయంతో దిగుతాయన్నారు. హైదరాబాద్‌కు 200 నుంచి 350 కిలోమీటర్ల పరిధిలో భూమికి మీదికి వస్తాయని తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మమబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో ఈ పారాచూట్స్ భూమికి చేరుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. శాస్త్రపరికరాలతో కూడిన పారాచూట్ 20 మీటర్ల తాడు మాదిరిగా భూమిమీదికి చేరుకుంటుందన్నారు. పైన పేర్కొన్న జిల్లాల ప్రజలు ఈ పారాచూట్‌లను గుర్తిస్తే వెంటనే సమీపంలోని పోలీస్టేషన్‌కు లేదా జిల్లా అధికారులకు తెలియపరుచాలని కోరారు. పారాచూట్‌పైన ఉన్న అడ్రస్‌కు ఫోన్ చేయవచ్చునని, టెలిగ్రామ్ చేయవచ్చునని, లేదా సమీపంలోని పోస్టాఫీస్‌లో అప్పగించాలని సూచించారు. సమాచారం ఇచ్చినవారికి బహుమతులు ఇస్తామని ప్రకటించారు. పోలీస్‌స్టేషన్‌లో, జిల్లా అధికారులకు అప్పగించినవారికి రవాణా ఖర్చులు సైతం ఇస్తామన్నారు. ఈ పారాచూట్‌లలో ఉండే శాస్త్ర పరికరాలు చాలా విలువైనవని, సున్నితమైనవని పేర్కొన్నారు.



జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi
హైదరాబాద్
శనివారం 19 ఆగస్టు 2017
WWW. NTNEWS.COM



ఈ మధ్య మీరు చూసిన ఓ కొత్త ప్రదేశం ఏమిటి? చాలాకాలమైందా చూసి? ఈ బిజీ లైఫ్‌లో అంతేలెండీ. చూడాల్సిన ప్రదేశాలు.. కలువాల్సిన మనుషులు.. చవిచూడాల్సినరుచులు.. చదువాల్సిన పుస్తకాలు ఎన్నో ఉన్నాయి ఈ ప్రపంచంలో. కానీ సగటు మనషులకు తీరికే ఉండదు. కానీ ఈ నలుగురు అమ్మాయిలు అలా కాదు. ఈ ప్రపంచాన్ని చుట్టేయాలి. గమ్యంలేని ప్రయాణం చేయాలి. ఎన్నో జ్ఞాపకాలు, అనుభవాలు మూటకట్టుకోవాలి. అమ్మాయిల ఒంటరి ప్రయాణమా? నో.. జస్ట్ బ్రేక్ ది రూల్. **శివానీ, సిమ్రాన్, దీప్తి, శ్రీజ** ఇదే పనిచేస్తున్నారు. సోషల్ మీడియాలో సరికొత్త ట్రావెల్ స్టోరీస్ రాస్తున్నారు.

ప్రపంచాన్ని చుట్టేద్దాం రండి!

కొన్ని ఆలోచనలు ప్రయాణాలకు స్వాగతం పలుకుతాయి. కొన్ని ప్రయాణాలు సరికొత్త ఆలోచనలకు దారితీస్తాయి. కొన్ని దారులు అద్భుతమైన సాహసాలు చేసేలా ప్రేరేపిస్తాయి. ఆ అద్భుతాలు మెమరీ డైరీలో పదిలంగా భద్రపరచి ఉంటాయి. ఇలాంటి అవకాశం అందరికీ రాదు. వచ్చినా అందరూ సద్వినియోగం చేసుకోరు. కానీ ఈ నలుగురమ్మాయిలు తమ జీవితం సార్థకమయ్యే.. జీవితాంతం తీపి జ్ఞాపకంగా మిగిలిపోయే ప్రయాణాలు చేస్తున్నారు. ప్రపంచాన్నంతా వాళ్ల గుప్పిట్లో బంధించి బహు ముచ్చట పడుతున్నారు. ప్రయాణాల్లో ఆనందాలే కాదు.. కోల్పోయిన జ్ఞాపకాలు కూడా వెతుక్కోవచ్చని నిరూపిస్తున్నారు. ఆసక్తికరమైన విషయాలు తెలుసుకుని ప్రయాణం ఒక అందమైన అనుభూతి అని చాటిచెప్తున్నారు.

* * *

Shivani Reddy Created Group 'Our Travel Story–2017'
Shivani Reddy (Admin) Added Simran Agarwal, Deepthi Abula, Sreeja Madoori.
మొదటి మెసేజ్ : థ్యాంక్యూ ఫర్ క్రియేటింగ్ గ్రూప్.
ఛలో ఎటు మన ప్రయాణం?

* * *


శివాని: ఈసారి ట్రిప్ కేరళ మన్నార్ వెళ్దాం.
సిమ్రాన్: లేదు.. ఈసారి గోవా వెళ్దాం. పోయినసారి పాండిచ్చేరి అటూ వెళ్లాం కదా?
శ్రీజ: అంతకాదు.. మెజారిటీ బై మైనారిటీ. దేనికెక్కువ ఓటేస్తే అదే ఫైనల్.
దీప్తి: నాదైతే ఏం లేదు. మీ ఇష్టం. మీరెక్కడికెళ్దామంటే అక్కడికి నేను ఓకే.
శివాని: మన్నార్.
శ్రీజ: మన్నార్.
దీప్తి: అయితే నా ఓటూ మన్నార్‌కే.
సిమ్రాన్: నేనూ ఓకే. చలో మన్నార్.
మూడు రోజుల ప్లాన్. జర్నీ స్టార్ట్..

* * *

వేల మైళ్లు దాటాలన్నా.. వందల కిలోమీటర్లు ప్రయాణించాలన్నా ముందు ఒక అడుగుపడాలి. ఆ అడుగు కోసం కారణాలు, కాజ్‌లు వెతుక్కోవద్దు. వీళ్ల ప్రయాణం కూడా ఇలాంటిదే. అన్ని ప్రయాణాలకు కాజ్ ఉండాల్సిన అవసరం లేదంటారు. అంతులేని ఆనందాలను వెతుక్కోవడం కోసమే ప్రయాణం మొదలుపెట్టారు. జ్ఞాపకాలను.. అందమైన అనుభూతులను వెతుక్కుంటున్నారు.
హైదరాబాద్‌కు చెందిన ఈ నలుగురు అమ్మాయిలు ప్రతి ఏడాది ఓ ట్రిప్ ప్లాన్ చేసుకుని వెళ్తుంటారు. ప్రయాణంలో ఎదురైన అనుభవాలను.. జ్ఞాపకాలను సోషల్‌మీడియాలో ట్రావెల్ డైరీస్ పేరుతో పోసు చేస్తున్నారు. ప్రస్తుతం సిమ్రాన్ అగర్వాల్, దీప్తి, శ్రీజ ముగ్గురూ శ్రీనిధి కాలేజ్‌లో ఇంజినీరింగ్ చదువుతున్నారు. శివాని కార్పొరేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నది. కాలేజ్‌కు సెలవులు దొరికినప్పుడు ఇంట్లో తల్లిదండ్రుల అనుమతితో దూర ప్రయాణాలకు వెళ్తున్నారు. నిజానికి వీళ్లంతా మ్యూచువల్ ఫ్రెండ్స్. కానీ ఇప్పుడు బెస్ట్ ఫ్రెండ్స్.
సో.. ఇదండీ మ్యాటర్.
నలుగురు అమ్మాయిలు కలిస్తే అస్తమానం ముచ్చట్లే పెట్టరు. షాపింగ్ మాత్రమే వారి హాబీ కాదు. ఇలాంటి ప్రయాణాలూ చేస్తారు. అమ్మాయిలు సిని మాకు వెళ్తాస్తామంటేనే వద్దంటారు కొందరు తల్లిదండ్రులు. ఇంకొందరైతే గడప కూడా దాటనివ్వరు. అలాంటిది రాష్ర్టాల సరిహద్దులు దాటి ప్రయాణాలు చేస్తున్న వీళ్లు నేటితరం అమ్మాయిలకు ఆదర్శం. అంతేకాదు.. కట్టుబాట్లు, సంప్రదాయాల పేర్లతో గీసిన గీతలను చెరిపేస్తూ నచ్చిన ప్రదేశాలకు విహరిస్తున్నారు. ఓవైపు ఉన్నత చదువులు చదువుతూనే ఊర్ల పొంటి తిరుగుతున్నారు. అక్కడ ప్రజల ఆచారవ్యవహాలను, ఆహార పదార్థాల విశేషాలను తెలుసుకుని కొత్తకొత్త ఆసక్తికరమైన అంశాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పెడుతున్నారు.!

2K15

రోజూ కాలేజ్, ఇల్లు, ఫ్రెండ్స్, హోమ్ వర్క్, ఫేస్‌బుక్, వాట్సప్ ఇవేనా జీవితం? కాదు. ఇంకేదో ఉంది. ఈ కాంక్రీట్ జంగిల్‌కు దూరంగా ప్రకృతికి దగ్గరగా దూరపు ప్రయాణాలు మంచివని నిర్ణయించుకున్నారు ఈ నలుగురు. ప్రతి ఏడాది ఓ రాష్ట్రం. అక్కడ ఉన్న ప్రత్యేక ప్రదేశాలు, పర్యాటక స్థలాలను సందర్శిస్తున్నారు. 2015లో కర్ణాటకలోని హంపీ, బెంగళూరు వెళ్లారు. అక్కడి నుంచి గోకర్ణ, మణిపాల్ చుట్టేశారు. అక్కడ చుట్టు పక్కల ఉన్న అన్ని ప్రదేశాలను చూశారు. స్ట్రీట్‌ఫుడ్, స్పెషల్ ఫుడ్, కల్చర్, లొకేషన్స్ కవర్ చేస్తూ మొబైల్ ఫొటోగ్రఫీ చేసి సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. మొదటి ట్రిప్‌తో చాలా పాఠాలు నేర్చుకున్నారు. నలుగురు అమ్మాయిలు ఎవరి తోడు లేకుండా దూరపు ప్రయాణం చేస్తున్నారు. సమాజం ఏమనుకుంటుంది? ఇంట్లో వాళ్లు ఎలా పంపిస్తున్నారు? ఇలాంటి ప్రశ్నలను చాలా విన్నారు. బట్ డోంట్ కేర్. దేన్నీ పట్టించుకోలేదు.



2K16



ఎవరు ఏమైనా అనుకున్నా సరే అని ప్రయాణం మొదలుపెట్టారు. అది పూర్తవ్వాలి. ప్రతిఏడాది ఓ ట్రిప్ వేయాలనుకున్నారు. 2016 సంవత్సరానికి గానూ ఇంకో ట్రిప్ ప్లాన్ చేశారు. ఈసారి పాండిచ్చేరి వైపు సాగింది. నలుగురు అమ్మాయిలకు ఒక్కోచోట హోటల్ ఇవ్వడానికి కూడా కొందరు సందేహించారు. ప్రతీది ఒక ప్రణాళిక ప్రకారం చేస్తున్నారు. ఎక్కడికి వెళ్లినా ముందే ఆ ప్రాంతంలో ఉండే వాతావరణం గురించి, చుట్టుపక్కల ఉన్న ప్రదేశాల గురించి క్షుణ్ణంగా తెలుసుకుని వెళ్తున్నారు.

2K17

నలుగురు అందమైన అమ్మాయిలు రోడ్డు మీద నుంచి నడుచుకుంటూ వెళ్తే సాధారణంగా అబ్బాయిలు ఏదో ఒకటి కామెంట్ చేస్తారు. అవకాశం దొరికితే ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతారు. గత మూడేళ్లుగా చేస్తున్న ప్రయాణంలో వీళ్లకు ఇలాంటి సందర్భాలు ఎన్నో ఎదురయ్యాయి. ఇబ్బందులు ఎదురయ్యాయని ఎప్పుడూ ప్రయాణాలను ఆపాలనుకోలేదు. ఈసారి ట్రిప్ కేరళలోని మన్నార్, కొచ్చిన్‌కు బయలుదేరారు. కేరళ కాఫీ తోటల్లో, అందమైన బీచ్‌లలో తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వచ్చే ఏడాదికి సంబంధించిన ట్రిప్ ప్లాన్ కూడా చేసుకున్నారు. కానీ దాని సమాచారం వాట్సప్ గ్రూప్‌లో పెట్టలేదు. వాళ్ల మనసుల్లో దాచుకున్నారు. ఫైనల్ అయ్యాక గ్రూప్‌లో అనౌన్స్ చేస్తారు.

ఈ తలనొప్పి ఇంకెన్నాళ్లు?




అడుగండి చెబుతా

నా వయసు 26 సంవత్సరాలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలో టీమ్ లీడర్‌గా పనిచేస్తున్నాను. పని ఒత్తిడి వల్ల రోజుకు 9 గంటలకు పైగానే కంప్యూటర్‌పై పనిచేస్తుంటాను. రెండేళ్లుగా తీవ్రమైన తలనొప్పితో సతమతమైపోతున్నాను. దీని వల్ల సమయానికి ఆఫీసులో కార్యకలాపాలు పూర్తి చేయలేక చాలా ఒత్తిడికి లోనవుతున్నాను. ఇప్పటికి చాలామంది డాక్టర్లను సంప్రదించాను. మైగ్రేన్ లక్షణాలు ఉన్నట్టు అనుమానించి మందులు కూడా ఇచ్చారు. కానీ వాటి వల్ల తాత్కాలిక ఉపశమనం మాత్రమే. ఒక్కోసారి తలనొప్పి వస్తే రెండు రోజుల పాటు వేధిస్తున్నది. దయచేసి నా సమస్యకు పరిష్కారం తెలుపగలరు.

నిహారిక, హైదారాబాద్

తలనొప్పి రావడానికి అనేక కారణాలున్నాయి. కుటుంబంలో ఎవరైనా ఈ తరహా సమస్యతో బాధపడిన దాఖలాలు ఏమైనా ఉన్నాయా? మీకు షుగర్, బీపీ, కొలెస్ట్రాల్, థైరాయిడ్ వంటి సమస్యలు ఉన్నాయేమో చూడాలి. తలనొప్పి రెండు వైపులా వస్తున్నదా? లేదా? అనే విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. మీరు చెప్పిన దాన్ని బట్టి వైద్యులు మీకు మైగ్రేన్ అనుకొని మందులు ఇచ్చారు. మైగ్రేన్‌ను నిర్ధారించడానికి ప్రత్యేకంగా పరీక్షలంటూ ఏమీ ఉండవు. కేవలం లక్షణాలను బట్టి మైగ్రేన్‌కు చికిత్స ఇస్తారు. తలలో ఒకవైపు మాత్రమే వచ్చే నొప్పిని పార్శ్వపు నొప్పి లేదా మైగ్రేన్ అంటారు. ఇది వస్తూ పోతూ ఉంటుంది. ఒత్తిడి వల్ల వచ్చే నొప్పి తలపైన పట్టీ వేసినట్టుగా, పోటు వచ్చినట్లుగా వస్తుంది. మెదడులో కణతుల వల్ల వచ్చే నొప్పి వస్తూ తగ్గుతూ ఉంటుంది. నొప్పి తీవ్రత ఒక సారి కంటే మరోసారి బాగా పెరుగుతుంటుంది. తలనొప్పి తీవ్రంగా ఉన్నప్పుడు వాంతులూ కావొచ్చు. వాంతి అయిన తర్వాత నొప్పి కాస్త తగ్గినట్టుగా అనిపించి మళ్లీ కొద్దిసేపటికే పెరిగిపోతుంది. కొంతమందిలో తలనొప్పి ఒకసారి వస్తే మళ్లీ మూడు నెలల పాటు రాకపోవచ్చు. కొందరికి తరచుగా కూడా రావచ్చు. ఒక్కసారి మొదలైతే తలనొప్పి ఎన్ని గంటపాటు ఉంటుందన్న దాని మీద చికిత్స ఆధారపడి ఉంటుంది. ప్రయాణం చేసిన తర్వాత, ఎండలో తిరిగినా, జలుబు చేసినా, నిద్ర లేకపోయినా, ఆహారం ఆలస్యంగా తీసుకున్నా బాగా అలసిపోయినా మైగ్రేన్ రావచ్చు. అలాగే సైనసైటిస్ వల్ల కూడా తీవ్రమైన తలనొప్పి వస్తుంది. మైగ్రేన్‌కు కేవలం మందులతో పరిష్కారం దొరకదు. మందులతోపాటు ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. వీలైనంత వరకు ఒత్తిడికి దూరంగా ఉండేందుకు ప్రయత్నించడం, రోజు కనీసం అరగంటపాటు వ్యాయామం, యోగా వంటివి చేయడం వల్ల మైగ్రేన్ నుంచి ఉపశమనం లభిస్తుంది.



డాక్టర్ వినోద్ కుమార్. కె.
న్యూరోఫిజీషియన్
సన్‌షైన్ హాస్పిటల్స్
సికింద్రాబాద్

వాట్సప్!

ట్వీట్

అక్షయ్‌కుమార్
@akshaykumar



అక్షయ్ కుమార్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

19,373,596

నదులు మన ప్రాణదాతలు, జీవన ప్రమాణాలు. వాటిని కోల్పోతే తిరిగి పొందలేం. నదులను సంరక్షించుకునే బాధ్యత మనందరిపైనా ఉంది. ర్యాలీ ఫర్ రివర్ ఉద్యమంలో భాగస్వాములు అవ్వాలంటే 8000980009 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వండి.

సమ్‌థింగ్ స్పెషల్



ఫ్రీవైఫై కావాలంటే.. ఇతని వెంటపడాలంట!

కామన్‌మ్యాన్ వాయిస్

ఒకరోజు చంద్రబాబు, ఒకరోజు లోకేష్, ఒకరోజు బాలయ్య.. సోషల్‌మీడియాలో ప్రతిరోజూ కామెడీ సినిమాలు చూపిస్తున్నారు.

Murali Puli

స్క్రీన్ మీద రంగులేసుకొని ఎగిరే ముసలి సింహానికి సరిగ్గా మాట్లాడకడమే రాదు. అభిమానులపై చేయిచేసుకోవడం, ఆడవాళ్లపై అసభ్యంగా మాట్లాడడం మాత్రం వచ్చు. మంచితనం అంతా ఉత్త దబిడి దిబిడే!

Ramesh Pittla Mudiraj

వైరల్ వీడియో



కుక్కలు మాట్లాడుతాయా? నిజంగా మాట్లాడితే ఎలా ఉంటుంది? ఈ వీడియో చూడండి. మహాతల్లి కుక్కతో మాట్లాడించింది. ఆటాడించింది.

Leo Maatladithe - If Pets Could Talk || Mahathalli

Total views : 315,022+

Published on Aug 16, 2017

షేరింగ్

ఎవరి గురించి అయినా మనం ఎప్పుడూ చెడుగా ఆలోచించకూడదు. ఇది ఒక నియమంగా పెట్టుకోవాలి. అలా ఆలోచించకుండా ఉండగలమా అని సందేహం కలుగుతుంది. అయినా దీన్ని మనం అభ్యాసం చెయ్యాలి. ఎందుకంటే దీనివల్ల చాలా లాభాలున్నాయి. నిరంతరం ఇతరుల గురించి చెడుగా ఆలోచించడం వల్ల ముందు మన మనసులో చెడ్డ వాతావరణం ఏర్పడుతుంది. అది అవతలవారికి ఎంత హాని చేస్తుందో తెలియదు. కానీ ముందు మన ఆరోగ్యాన్ని పాడు చేస్తుంది. దీనికి శాస్త్రీయమైన దాఖలాలున్నాయి. రక్తపోటు పెరుగుతుంది. మధుమేహం అదుపుతప్పుతుంది. మనిషి ఎలా ఆలోచిస్తే అలాగే ఉంటాడంటారు. చెడుగా ఆలోచించి, ఆలోచించి చెడ్డలో మునిగిపోతే మన మనసును దెయ్యంలా చెడు పట్టుకుంటుంది. అది అవతలవారికి హాని చేసే లోపలే మనం దానికి బలి అయిపోతాం.

దుర్యోధనుడు ఒకసారి వెతికితే ఎక్కడా అతడికి ఒక్క మంచివాడు కూడా కనపడలేదట. చెడ్డవాడికి మంచి ఎక్కడ కనిపిస్తుంది? ఏ చూపుతో చూస్తే ఆ భావమే అందరిలో కనిపిస్తుంది. ఉదయం లేవగానే ఈ లోకం బాగుండాలి. అందరూ బాగుండాలని హృదయపూర్వకంగా పది నిమిషాల పాటు కోరుకోవాలి. ఇలా చేస్తే, మందులు వేసుకోకుండానే ఆరోగ్యం బాగుంటుందని ఆధ్యాత్మిక శాస్త్రాలు తెలియజేస్తున్నాయి. గురువులు బోధిస్తున్నారు. మనం కూడా ఆలోచించాలి. ఆచరించాలి.

-ఓ వాట్సప్ మెసేజ్



శ్రియ, ఛార్మి, బోయపాటి శ్రీను, అనూప్ రూబెన్స్, బాలకృష్ణ, ముస్కాన్, కైరాదత్, క్రిష్, పూరి జగన్నాథ్, నామా నాగేశ్వరరావు, ఆనంద్‌ప్రసాద్

'పైసావసూల్' గీతావిష్కరణ

'నేను పోషించే ప్రతి పాత్ర ప్రత్యేకంగా వుండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాను. ఈ విషయంలో నాకు నాన్నగారే స్ఫూర్తి' అన్నారు బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'పైసా వసూల్'. పూరి జగన్నాథ్ దర్శకుడు. భవ్య క్రియేషన్స్ పతాకంపై వి.ఆనందప్రసాద్ నిర్మించారు. శ్రియ, ముస్కాన్, కైరాదత్ కథానాయికలు. సెప్టెంబర్ 1న ప్రేక్షకులముందుకు రానుంది. గురువారం ఖమ్మంలో చిత్ర గీతాల్ని విడుదల చేశారు. దర్శకుడు బోయపాటి శ్రీను ఆడియోను ఆవిష్కరించి తొలి ప్రతిని మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 'నటుడు ప్రజలకు కావాల్సిన వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించాలి. 'పైసా వసూల్' నా 101వ చిత్రం. అయినా మొదటి సినిమాగానే భావించి కష్టపడి పనిచేశాను. ఈ సినిమాతో తిరిగి నా ప్రయాణాన్ని ప్రారంభించానని అనుకుంటున్నాను. నాకు పాటలు, సంగీతమంటే చాలా ఇష్టం. ఎక్కువగా నాన్నగారి పాటల్ని వింటుంటాను. ఈ సినిమాలో పాట పాడమని పూరిజగన్నాథ్ కోరగానే వెంటనే ఓకే చెప్పాను. సంగీత దర్శకుడు అనూప్ తోడ్పాటుతో గంటలో పాటను పూర్తిచేశాను. శ్రియతో గతంలో చేసిన రెండు సినిమాలు మంచి విజయాన్ని సాధించాయి. ఆమెతో నాకిది మూడో చిత్రం. ఈ సినిమాలో యంగ్‌గా కనిపిస్తున్నానని అందరూ అడుగుతున్నారు. పేరుకు తగినట్లుగానే ఈ సినిమా భారీ వసూళ్లను సాధిస్తుందనే నమ్మకముంది' అన్నారు. పూరి జగన్నాథ్ మాట్లాడుతూ 'బాలకృష్ణ మంచి మనిషి. ముక్కుసూటిగా వుంటారు. కోపం, ప్రేమ..ఎలాంటి భావోద్వేగాన్నైనా వెంటనే వ్యక్తం చేస్తారు. ఆయనతో చాలా ఆలస్యంగా పనిచేస్తున్నందుకు బాధపడ్డాను. నాన్నగారు, సినిమా తప్ప బాలకృష్ణకు మరో లోకం వుండదు. అభిమానుల్ని ఎలా చూసుకోవాలో ఆయనకు బాగా తెలుసు. ఆయన అభిమానిని కొడితే అది లవ్‌స్టోరీ. వాటిని సీరియస్‌గా తీసుకోవద్దు. భవిష్యత్తులో బాలయ్యతో మరో సినిమా చేయడానికి సిద్ధంగా వున్నాను' అన్నారు. బాలకృష్ణతో మూడో సినిమా చేయడం ఆనందంగా వుందని శ్రియ పేర్కొంది. నిర్మాత మాట్లాడుతూ 'బాలకృష్ణ కోపానికి ఓ కారణం వుంటుంది. ఆయన మాటిస్తే హరిశ్చంద్రుడు, మాట తప్పితే విశ్వామిత్రుడు. ఈ విషయాన్ని తెలుసుకున్నవారు ఆయనతో పనిచేస్తే అద్భుతాల్ని చూస్తారు' అన్నారు. 'పైసా వసూల్'తో బాలకృష్ణ రెండొందల చిత్రాల మైలురాయికి శ్రీకారం చుట్టారని దర్శకుడు క్రిష్ అన్నారు. ఈ సినిమా తప్పకుండా పెద్ద విజయాన్ని సాధిస్తుందని బోయపాటి శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛార్మి, అలీ, అంబికా కృష్ణ, ముఖేష్, వద్దిరాజు రవిచంద్ర, విక్రమ్‌జిత్ తదితరులు పాల్గొన్నారు.



నాగార్జున

మీ ప్రేమకు ధన్యుణ్ణి!

సోషల్‌మీడియాలో చురుగ్గా వుంటారు నాగార్జున. సినిమా విశేషాలతో పాటు తన వ్యక్తిగత విషయాల్ని కూడా అభిమానులతో పంచుకుంటారు. సాంఘిక మాధ్యమాల్లో ఆయన్ని అనుసరిస్తున్న వారు లక్షల్లో వున్నారు. తాజాగా ఈ వెండితెర మన్మథుడు సోషల్‌మీడియాలో సరికొత్త మైలురాయిని చేరుకున్నారు. ట్విట్టర్‌లో నాగార్జున ఫాలోవర్స్ సంఖ్య 30 లక్షలకు చేరింది. ఈ సందర్భంగా ఆయన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. 'నాపై చూపిస్తున్న అపారమైన ప్రేమకు ధన్యుణ్ణి' అంటూ ఆయన ట్విట్టర్‌లో స్పందించారు. ట్విట్టర్‌లో నాగార్జునని ప్రతిరోజు ఐదువేల మంది కొత్తగా ఫాలో అవుతున్నారు. ఇదిలా వుండగా నాగార్జున ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'రాజుగారి గది-2' ప్రస్తుతం చిత్రీకరణ దశలో వున్నది. ఓంకార్ దర్శకుడు. అక్టోబర్ 13న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఎంఎస్‌జీ ఆన్‌లైన్ గురుకుల్!



గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్

ఎంఎస్‌జీ ది మెసేంజర్, ఎంఎస్‌జీ ది వారియర్ లయన్ హార్టెడ్ వంటి సందేశాత్మక చిత్రాలని అందించిన గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం 'ఎంఎస్‌జీ ఆన్‌లైన్ గురుకుల్'. ఈ నెల 15న గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ చిత్ర పోస్టర్‌ను హర్యానాలోని సిర్సాలో విడుదల చేశారు. ఈ సందర్భంగా 120 జంటలకు వివాహం జరిపించి ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'శాతకర్ణి తన తల్లి పేరునే తన ఇంటిపేరుగా పెట్టుకుని గౌతమిపుత్ర శాతకర్ణిగా మారాడు. ఆ మహనీయుడు తరహాలోనే ఓ మహిళ తన తల్లిపేరును తన ఇంటి పేరుగా ఎందుకు పెట్టుకోకూడదు? ఈ ఆచారానికి శ్రీకారం చుట్టాలని కోరుతున్నాను. సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న నేరాల్ని నిర్మూలించే సైబర్ పోలీస్ ఆఫీసర్ కథాంశం నేపథ్యంలో 'ఎంఎస్‌జీ ఆన్‌లైన్ గురుకుల్' చిత్రాన్ని తెరకెక్కించనున్నాం. ఇందులో నేను పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తాను. అక్టోబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది' అని తెలిపారు.

సచ్చింది గొర్రె!



'సచ్చింది రా గొర్రె' చిత్రంలో ఓ దృశ్యం

శ్రీనివాసరెడ్డి, టిల్లు వేణు, జబర్దస్త్ రాకేష్, శివారెడ్డి, చిత్రం శ్రీను ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'సచ్చింది రా గొర్రె' శ్రీధర్‌రెడ్డి యార్వ దర్శకుడు. దీపక్‌ముకుత్, యన్.యమ్. పాషా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. దర్శకుడు మాట్లాడుతూ 'ఆద్యంతం వినోదాత్మకంగా తెరకెక్కిస్తున్న చిత్రమిది. ప్రతి సన్నివేశం నవ్వులు పండిస్తుంది. దర్శకుడిగా ఇదే నా తొలి చిత్రం' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'కొత్త ఆలోచనలకు ప్రాధాన్యతనిస్తూ అర్థవంతమైన చిత్రాల్ని నిర్మించడమే మా లక్ష్యం. దక్షిణాదిలో వినూత్నమైన కథలు తెరకెక్కుతున్నాయి. అందుకే బాలీవుడ్‌లో పలు చిత్రాల్ని నిర్మించిన మేము తెలుగు చిత్రపరిశ్రమపై దృష్టిపెట్టి తొలి ప్రయత్నంగా కొత్త తరహా చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ఈ చిత్రాన్ని నవంబర్‌లో పూర్తిచేసి డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్‌కుమార్, ఛాయాగ్రహణం: రమణ సాల్వ.

సాంకేతికత మాయలో...

అంజలి, ఆండ్రియా, వసంత్‌రవి ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'తారామణి'. రామ్ దర్శకుడు. ఈ చిత్రాన్ని డి.వి. సినీ క్రియేషన్స్ పతాకంపై నిర్మాత డి. వెంకటేష్ అదే పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. అనువాద కార్యక్రమాలు జరుగుతున్నాయి. నిర్మాత మాట్లాడుతూ 'యువతపై సాంకేతిక పరిజ్ఞాన ప్రభావాన్ని, దాని వల్ల వారు ఎదుర్కొంటున్న సమస్యల్ని అర్థవంతంగా ఆవిష్కరించే చిత్రమిది. సమకాలీన ఇతివృత్తానికి వాణిజ్య హంగులను మిళితం దర్శకుడు రామ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇటీవలే తమిళంలో విడుదలైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలతో పాటు మంచి విజయాన్ని దక్కించుకున్నది. అదే రీతిలో తెలుగు ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకముంది. అనువాద కార్యక్రమాల్ని పూర్తిచేసి ఈ నెలాఖరున లేదా సెప్టెంబర్ మొదటి వారంలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు.



వసంత్‌రవి ,ఆండ్రియా

లిప్‌స్టిక్ ఎలా..?!

లిప్‌స్టిక్ వేసుకోవడం ఒక కళ. దాన్ని జాగ్రత్తగా వేసుకుంటేనే అందం రెట్టింపయ్యేది. ఇందుకోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోండి.



- స్కిన్ టోన్‌ని బట్టి ఎలాంటి లిప్‌స్టిక్ సూటవుతుందో చూసుకోవాలి. పేల్ స్కిన్ వాళ్లు.. లైట్ షేడ్, గ్లాసీ లిప్‌స్టిక్ ఉపయోగించాలి. డార్క్ స్కిన్ వాళ్లకయితే గోల్డ్, బ్రౌన్, రెడ్ కలర్‌లు బాగుంటాయి.
- పెదవులపై మృతకణాలు ఉంటే.. లిప్‌స్టిక్ ఎక్కువ సేపు ఉండదు. వాటిని తొలగించేందుకు పెదవులపై టూత్‌బ్రష్‌తో నెమ్మదిగా మర్దనా చేయాలి. లిప్‌స్టిక్ వేసుకునే ముందు పెదవులు తాజాగా ఉండేలా చూసుకోవాలి.
- వారానికి రెండుసార్లు తేనె, చక్కెర కలిపి పెదవులపై స్క్రబ్ చేయాలి. ఇలా చేస్తే పెదవులపై ఉన్న డెడ్ స్కిన్ పోయి లిప్‌స్టిక్ అందంగా కనిపిస్తుంది.
- లిప్‌స్టిక్ వేసుకునే పదినిమిషాల ముందు లిప్‌బామ్ రాసుకోవాలి. దానివల్ల మీరు వేసుకున్న రంగును పెదవులు పీల్చుకోవు.
- ముందుగా లిప్‌స్టిక్ వేసి బ్లాటింగ్ పేపర్‌తో అద్దాలి. ఆ తర్వాత మరోసారి రంగు వేయడం వల్ల ఎక్కువసేపు లిప్‌స్టిక్ నిలిచి ఉంటుంది.
- లిప్‌స్టిక్ ట్యూబ్ నుంచి కాకుండా బ్రష్‌తో వేసుకోవాలి. పెదవుల పక్కన ఏదైనా రంగు అంటుకుంటే కన్సీలర్‌తో సులభంగా తీసేయొచ్చు.

చేదుగా ఉందని మానేశారో..

కాకరకాయ చేదుగా ఉంటుందని చాలామంది ఇష్టపడరు. కానీ కాకరని తినడం మానేస్తే అనారోగ్య సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు.



కాకరకాయలో బోలెడు ఔషధ గుణాలున్నాయి. బ్రొకోలీ కంటే రెండింతల బీటా కెరోటిన్ కాకరలో ఉంది. ఇది శరీరానికి విటమిన్ ఎ అందిస్తుంది. ఇందులో క్యాల్షియం కూడా అధికం. ఎముకలు, దంతాలకు కాకర వల్ల బలం చేకూరుతుంది. ఇందులోని పొటాషియం నరాల వ్యవస్థకు మేలు చేస్తుంది. హృద్రోగానికి దూరం చేస్తుంది. కాకరలోని చారన్టిన్ అనే ధాతువులు రక్తంలోని చక్కెర శాతాన్ని తగ్గిస్తాయి. చక్కెర వ్యాధిగ్రస్తుల్లో ఇన్సులిన్‌ని పెంచుతుంది కాకర. విటమిన్ బి1, 2, 3, సి, మెగ్నీషియం, ఫోలేట్, పాస్ఫరస్, మాంగనీస్, పీచు వంటి ఎన్నో పోషకాలు కాకరలో ఉన్నాయి. వారానికోసారి కాకర జ్యూస్ తాగడం వల్ల ఉదర సమస్యలను దూరం చేసుకోవచ్చు. కాకర గింజలు వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. అనవసర కొవ్వును కరిగిస్తాయి. కాకర జ్యూస్, నిమ్మరసంతో కలిపి పరగడుపున తీసుకుంటే మొటిమలుండవు. చర్మవ్యాధులు నయమవుతాయి. కాకర రసాన్ని జీలకర పొడితో రుబ్బుకొని మాడుకు రాస్తే చుండ్రు పోతుంది. కాకర రసం జుట్టు రాలడాన్ని తగ్గిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

వెదురు మహిళ!



ఉక్కు మహిళ .. పసిడి మహిళ విన్నాం. కానీ ఈ వెదురు మహిళ గురించి ఎక్కడా వినలేదే అనుకుంటున్నారా? ఆమె పేరు మధుజైన్. టెక్స్‌టైల్స్ రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్న ఫ్యాషన్ డిజైనర్. టెక్స్‌టైల్స్ రంగమంటే కేవలం వ్యాపారమే కాదు, భారతీయ బ్రాండ్‌ను కాపాడుతూ సరికొత్త మోడల్స్ రూపొందించడమూ అని చెప్తున్నదామె.

ఫ్యాషన్‌కు దేశీయ హంగులద్ది కల్చర్‌ను బతికించాలనేది మధు ఆలోచన. అందుకోసం ఆమె వినూత్న ఐడియాలు.. సరికొత్త మోడల్స్ రూపొందిస్తూ వస్తున్నది. పద్నాలుగేండ్లు సుదీర్ఘంగా కష్టపడి ఓ రికార్డ్ సాధించింది. టెక్స్‌టైల్స్ రంగంలో తొలిసారిగా వెదురును ప్రవేశపెట్టింది. వెదురుతో సిల్క్ మిళితం చేసి కొత్త మోడల్‌ను రూపొందించింది. ఇండోనేషియా, ఉజ్బెకిస్తాన్, భారతీయ సంప్రదాయాలను మిళితం చేస్తూ 'బాంబూ సిల్క్ ఇక్కత్'ను తయారు చేసింది. ఆమె రూపొందించిన ఈ సరికొత్త మోడల్ వస్త్రాలు వ్యాపార రంగంలో కొత్త అధ్యాయానికి తెరతీశాయి. 'ప్రపంచ మొదటి వెదురు సిల్క్ ఇక్కత్'గా పేరు పొందుతూ వస్త్ర వ్యాపార రంగంలో తనకంటూ ఓ పేజీని లిఖించుకున్నది. 'కళా నైపుణ్యం డబ్బు సంపాదన కోసమే కాదు.. మన సాంప్రదాయాల్ని.. సంస్కృతినీ.. వారసత్వ సంపదనూ పరిరక్షించడానికీ దోహదపడాలి' అని అంటున్నది మధు జైన్. దీంట్లో భాగంగానే తాను తొలి వెదురు సిల్క్ ఇక్కత్‌ను రూపొందించినట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా ఈ సిల్క్‌ని మరింత ప్రాచుర్యం పొందేలా చేస్తానంటున్నది.

అరకప్పు తినాల్సిందే!

రోజుకు అరకప్పు పెరుగు కచ్చితంగా తీసుకొని తీరాల్సిందేనట. అధిక మోతాదులో క్యాల్షియం అందించే పెరుగు ఆరోగ్యానికి ఎంతో మంచిది.



బరువు పెరుగుతారని చాలామంది అమ్మాయిలు పెరుగు మానేస్తుంటారు. రోజుకు అరకప్పు అయినా పెరుగు తీసుకోవాల్సిందేనంటున్నారు నిపుణులు. పెరుగును తీసుకోవడం ద్వారా శరీరంలోని మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. ఇది జీర్ణ వ్యవస్థలో ఉండే ఇన్‌ఫెక్షన్లను అదుపులో ఉంచుతుంది. పైగా డైటరీ ఫ్యాట్ గ్రహించుకోవడాన్ని తగ్గిస్తుంది. ఫలితంగా ఆకలి అదుపులో ఉంటుందన్నమాట. పెరుగులో ఉండే క్యాల్షియం శరీరంలోని కొవ్వు కణాలను బయటకు పంపిస్తుంది. అంతేకాదు.. ఇందులో ఉండే అమినో ఆమ్లాలు కొవ్వును కరిగిస్తాయి. పెరుగు తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇందులో ఉండే పొటాషియం, పాస్ఫరస్, రైబోఫ్లేవిన్ వంటి పోషకాలు కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తాయి.

ఎప్పటికైనా ఎవర్‌గ్రీన్..



ఫ్లాట్లతో పోల్చితే ప్లాట్లను కొనుగోలు చేస్తేనే ఉత్తమమని అనేకసార్లు నిరూపితమైంది. ఇవైతే ఊహించిన దానికంటే అధిక రాబడిని అందుకోవచ్చు. పైగా, ఒక్కోసారి మనం దాచుకున్న సొమ్ముతోనే ప్లాట్లను సులువుగా కొనుగోలు చేయవచ్చు. ఒకవేళ బ్యాంకు రుణం తీసుకున్నా.. అది తీరేలోపు ఆ స్థలం రేటు కనీసం రెండు రెట్లు అయినా పెరుగుతుంది. కాకపోతే, న్యాయపరంగా ప్రతి అంశాన్ని పక్కాగా చూసుకున్నాకే ప్లాటును కొనుగోలు చేయాలి. మరి, ఏయే సందర్భాల్లో ఫ్లాట్ల కంటే ప్లాట్లు ఉత్తమం అంటే..

ప్లాట్లు కొనేవారు... భవిష్యత్తులో అభివృద్ధికి ఆస్కారమున్న ప్రాంతాలను ఎంచుకోవాలి. మరి, అభివృద్ధి చెందే ప్రాంతాలను ఎలా గుర్తించాలి? తెలంగాణ ప్రభుత్వం వివిధ ప్రాంతాల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాల్ని కల్పించే సంస్థలను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రచిస్తోంది. ఆయా ప్రాంతాల్లో ఎప్పటిలోపు పరిశ్రమలు ఏర్పాటు అవుతాయో అంచనా వేసి.. వాటికి చేరువలో ప్లాట్లు కొనడం ఉత్తమం.

వాస్తవ పరిస్థితులు కీలకం..

కొన్ని ప్రాంతాల్లో ప్లాట్ల ధరలను మధ్యవర్తులు ఇష్టం వచ్చినట్లు పెంచేశారు. ఓ ఐదు, పదేండ్ల తర్వాత పెరగాల్సిన రేట్లను ఇప్పుడే పెంచేసి.. లావాదేవీలు జరగక్కుండా చేస్తున్నారని పలువురు డెవలపర్లు అంటున్నారు. రియల్ సంస్థలు, మధ్యవర్తులు చెప్పే మాటలను గుడ్డిగా నమ్మేసి.. మన కష్టార్జితాన్ని బూడిదలో పోసిన పన్నీరు చేసుకోకూడదు. ప్లాట్లను కొనేటప్పుడు వాస్తవాలను, అక్కడి వాస్తవ పరిస్థితులను అంచనా వేశాకే ముందడుగు వేయాలి.

కాలనీలకు ఎంత చేరువ?

రియల్ ఎస్టేట్ మార్కెట్ అంచనాల ప్రకారం.. ప్రతి ఏడాది రియల్ అభివృద్ధి అనేది ఒక కిలోమీటర్ దాకా విస్తరిస్తుంది. ఉదాహరణకు, ప్రస్తుతం శివారు ప్రాంతాల్లో ప్రజలు నివసించే కొన్ని ప్రాంతాలు ఉన్నాయనుకుందాం. ఓ ఏడాది నుంచి రెండేండ్ల దాకా, అక్కడ్నుంచి మరో కిలోమీటర్ దూరం దాకా కొత్త ప్రాంతాలు అభివృద్ధిలోకి వచ్చే అవకాశం ఉంటుంది. లేదా కొత్త కాలనీలు ఏర్పడొచ్చు. ఆయా ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాల్ని కల్పించే సంస్థలు ఏర్పడితే.. అతివేగంగా ఇండ్లను కట్టుకోవడానికి ప్రజలు ఆసక్తి చూపిస్తారు. మనం ఊహించిన దానికంటే త్వరగా స్థలాల ధరలూ పెరగవచ్చు.

స్థలం.. ఉత్తమం



ప్రస్తుతమైనా.. భవిష్యత్తులోనైనా సొంతంగా ఇల్లు కట్టుకోవాలని భావించేవారు.. స్థలం కొనుక్కోవడం కంటే మరో ప్రత్యామ్నాయం లేదనే చెప్పాలి. పిల్లలు పెరిగి పెద్దయ్యేసరికి వారి ఉన్నత చదువులు లేదా వారి పెళ్లిళ్లకు పనికొస్తుందని భావించేవారికి ప్లాటు కంటే మంచి ప్రత్యామ్నాయం మరోటి లేదు. ప్రస్తుతమున్న ప్రాంతానికి లేదా కాలనీకి ఎంత దూరంలో ప్లాట్లు ఉన్నాయో చూడాలి. డెవలపర్ చేసే అభివృద్ధి పనులను బట్టి ఎంపిక చేయాలి.

- గురురాజ్, ఎండీ, సుఖీభవ ప్రాపర్టీస్

నెలకు 100-110 ప్లాట్లు



ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాల వల్ల.. రియల్ రంగానికి సరికొత్త కళ వచ్చింది. ప్రతినెలా దాదాపు వంద నుంచి నూట పది ప్లాట్లను అమ్ముతున్నాం. ప్రాజెక్టులో అభివృద్ధి పనులను వేగంగా చేస్తున్నాం. అందుకే, ఫార్మా, ఐటీ ఉద్యోగులతో బాటు ప్రవాసులు, వ్యాపారులు మా వద్ద ప్లాట్లు కొంటున్నారు.

– శేషగిరిరావు, సీఎండీ, ఫార్చ్యూన్ ఇన్‌ఫ్రా

కాబట్టి, రియల్ రంగం ద్వారా లాభాలను అందుకోవడానికి ప్రయత్నించేవారు.. ప్రస్తుతమున్న కాలనీలకు అటుఇటుగా కొనుక్కోవడం మంచి నిర్ణయం.

రేటు తక్కువని..

కొన్ని సంస్థలు గజానికి వెయ్యి రూపాయలు లేదా రెండు వేలంటూ కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఆయా సంస్థలు తక్కువ రేటుకే అందిస్తున్నప్పటికీ.. ఆ లేఅవుటుకు అభివృద్ధికి దూరమెంత ఉందనే విషయాన్ని అంచనా వేయాలి. ఒకవేళ, ఆయా డెవలపర్‌కి మంచి పేరుంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించవచ్చు. లేదా అట్టి లేఅవుట్‌లో ఆధునిక రిసార్టులు, గేమింగ్ జోన్లు, అడ్వెంచరెస్ గేములు వంటివి అభివృద్ధి చేస్తే.. కనీసం వారంతంలోనైనా వెళ్లి సరదాగా గడపొచ్చనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్లాటు కొనడానికి మొగ్గు చూపొచ్చు. కేవలం రేటు తక్కువని కొంటే అంతే సంగతులు. ఆ ప్రాంతం డెవలప్ అవ్వడానికి పుణ్యకాలం కాస్త గడిచిపోతుంది.

ప్రధాన తేడా ఇవే..

- ప్లాట్లు ధరలనేవి ప్రాంతాన్ని బట్టి ఆధారపడుతుంది. ఫ్లాట్ల విషయానికొస్తే.. ప్రాంతం, అక్కడి మౌలిక సదుపాయాలు, అందులోని సౌకర్యాలు, డిజైన్, డెవలపర్ బ్రాండ్ బట్టి రేటుంటుంది.
- నగరాల్లో స్థలం కొనుక్కుంటే రేటు అనూహ్యంగా పెరుగుతుంది. కాకపోతే, రేటూ ఎక్కువే ఉంటుంది. ఫ్లాటు అయితే, ధర పెరుగుదల నామమాత్రంగా ఉంటుంది. స్థలం ధర పెరిగే కొద్దీ ఫ్లాటు ధర అధికమవుతుంది.
- ప్లాట్లు కొనేటప్పుడు న్యాయపరంగా ప్రతి అంశాన్ని పక్కాగా చూసుకోవాలి. అదే ఫ్లాట్ల విషయానికొస్తే, ఈ అంశంలో డెవలపర్ జాగ్రత్తలు తీసుకుంటాడు. కాకపోతే, ఫ్లాటు చేతికొచ్చే తేదీలో ఆలస్యం జరిగే అవకాశాల్లేకపోలేవు.
- కేవలం ప్లాటు కొంటానంటే బ్యాంకులు రుణమివ్వడానికి అంగీకరించవు. ఇల్లు కట్టుకుంటానంటే షరతులను పెట్టి అప్పిస్తాయి. ఫ్లాట్లకు బ్యాంకులు రుణాలు సులువుగా మంజూరు చేస్తాయి.
- క్రమం తప్పకుండా ఆదాయం రావాలని కోరుకునేవారికి ప్లాటు కంటే ఫ్లాటే నయం. ఫ్లాటు తీసుకున్నాక ప్రతినెలా అద్దె చేతికొస్తుంది.

ఇంటి అందాన్ని పెంచే ఇటుకలు

ఇల్లు కట్టాలంటే ఇటుకలు ఎంతో కీలకమైనవి. మరి, సాధారణ ఇటుకలను నిర్మాణంలో వినియోగిస్తే.. వృథా ఎక్కువ కన్పిస్తుంది. సిమెంటు వాడకమూ అధికంగా ఉంటుంది. పైగా, కొన్నాళ్ల తర్వాత చెమ్మ, చెదలు వంటి వాటితో ఇండ్లు అందవికారంగా తయారవుతాయి. మరి, కష్టార్జితంతో నిర్మించుకునే ఇల్లు చూడముచ్చటగా నిలవాలంటే.. ఇటుకల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి.

సంప్రదాయ ఇటుకల బదులు ఏసీసీ బ్లాకులతో ఇండ్లను కట్టే పోకడకు హైదరాబాద్‌లో ఆదరణ పెరుగుతోంది. ఆటో క్లేవ్డ్ ఏరేటెడ్ కాంక్రీటు అని పిలిచే ఈ బ్లాకుల ద్వారా ఇండ్లు నిర్మించే పోకడకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు ఉంది. దీనికి మన వద్ద కూడా గిరాకీ గణనీయంగా పెరుగుతోంది. ఇండ్ల నిర్మాణంలో ఏసీసీ బ్లాకులను ఉపయోగించడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. సాధారణ ఇటుకల బదులు ఏసీసీ బ్లాకులు కాస్త పెద్ద సైజుల్లో మనకు దొరుకుతాయి. పైగా చాలా దృఢంగా ఉంటాయి. అగ్నివ్యాప్తిని ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిరోధిస్తుంది. పైగా, వాతావరణానికి అనుకూలమైన వస్తువు ఇది. బయటి శబ్దాలను ఎట్టి పరిస్థితుల్లో ఇంట్లోకి దరిచేరనీయదు. అందుకే, ఈ తరహా ఇటుకలతో ఆస్పత్రులు, విద్యా సంస్థలు, స్టూడియోలు వంటివి నిర్మించడానికి అధిక ప్రాధాన్యతనిస్తారు. చెమ్మ, చెదలు వంటివి ఇంట్లోకి రానీయకుండా తోడ్పడుతుంది. సాధారణ ఇటుకలతో పోల్చితే ఇలాంటి ఇటుకల వల్ల రేటు నలభై శాతం ఖర్చును ఆదా చేస్తుంది. వృథా ఎక్కడా కన్పించదు.

ఎంత అవుతుంది?

పొడవు, వెడల్పు, మందం బట్టి ఇటుకల ధర ఆధారపడుతుంది. ఉదాహరణకు, 2 అడుగులు x 8 అంగుళాలు x 4 అంగుళాల ఇటుక ధర దాదాపు రూ.40 అవుతుంది. ఒక్కో ఇటుక ఎంతలేదన్నా 1.4 చదరపు అడుగుల స్థలానికి సరిపోతుంది. అంటే, ఓ వంద చదరపు అడుగుల స్థలానికి ఎంతలేదన్నా 70 ఇటుకలు సరిపోతాయి. అంటే, రూ.2,800తో వంద చదరపు అడుగుల గోడలను కట్టుకోవచ్చన్నమాట. ఇలాగే, నచ్చిన మందంలో ఇటుకలు దొరకడమే కాకుండా అవసరమయ్యే సైజుల్లో లభిస్తాయి.

గోపనపల్లి నుంచి గోవా దాకా..

నగరంలో తెల్లాపూర్, గోపనపల్లి, ఎల్‌బీనగర్, నాగోలు వంటి ప్రాంతాల నుంచి గోవా దాకా ఏసీసీ ఇటుకల వాడకం గణనీయంగా పెరిగింది. వ్యక్తిగతంగా ఇల్లు కట్టుకునేవారు.. ఆర్కిటెక్ట్ ప్లాన్ మాకు మెయిల్ చేస్తే.. వారి ఇంటికెన్ని ఇటుకలు అవసరమవుతాయో చెబుతాం. వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్ వంటి జిల్లాల్లో వ్యక్తిగతంగా వీటితో ఇండ్లను కట్టుకునే వారు పెరిగారు.

- విజయ్.ఎస్, ఎండీ, ప్రైమ్ గ్రూప్

రెరాలో నమోదు.. అప్పుడే రుణం!

డెవలపర్లకు సరికొత్త సమస్య వచ్చి పడింది. 'రెరా' కింద నమోదు చేసుకోని ప్రాజెక్టులకు రుణమివ్వమని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు అంటున్నాయి. ఒకవైపు అధిక రాష్ట్రాల్లో 'రెరా' అథారిటీలింకా ఏర్పాటు కాలేదు. దీంతో, కొత్త ప్రాజెక్టులకు అనుమతినిచ్చే ప్రక్రియ ఇంకా ఆరంభం కాలేదు. దీంతో, నిర్మాణ సంస్థలు దిక్కుతోచని స్థితిలో కొట్టిమిట్టాడుతున్నాయి. ఫలితంగా, రాష్ట్రాలూ తమ ఆదాయాన్ని కోల్పోతున్నాయి. ఈ అంశంలో ప్రధానమంత్రి, ఆర్‌బీఐలు జోక్యం చేసుకోవాలని జాతీయ నిర్మాణ సంస్థల సంఘమైన క్రెడాయ్ కోరింది.

'రెరా' చట్టం అమల్లోకి వచ్చిన నాటి నుంచి బ్యాంకులు డెవలపర్ల నుంచి అదనపు పూచీకత్తును అడుగుతున్నాయి. ప్రాజెక్టులకు రుణాన్ని మంజూరు చేయడానికి డెవలపర్ల వ్యక్తిగత ఆస్తులను తనఖా పెట్టమని కోరుతున్నాయి. ప్రస్తుతం రెరా చట్టంలో పొందుపర్చిన నిబంధనలను దృష్టిలో పెట్టుకుని రుణాల్ని మంజూరు చేస్తే తమ సొమ్ముకు ఎలాంటి రక్షణ లేదని బ్యాంకులు అంటున్నాయి. అందుకే, తాము రుణమిచ్చేటప్పుడు ఆచితూచి అడుగు వేయాల్సి వస్తోందని చెబుతున్నాయి. మరోవైపు బిల్డర్లేమో రెరా రిజిస్ట్రేషన్ పనుల్లో వేగం పెరగాలని కోరుతున్నారు. గృహ నిర్మాణ సముదాయానికి అనుమతుల్ని తీసుకున్నాక రెరా అథారిటీ నుంచి మళ్లీ అనుమతి తీసుకోక తప్పదు. ఒక నిర్మాణానికి సంబంధించి కొనుగోలుదారుల సొమ్ములో డెబ్బయ్ శాతం మొత్తాన్ని ఎస్క్రో ఖాతాలో జమ చేయాలి. ఆయా సొమ్మును కేవలం అట్టి నిర్మాణానికి వినియోగించాలి. దేనికెంత అవుతుందో లెక్కలు రాయాలి. అందుకే, చాలా మంది బిల్డర్లు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు.




ప్రభాస్ మొదలుపెట్టాడు!


ప్రభాస్

ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'బాహుబలి ది కన్‌క్లూజన్' తరువాత ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం 'సాహో'. యువ దర్శకుడు సుజిత్ రూపొందిస్తున్నారు. యు.వి.క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ శుక్రవారం మొదలైంది. ఈ విషయాన్ని హీరో ప్రభాస్ సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. 'ఇట్స్ షూట్ టైమ్...దాదాపు నాలుగున్నరేళ్ల 'బాహుబలి' ప్రయాణం తరువాత 'సాహో' అనే కొత్త యాక్షన్ ప్రపంచంలోకి ప్రవేశించడం చాలా ఎక్సైటింగ్‌గా వుంది' అని పోస్ట్ చేశారు. ప్రస్తుతం చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతున్నట్లు తెలిసింది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్న ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా శ్రద్ధాకపూర్‌ను ఖరారు చేశారు. అంతర్జాతీయ స్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రభాస్ మరింత స్టైలిష్‌గా కనిపించనున్న ఈ చిత్రం కోసం విదేశాల్లో పోరాట ఘట్టాలు చిత్రీకరించనున్నారట. ఇందు కోసం హాలీవుడ్ స్టంట్‌మెన్ కెనీ బేట్ పనిచేస్తున్నారు. యూరప్‌తో పాటు అబుదాబి, రుమేనియా తదితర దేశాల్లో కీలక ఘట్టాల చిత్రీకరణ జరపనున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురాన్నట్లు తెలిసింది.









సెన్సెక్స్	నిఫ్టీ
31,525	9,837
↘ 271	↘ 67

బంగారం ధరలు

ముంబై

24 క్యారెట్లు	29,285
22 క్యారెట్లు	28,135
వెండి (కిలో)	39,300

ముడి చమురు (బ్రెంట్) ↗ 52.59

టాప్‌టెన్ గెయినర్స్

Poddar Housing 20.00%	1320 (1100)	▲	220.00
Wall Street Fin 20.00%	39.30 (32.75)	▲	6.55
Inox Wind 19.88%	129.05 (107.65)	▲	21.40
Pitti Laminatio 19.87%	64.25 (53.60)	▲	10.65
Athena Constr 19.28%	29.70 (24.90)	▲	4.80
Kallam Spinning 19.01 %	33.50 (28.15)	▲	5.35%
Compuage Info 17.69%	30.60 (26.00)	▲	4.60
Punj Comm 17.14 %	49.90 (42.60)	▲	7.30
Rishabh Digha 16.95%	37.25 (31.85)	▲	5.40
Talbros Eng 16.39 %	618.85 (531.70)	▲	87.15

టాప్‌టెన్ లూసర్స్

India Green Rea 17.11%	32.45(39.15)	▼	6.70
Sunstar Realty 13.79%	39.70(46.05)	▼	6.35
Uni Abex 11.07%	356.35(400.70)	▼	44.35
Infosys 9.60%	923.10(1,021.15)	▼	98.05
Ruby Cables 9.60%	20.25(22.40)	▼	2.15
GKB Ophthalmics 9.52%	113.10(125.00)	▼	11.90
Bemco Hydraulic 8.87%	153.05(167.95)	▼	14.90
Ruttonsha Intl 8.48%	51.25(56.00)	▼	4.75
Mitsu Chem Plas 8.31%	149.00(162.50)	▼	13.50
Tokyo Plast 7.79%	127.80(138.60)	▼	10.80

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	58.38	67.69
ఆస్ట్రేలియా డాలర్	46.10	53.33
బహ్రెయిన్ దినార్	158.19	181.18
యూరో	68.49	79.43
జపాన్ యెన్/100	53.34	61.88
కువైట్ దినార్	175.72	218.82
ఒమన్ రియాల్	154.79	177.13
ఖతార్ రియాల్	--	--
సౌదీ రియాల్	15.52	18.40
సింగపూర్ డాలర్	42.77	50.65
స్టెర్లింగ్ పౌండ్	75.21	87.28
యూఏఈ దిర్హామ్	15.89	18.57

కోడిగుడ్ల ధరలు

	నెక్	హెచ్‌ఎల్‌ఎఫ్‌ఏ
హైదరాబాద్	335-00	335-00
రంగారెడ్డి	335-00	335-00
మెదక్	335-00	335-00
కరీంనగర్	357-00	---
వరంగల్	357-00	---
రిటైల్ ప్రైస్	4-15	4-15

చికెన్ ధరలు

ఫారం ధర	82.00
రిటైల్ లైవ్	97.00
డ్రెస్‌డ్	136.00
స్కిన్‌లెస్	160.00



సీఈవో సిక్కా రాజీనామా

ఇన్ఫోసిస్ బోర్డు, నారాయణ మూర్తికి మధ్య పోరు నేపథ్యంలో అనూహ్య నిర్ణయం.. సీవోవో ప్రవీణ్ రావుకు తాత్కాలిక సారథ్య బాధ్యతలు

న్యూఢిల్లీ, ఆగస్టు 18: దేశంలో రెండో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ సీఈవో, ఎండీ అయిన విశాల్ సిక్కా తన పదవికి రాజీనామా చేశారు. గతకొద్దికాలంగా తనపై జరుగుతున్న మాటల దాడి, దుష్ప్రచారం వల్ల సక్రమంగా బాధ్యతలు నిర్వహించలేకపోతున్నానని, అందుకే పదవికి రాజీనామా చేయాలనికి నిర్ణయించుకున్నట్లు సంస్థ ఉద్యోగులకు రాసిన లేఖలో సిక్కా పేర్కొన్నారు. 'నాపై జరుగుతున్న నిరాధార ఆరోపణల దాడిని ఎదుర్కొంటూనే సీఈవోగా బాధ్యతలు నిర్వర్తించలేకపోతున్నా. సంస్థ విలువను మరింత పెంచలేకపోతున్నా' సిబ్బందికి పంపిన ఈ-మెయిల్‌లో తన ఆవేదన వ్యక్తం చేశారు. బాగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. 'ఎందుకంటే, బాధ్యతల నుంచి దృష్టి మళ్లించే పరిణామాలు, తరుచుగా ఏదో ఒక వివాదం చుట్టుముడుతుండటం అభద్రతా వాతావరణాన్ని సృష్టించింది' అని అన్నారు.

ఇన్ఫోసిస్ బోర్డు మాత్రం మాజీ చైర్మన్, ప్రమోటర్ ఎన్‌ఆర్ నారాయణ మూర్తి ఇందుకు కారణమని ఆరోపించింది. సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్న సిక్కాను సంస్థ బోర్డు.. తక్షణమే అమలులోకి వచ్చేలా ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌గా నియమించింది. కొత్త సీఈవో, ఎండీని వెతికేవరకు ఆయన ఈ హోదాలో ఒక డాలర్ వార్షిక వేతనంపై పని చేయనున్నారు. అయితే, వచ్చే ఏడాది మార్చి 31లోగా కొత్త సీఈవో, ఎండీని ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఇక చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీవోవో) యూబీ ప్రవీణ్ రావుకు తాత్కాలిక సీఈవో, ఎండీగా బాధ్యతలు అప్పగించారు. ఆయన సిక్కాకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. యాభై ఏండ్ల సిక్కా ఇన్ఫోసిస్‌కు తొలి వ్యవస్థాపకేతర సీఈవో. అప్పటివరకు సంస్థ వ్యవస్థాపకులే ఈ పదవిలో కొనసాగారు. సంస్థ పనితీరు, వృద్ధిని గాడిలో పెట్టేందుకు మూర్తి.. జర్మనీ ఐటీ దిగ్గజం ఎస్‌ఏపీకి సీఈవోగా పనిచేసిన సిక్కాను తెరపైకి తెచ్చారు. ఆగస్టు 2014లో ఇన్ఫోసిస్ సారథ్య బాధ్యతలు చేపట్టిన సిక్కా.. గడిచిన మూడేండ్లలో కంపెనీ ఆదాయాన్ని 25 శాతంమేర పెంచగలిగారు. అయితే, గడిచిన ఏడాదికాలంలో సంస్థ బోర్డుకు, ప్రమోటర్ ఎన్‌ఆర్ నారాయణమూర్తికి మధ్య అభిప్రాయ బేధాలు తారాస్థాయికి చేరుకున్నాయి. కంపెనీలో పాలన ప్రమాణాలు (కార్పొరేట్ గవర్నెన్స్) పూర్తిగా దిగజారిపోయాయన్నది మూర్తి ప్రధాన ఆరోపణ. అంతేకాదు, మాజీ సీఎఫ్‌వో రాజీవ్ బన్సల్‌కు భారీ పరిహార ప్యాకేజీ చెల్లించేందుకు బోర్డు ఒప్పందం కుదుర్చుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. విశాల్ సిక్కా పారితోషికాన్ని భారీగా పెంచడం, ఆయన ఖర్చులపైనా మూర్తి విమర్శలు గుప్పించారు. పనయా డీల్‌లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై సంస్థ బోర్డు థర్డ్‌పార్టీ ద్వారా అంతర్గత ఆడిటింగ్ జరిపించింది. ఆడిటింగ్ జరిపిన ఏజెన్సీ కంపెనీకి క్లీన్‌చిట్ ఇచ్చిందని బోర్డు ప్రకటించింది. కానీ ఆడిటింగ్ పూర్తి రిపోర్టును బహిర్గతం చేయాలని మూర్తి డిమాండ్ చేశారు. కానీ అందుకు బోర్డు అంగీకరించలేదు. చైర్మన్ బాధ్యతల నుంచి వైదొలిగి ఉండాల్సింది కాదని, అందుకు చింతిస్తున్నానని కూడా ఈమధ్య ఓ ప్రముఖ చానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో మూర్తి పేర్కొన్నారు. మూర్తితోపాటు ఇతర ప్రమోటర్లకు కంపెనీలో ఇప్పటికీ 12.75 శాతం వాటా ఉంది.

మూర్తికి మళ్లీ పదవి లేనట్లే!

సీఈవో పదవికి రాజీనామా చేసిన సిక్కాకు పూర్తి బాసటగా నిలిచిన సంస్థ బోర్డు.. నారాయణమూర్తిపై ఎదురుదాడికి దిగింది. సిక్కా రాజీనామాకు మూర్తి వ్యక్తిగత మాటల దాడే ప్రధాన కారణమని ఆరోపించింది. అంతేకాదు, మూర్తికి మళ్లీ బోర్డులో పదవి ఇచ్చే ఆలోచన లేదని స్పష్టం చేసింది.

చాలా బాధాకరం

విశాల్ సిక్కా వంటి గొప్ప సారథి ఇన్ఫోసిస్‌ను వీడుతుండటం చాలా బాధాకరం. ఒకసారి కంపెనీని వీడాక ప్రమోటర్లకు వ్యవహారాల్లో కలుగజేసుకునే హక్కు లేదు. పాశ్చాత్య దేశాల్లో ఇలా జరిగితే షేర్‌హోల్డర్లు కంపెనీపై దావావేస్తారు. సంస్థలో 12.5 శాతం వాటా ఉన్న వారు ఇబ్బంది పెడుతుంటే మిగతా 87.5 శాతం వాటాదారులు బాధపడాల్సి వస్తున్నది.

- బీవీఆర్ మోహన్ రెడ్డి, నాస్కామ్ మాజీ చైర్మన్

సీఈవో రేసులో లేను

- **ఇన్ఫోసిస్ సహ చైర్మన్ రవి వెంకటేశన్**



సిక్కా వారసుడిని వెతకడమే బోర్డు తక్షణ ప్రాధన్యమని ఇన్ఫోసిస్ సహ చైర్మన్ రవి వెంకటేశన్ అన్నారు. కొత్తగా సీఈవో పదవి చేపట్టబోయే వ్యక్తి సంస్థ లక్ష్యాలు, సంప్రదాయాలు ఆకళింపు చేసుకోగలిగిన వ్యక్తి అయి ఉండాలని అన్నారు. బెంగళూరులోని సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ.. సీఈవో రేసులో తాను లేనని వెంకటేశన్ స్పష్టం చేశారు.

సరైన సమయంలో జవాబిస్తా: మూర్తి



తన వల్లే సిక్కా రాజీనామా చేశాడని బోర్డు ఆరోపించడం బాధాకరమని నారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. 'బోర్డు వ్యాఖ్యల ఆరోపణలు, స్వరం, ధోరణి తీవ్ర మానసిక క్షోభకు గురిచేసింది. తగిన రీతిలో, సరైన వేదికపై, సముచిత సమయంలో బోర్డు ఆరోపణలపై సమాధానమిస్తా' అని ఈ-మెయిల్ స్టేట్‌మెంట్ ద్వారా స్పందించారు. అంతేకాదు, 2014లో తానే స్వచ్ఛందంగా చైర్మన్ పదవి నుంచి వైదొలిగానని, తాను డబ్బులు కావాలని లేదా తన వారసులకు సంస్థలో పదవి లేదా అధికారం కావాలని కోరుకోవట్లేదన్నారు. సంస్థలో దిగజారుతున్న కార్పొరేట్ గవర్నెన్స్ ప్రమాణాలు తనను ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. పనయా డీల్‌కు సంబంధించి విజిల్ బ్లోయర్ ఆరోపణలపై జరిపించిన థర్డ్‌పార్టీ దర్యాప్తు నివేదికను చదివిన చాలామంది షేర్‌హోల్డర్లు అసంతృప్తి వ్యక్తం చేశారని, ఇన్ఫోసిస్‌లో జరిగే రీతిలో 'నిష్పక్షపాతంగా, లక్ష్యంతో కూడిన విచారణ' చేపట్టలేదని అభిప్రాయపడినట్లు మూర్తి మెయిల్‌లో పేర్కొన్నారు.

బోర్డు సంస్థను, దాని ప్రయోజనాలను పరిరక్షించాలే తప్ప, ఇప్పుడు చేస్తున్నట్లుగా కొద్ది వ్యక్తులను కాదని మంగళవారం అడ్వైజర్లకు రాసిన మెయిల్‌ను సైతం మూర్తి విడుదలచేశారు. సిక్కా పనితీరుపై నేనెప్పుడూ వ్యాఖ్యానించలేదని, సంస్థలో కార్పొరేట్ గవర్నెన్స్ ప్రమాణాలు పడిపోవడంపై అభ్యంతరాలు వ్యక్తం చేశానన్నారు. బోర్డులోనే లోపం ఉందని మూర్తి వారితో అభిప్రాయపడ్డారు. బోర్డు లోపభూయిష్టమైన పాలన ప్రమాణాలతో కంపెనీని నాశనం కానివ్వదలుచుకోలేదన్నారు.

మూర్తిపై బోర్డు ఎదురుదాడి

పనయా డీల్‌కు సంబంధించి మూర్తి చేసిన తాజా ఆరోపణలను బోర్డు తిప్పికొట్టే ప్రయత్నం చేసింది. ఈ విషయంలో సీఈవోపై వచ్చిన ఆరోపణలను ఉపేక్షించేందుకు దర్యాప్తు చేపట్టిన ప్రపంచ ప్రఖ్యాత న్యాయ సేవల కన్సల్టింగ్ సంస్థ బోర్డుతో రెండుసార్లు కుమ్మక్కై క్లీన్‌చిట్ ఇచ్చి ఉంటుందని అర్థం వచ్చేలా మూర్తి అభిప్రాయం వ్యక్తం చేయడం ఏమాత్రం అంగీకార యోగ్యం కాదు అని బోర్డు స్పందించింది. పనయా డీల్‌తోపాటు కంపెనీలో కార్పొరేట్ ప్రమాణాలపై విజిల్ బ్లోయర్ చేసిన ఆరోపణలకు సంబంధించి బోర్డు చేయాల్సిందంతా చేసిందని ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శేషసాయి అన్నారు. మూర్తి ఈమధ్య అడ్వైజర్లకు పంపిన లేఖలో చేసిన వ్యాఖ్యల్లో ఏమాత్రం వాస్తవం లేదని, ఇది బోర్డుపై దురుద్దేశ ప్రచారమేనని ఆయన పేర్కొన్నారు. మూర్తి ఆరోపణలు కంపెనీకి తీవ్ర నష్టం చేకూరుస్తున్నాయన్నారు.

బైబ్యాక్ ప్రణాళికలో మార్పులేదు: శేషసాయి



సిక్కా రాజీనామా నేపథ్యంలో సంస్థ బైబ్యాక్ ప్రణాళికలో ఎలాంటి మార్పులేదని ఇన్ఫోసిస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఆర్ శేషసాయి స్పష్టం చేశారు. 'సంస్థ వద్దనున్న నగదు నిల్వలను షేర్‌హోల్డర్లకు ఎంత, ఎప్పుడు కేటాయించాలనే విషయంలో ఇప్పటికే హామీ ఇచ్చాం. ఆ ప్రణాళికలో మార్పు ఉండదు' అని ఆయన పేర్కొన్నారు. కంపెనీ ప్రకటించిన రూ.13 వేల కోట్ల షేర్ల బైబ్యాక్ (తిరిగి కొనుగోలు) ప్రతిపాదనపై శనివారం బోర్డు సమావేశమై తుది నిర్ణయం తీసుకోనుంది. ఇన్ఫోసిస్ 36 ఏండ్ల చరిత్రలో ఇదే తొలి బైబ్యాక్. సంస్థ వద్దనున్న అదనపు నిల్వలను వాటాదారులకు పంచాలని మూర్తితోపాటు ఇతర ప్రమోటర్లు, మాజీ సీఎఫ్‌వోలైన మోహన్‌దాస్ పాయ్, బాల ఇంకా ఇతర మాజీ ఎగ్జిక్యూటివ్‌లు చాలాకాలంగా బోర్డుపై ఒత్తిడి చేస్తున్నారు. దాంతోపాటు ఇతర ఐటీ కంపెనీలైన టీసీఎస్, విప్రో, కాగ్నిజెంట్, హెచ్‌సీఎల్, మైండ్‌ట్రీ ఇప్పటికే భారీ షేర్ల బైబ్యాక్ ప్రణాళికలను ప్రకటించడం ఇన్ఫోసిస్ బోర్డుపై ఒత్తిడిని మరింత పెంచింది. ఈ ఏడాది జూన్ 30నాటికి ఇన్ఫోసిస్ వద్ద 350 కోట్ల డాలర్ల విలువైన నగదు, నగదుతో సమానమైన నిల్వలున్నాయి.

ప్రమోటర్ వర్సెస్ ఔట్‌సైడర్

మూర్తి వర్సెస్ సిక్కా వార్‌తో దేశీయ కార్పొరేట్ రంగంలో ప్రమోటర్లు, ఔట్‌సైడర్‌కు (బయటివ్యక్తి) మధ్య వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఈమధ్య టాటా గ్రూపులోనూ ఇదే పోరు కొనసాగింది. చివరికి ఇరు వర్గాల మధ్య వ్యాపార సంబంధాలు పూర్తిగా తెగదెంపులయ్యే వరకు వచ్చింది. 10 వేల కోట్ల డాలర్ల విలువ చేసే టాటా గ్రూపు వ్యాపారాల హోల్డింగ్ కంపెనీ అయిన టాటాసన్స్.. సైరస్ మిస్త్రీని చైర్మన్ పదవి నుంచి తొలిగించిన విషయం తెలిసిందే. రతన్ టాటాతో ఆయనకు విభేదాలు తలెత్తడమే అందుకు ప్రధాన కారణం. మిస్త్రీ స్థానంలో ఎన్ చంద్రశేఖరన్‌ను టాటా సన్స్ చైర్మన్‌గా నియమితులయ్యారు. బజాజ్, హీరో గ్రూపు, భారతీ, మహీంద్రా, డాక్టర్ రెడ్డీస్, లుపిన్, సన్‌ఫార్మా వంటి వ్యాపారాలు ఇంకా ప్రమోటర్ల ఆధీనంలో నడుస్తున్నాయి. ఇందులో కొన్నింటిలో సీఈవోతోపాటు పలు కీలక బాధ్యతలను బయటి వ్యక్తులే నిర్వహిస్తున్నారు. ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐటీసీ, ఎల్ అండ్ టీ, యాక్సిస్ బ్యాంక్ మాత్రం చాలాకాలంగా బయటి వ్యక్తుల సారథ్యంలోనే నడుస్తున్నాయి. రిలయన్స్, విప్రో, గోద్రేజ్, అదానీ గ్రూపులు మాత్రం వారసుల చేతుల్లోకి వెళ్లాయి.

నీలేకనికి చాన్స్ ఇవ్వాలి: విశ్లేషకులు

ఇన్ఫీ వ్యవస్థాపకేతర సీఈవో విశాల్ సిక్కా రాజీనామాతో నూతన సీఈవోపై అందరి దృష్టి పడింది. కొందరైతే ఏకంగా కంపెనీ వ్యవస్థాపకుల్లో ఒకరైన నందన్ నీలేకనిని మళ్లీ సీఈవోగా నియమించాలని బోర్డుకు సూచిస్తున్నారు. ఐటీ రంగంలో విశేష అనుభవం ఉన్న నీలేకనికి ఇన్ఫోసిస్‌ను మళ్లీ గాడిలో పెట్టే సత్తా ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ది ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్ అడ్వయిజరీ సర్వీసెస్(ఐఐఏఎస్)..ఇన్ఫీ బోర్డు సీఈవోకు రక్షణగా ఉండలేకపోయిందని, సిక్కా స్థానంలో నూతన వ్యక్తి ఎంపికలో తప్పులు దొర్లకుండా వ్యవహరించాలని సూచించింది. మరోదఫా నందన్ నీలేకని కంపెనీ బోర్డులోకి తీసుకోవాలని, నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నియమించుకోవాలని నివేదిక అభిప్రాయపడింది. దేశీయ ఐటీ ఇండస్ట్రీస్‌కు గుండెకాయ లాంటి ఇన్ఫోసిస్‌పై నీలేకని పెద్దగా ఆసక్తి చూపకపోవచ్చని తెలిపింది. కంపెనీ ఏడుగురు వ్యవస్థాపకుల్లో ఒకరైన నీలేకని..30 ఏండ్లుగా వివిధ హోదాల్లో పనిచేశారు. మార్చి 2002 నుంచి ఏప్రిల్ 2007 మధ్యకాలంలో సీఈవోగా కూడా విధులు నిర్వహించారు. అంతర్జాతీయ మార్కెట్లో ఇన్ఫీకి మరింత గుర్తింపు రావాలంటే నందన్ నీలేకని సరైన వ్యక్తని ఐఐఏఎస్ అభిప్రాయపడింది. సిక్కా రాజీనామా ఇన్ఫీకి అంత మంచిది కాదని, 2020 నాటికి 2000 కోట్ల డాలర్ల ఆదాయం చేరుకునే అవకాశాలు సన్నగిల్లాయని పీసీజీ, హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ హెడ్ వీకే శర్మ తెలిపారు. ఈ ప్రభావం కంపెనీ షేర్లపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నదని, ఇప్పట్లో కోలుకునే అవకాశాలు లేవని మార్కెట్ పండితులు అంచనావేస్తున్నారు.

విశాల్ సిక్కా రాజీనామా నేపథ్యంలో ఇన్ఫోసిస్ షేర్లు భారీగా క్షీణించాయి. ఒక్క రోజులో సంస్థ మార్కెట్ విలువ రూ.22,519 కోట్లు తగ్గింది.

ఇన్ఫోసిస్ లిమిటెడ్




ఇన్ఫీ షేర్లు ఢమాల్

10 శాతం మేర క్షీణించిన విలువ.. కుదేలైన స్టాక్ మార్కెట్లు

ముంబై, ఆగస్టు 18: అనూహ్య పరిణామాల మధ్య ఇన్ఫోసిస్‌కు విశాల్ సిక్కా రాజీనామా స్టాక్ మార్కెట్లలో తీవ్ర అలజడి సృష్టించింది. ఇంట్రాడేలో కంపెనీ షేరు ధరైతే ఏకంగా 52 వారాల కనిష్ఠ స్థాయికి జారుకుంది. ఒక దశలో 13 శాతానికి పైగా పతనమైన షేరు ధర చివరకు 10 శాతం నష్టపోయింది. బీఎస్‌ఈలో షేరు ధర 9.60 శాతం తగ్గి రూ.923.10 వద్ద జారుకోగా, అదే ఎన్‌ఎస్‌ఈలో 9.56 శాతం పతనం చెంది రూ.923.25 వద్ద ముగిసింది. మే 2 తర్వాత కంపెనీకి ఇదే కనిష్ఠ స్థాయి ముగింపు. దీంతో కంపెనీ సంపద రూ.22,519 కోట్లు ఆవిరై రూ.2,12,033 కోట్లకు చేరుకుంది. ఇన్ఫీ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఎన్‌ఆర్ నారాయణ మూర్తి కూడా భారీగా నష్టపోయారు. 3.44 శాతం వాటా కలిగిన మూర్తి కుటుంబ సభ్యుల సంపద రూ.1,010 కోట్ల మేర పడిపోయింది. ఆయనకు 0.38 శాతం వాటా ఉండగా, మూర్తి భార్యకు 0.79 శాతం, కుమార్తెకు 0.89 శాతం, కుమారుడు రోహన్ మూర్తికి 1.38 శాతం వాటా ఉంది. గడిచిన కొన్ని నెలలుగా కంపెనీ బోర్డు సభ్యులు, వ్యవస్థాపకుల మధ్య కొనసాగుతున్న మాటలవల్లనే సిక్కా రాజీనామా చేశారని మార్కెట్ పండితులు పేర్కొన్నారు. సిక్కా రాజీనామాతో బీఎస్‌ఈలో లిస్టైన సంస్థలు ఇంచుమించు రూ.30 వేల కోట్లు నష్టపోయాయి. ఇన్ఫోసిస్‌లో జరుగుతున్న పరిణామాలకు తోడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు, స్పెయిన్‌లో ఉగ్రదాడి అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపాయి. వరుసగా మూడు రోజులుగా లాభాల బాట పట్టిన బీఎస్‌ఈ సెన్సెక్స్ వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి 270.78 పాయింట్లు(0.85 శాతం) పతనం చెంది 31,524.68 వద్ద స్థిరపడింది. గడిచిన మూడు సెషన్లలో సూచీ 581.87 పాయింట్లు లాభపడింది. ఐటీ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో నిఫ్టీ 66.75 పాయింట్లు కోల్పోయి 9,837.40 వద్ద ముగిసింది. మొత్తంమీద ఈవారంలో సెన్సెక్స్ 311.08 పాయింట్లు లాభపడగా, నిఫ్టీ 126.60 పాయింట్లు పెరిగింది. సిక్కా రాజీనామాతో పెట్టుబడిదారులు, మదుపర్లలో ఆందోళన తీవ్రస్థాయికి చేరుకుందని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. యూరప్‌లో ఉగ్రవాదుల దాడులు మార్కెట్లు పతనమవడానికి తమవంతు పాత్రను పోషించాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను కార్పొరేట్ల ఆర్థిక ఫలితాలు నిరుత్సాహకరంగా ఉండటంతో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను వెనక్కితీసుకుంటున్నారు. బీఎస్‌ఈ స్మాల్, మిడ్-క్యాప్ ఇండెక్స్‌లు నష్టాల్లో ముగిశాయి. సన్‌ఫార్మా 3.81 శాతం, ఎన్‌టీపీసీ 2.01 శాతం, కోల్ ఇండియా 1.52 శాతం, లుపిన్ 1.40 శాతం, డాక్టర్ రెడ్డీస్ 1.35 శాతం, సిప్లా 1.33 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 1.31 శాతం, యాక్సిస్ బ్యాంక్ 1.23 శాతం, టాటా మోటార్స్‌లు 1.13 శాతం వరకు మార్కెట్ వాటాను కోల్పోయాయి. అదానీ పోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ, కొటక్ బ్యాంక్, హీరో మోటోకార్ప్, ఐసీఐసీఐ బ్యాంక్, విప్రో, బజాజ్ ఆటో, ఎల్ అండ్ టీ, టాటా స్టీల్‌లు నష్టాల్లో ముగిశాయి. హెచ్‌యూఎల్ 2.13 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. పవర్‌గ్రిడ్ 1.55 శాతం, టీసీఎస్ 1.32 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 1.21 శాతం లాభపడ్డాయి. ఐటీసీ, రిలయన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతి, ఓఎన్‌జీసీలు తమ మార్కెట్ వాటాను పెంచుకున్నాయి. రంగాల వారీగా చూస్తే ఐటీ ఇండెక్స్ 3.53 శాతం పతనం చెందింది. టెక్నాలజీ, హెల్త్‌కేర్, రియల్టీ రంగాలకు చెందిన షేర్లు కూడా నిరాశాజనక పనితీరు కనబరిచాయి.

గ్యాస్‌పై వ్యాట్ తగ్గించండి

రాష్ట్ర ప్రభుత్వాలను కోరిన జైట్లీ



న్యూఢిల్లీ, ఆగస్టు 18: సహజ వాయువు, ఇతర ఇంధనాలపై సేవా పన్ను లేదా విలువ ఆధారిత పన్ను(వ్యాట్)ను తగ్గించాలని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు రాసిన లేఖలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కోరారు. జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన జీఎస్టీ పరిధిలోకి క్రూడాయిల్, పెట్రోల్, డీజిల్, సహజ వాయువు, విమాన ఇంధనాలు లేవు. తయారీ రంగంపై పెట్టే ఖర్చు అధికంగా ఉండటంపై జైట్లీ ఆందోళన వ్యక్తంచేశారు. సహజ వాయువును విద్యుత్‌ను, ఎరువులు, పెట్రో కెమికల్స్, గ్లాస్‌లను ఉత్పత్తి చేయడానికి వినియోగిస్తుండగా, క్రూడాయిల్‌ను పెట్రోల్, డీజిల్, కిరోసిన్, ఎల్పీజీ, పారిశ్రామికానికి సంబంధించి నాఫ్థా, ఫ్యూయల్ ఆయిల్, బిట్‌మెన్‌లను తయారు చేయడానికి వినియోగిస్తున్నారు. జీఎస్టీ అమలు కంటే ముందు పెట్రోలియం ఉత్పత్తులు, తుది వస్తువులపై వ్యాట్, ఇన్‌పుట్ ట్యాక్స్‌ను విధిస్తున్నారు. డీజిల్‌పై వ్యాట్‌ను 17.4 శాతం నుంచి 31.06 శాతం మధ్యలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్నాయి. సహజ వాయువుపై సున్న శాతం నుంచి 15 శాతం వరకు విధిస్తున్నాయి.

ఐసీఐసీఐ బ్యాంక్ సేవింగ్ డిపాజిట్లపైనా వడ్డీ కోత



ముంబై, ఆగస్టు 18: దేశంలో అతిపెద్ద ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్..రూ.50 లక్షల లోపు డిపాజిట్లపై చెల్లించే వడ్డీరేటును అరశాతం కోత విధించింది. దీంతో వడ్డీరేటు 4 శాతం నుంచి 3.5 శాతానికి తగ్గనున్నది. రూ.50 లక్షల అపై డిపాజిట్లపై వడ్డీరేటును యథాతథం నాలుగు శాతంగా కొనసాగించనున్నట్లు ప్రకటించింది. తగ్గించిన వడ్డీరేట్లు శనివారం నుంచి అమలులోకి రానున్నాయి. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) పొదుపు ఖాతాలపై వడ్డీరేట్లను అరశాతం తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. రూ.25 లక్షల లోపు డిపాజిట్లపై చెల్లించే వడ్డీరేటు 4 శాతం నుంచి 3.5 శాతానికి తగ్గనున్నది.

22న ఐపీవోకి అపెక్స్ ఫ్రోజెన్

హైదరాబాద్, ఆగస్టు 18: రాష్ట్రానికి చెందిన రొయ్యల ఎగుమతి సంస్థ అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ లిమిటెడ్ స్టాక్ మార్కెట్లో లిస్ట్ అవడానికి సిద్ధమైంది. ఈ నెల 22 నుంచి 24 మధ్యకాలంలో ఐపీవోకి రానున్నట్లు సంస్థ ప్రకటించింది. షేరు ధరను రూ.171-175 మధ్యలో నిర్ణయించింది. ఐపీవో ద్వారా రూ.148.77 కోట్ల నుంచి రూ.152.55 కోట్ల స్థాయిలో నిధులు లభించే అవకాశం ఉంది. ఆ నిధుల్లో రూ.90 కోట్లను నూతన రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ఖర్చు పెట్టనున్నట్లు సంస్థ ప్రకటించింది.

కాల్‌డ్రాప్స్‌పై ట్రాయ్ ఉక్కుపాదం

రూ.10 లక్షల వరకు జరిమానా



న్యూఢిల్లీ, ఆగస్టు 18: దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న కాల్‌డ్రాప్స్‌కు చెక్ పెట్టడానికి టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ రంగంలోకి దిగింది. ఇందుకు సంబంధించిన నూతన మార్గదర్శకాలను శుక్రవారం విడుదల చేసింది. నూతన మార్గదర్శకాలకు లోబడి మూడు త్రైమాసికాల వరకు కాల్‌డ్రాప్స్‌పై ఎలాంటి చర్యలు తీసుకొని సర్వీసు ప్రొవైడర్లపై రూ.10 లక్షల వరకు జరిమానా విధించనున్నట్లు ప్రకటించింది. రూ.1-5 లక్షల వరకు జరిమానా విధించనున్నాం..నెట్‌వర్క్ పనితీరు మరి అధ్వన్నంగా ఉంటే ఈ జరిమానాను మరింత పెంచనున్నట్లు ట్రాయ్ చైర్మన్ ఆర్ ఎస్ శర్మ వెల్లడించారు. కాల్ డ్రాప్ విషయంలో మార్గదర్శకాలకు అందుకోని సంస్థలపై తొలి త్రైమాసికంలో ఒక జరిమానా, ఆ తర్వాతి ఒకటిన్నర రెట్లు అధికంగా, మూడో త్రైమాసికంలో రెండింతలు పెరుగనున్నట్లు ట్రాయ్ కార్యదర్శి ఎస్కే గుప్తా తెలిపారు. మొత్తంమీద ఒక కంపెనీపై మూడో త్రైమాసికం నాటికి రూ.10 లక్షల వరకు జరిమానా విధించనున్నట్లు విలేకరుల సమావేశంలో ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కాల్‌డ్రాప్స్‌పై రూ.50 వేల వరకు జరిమానా విధిస్తున్నారు. కాల్‌డ్రాప్స్‌ను తగ్గించడానికి ట్రాయ్ ఇప్పటికే చర్యలు చేపట్టిందని, కానీ కొన్ని టెలికం సంస్థలు నెట్‌వర్క్‌ను పెంచుకోవడంలో భాగంగా మార్గదర్శకాలను పట్టించుకోవడం లేదని శర్మ విమర్శించారు. ఈ నూతన మార్గదర్శకాల ప్రకారం ఏదైన టెలికం సర్కిల్‌లో ట్రాన్సీవర్ స్టేషన్ లేదా మొబైల్ సైట్‌లో కాల్‌డ్రాప్స్ రెండు శాతం మించవద్దని, బిజీ సమయంలో మూడు శాతం పరిమితి విధించినట్లు చెప్పారు.



హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కుమ్మరి శాలివాహన సంఘం సభలో ప్రసంగిస్తున్న మంత్రి జోగు రామన్న. చిత్రంలో వనజీవి రామయ్య తదితరులు ఉన్నారు.

బీసీలకు మెరుగైన జీవనమే లక్ష్యం

- కులవృత్తుల పునర్వైభవానికి చేయూత: మంత్రి జోగు రామన్న

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కులవృత్తులకు పూర్వవైభవం తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న అన్నారు. బీసీలు ఆత్మగౌరవంతో మెరుగైన జీవనం గడుపాలన్నదే సీఎం కేసీఆర్ ఆశయమని, అందుకు వారి సంక్షేమం కోసం పలు కార్యక్రమాలను ప్రకటించారని పేర్కొన్నారు. ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లతో ఎంబీసీ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసినందుకు కృతజ్ఞతలు తెలుపడానికి కుమ్మరి శాలివాహన సంఘం శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సభ నిర్వహించింది. సభలో మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకటించిన వివిధ పథకాలు, సౌకర్యాలను అందిపుచ్చుకొని బీసీలు సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. కులవృత్తుల్లో ఆధునిక విధానాలు, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించేందుకు త్వరలో రాజస్థాన్, గుజరాత్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలకు ప్రత్యేక బృందాలను పంపుతామని తెలిపారు. బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు మాట్లాడుతూ, వివిధ వృత్తుల్లోని బీసీ కుటుంబాల జీవన స్థితిగతులను పరిశీలించి ప్రభుత్వానికి సమగ్ర నివేదికను అందిస్తామన్నారు. ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, కుమ్మరులకు మూడెకరాల భూమి, అడవుల్లో మట్టిని తవ్వుకునేందుకు అనుమతి కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి అశోక్‌కుమార్, బీసీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్యభట్టు, ఎంబీసీ కార్పొరేషన్ సీఈవో అలోక్‌కుమార్, కుమ్మరి శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయంత్‌రావు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్యను సన్మానించారు.

ఉత్తర భారతీయులను బీసీలుగా గుర్తించాలి

- బీసీ కమిషన్‌కు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విజ్ఞప్తి



బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములుకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర రాజధానిలో దశాబ్దాలుగా స్థిరనివాసం ఏర్పరచుకొని ఉంటున్న ఉత్తర భారతీయులను బీసీలుగా గుర్తించాలని ఏఐఎంఐఎం పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయా వర్గాల ప్రతినిధులతో కలిసి ఆయన బీసీ కమిషన్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. అనంతరం బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహనరావు, జూలూరు గౌరీశంకర్‌తో ఒవైసీ సమావేశమయ్యారు. రెండు శతాబ్దాల నుంచి నగరంలో ఉంటున్న అహిర్ యాదవ్, గవిలి, సారోల్లు తదితర కులాలను బీసీల జాబితాలో చేర్చాలని చాలా ఏండ్లుగా కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. హిందీ మాట్లాడే ఉత్తరాదికి చెందిన యాదవ్‌లు ఏళ్లుగా హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు.. వారిని బీసీ-డీలో చేర్చుతూ 1970 సెప్టెంబర్ 25 ప్రభుత్వం జీవో నంబర్ 1793 జారీచేసిందని, దాని ఆధారంగా రెవెన్యూ అధికారులు కుల ధ్రువీకరణ పత్రాలను అందజేసేవారని ఒవైసీ కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. 2009 నుంచి వారికి కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడాన్ని ప్రభుత్వం నిలిపివేసిందన్నారు.

సంచార కులాలను డీఎన్టీలుగా గుర్తించండి

సంచార కులాలను డీ నోటిఫైడ్ ట్రైబ్స్ (డీఎన్టీలు)గా గుర్తించాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్, జూలూరు గౌరీశంకర్‌కు సంచార కులాల ప్రతినిధులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం కొన్ని సంచార కులాలను ఇప్పటికే డీఎన్టీలుగా గుర్తించిందని వారు తెలిపారు. కమిషన్‌ను కలిసిన వారిలో రాష్ట్ర సంచార కులాల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నరేందర్ వంశరాజ్, ప్రతినిధులు పై వెంకటనారాయణ, కర్ర ఉపేందర్, మందుల గోపాల్ తదితరులు ఉన్నారు.



శుక్రవారం హైదరాబాద్‌లో ప్రాంతీయ సీఏల సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కే శ్రీనివాస్

ఆర్థికవ్యవస్థ పటిష్ఠతలో సీఏల పాత్ర కీలకం

వచ్చే జూలై 1 నుంచి చార్టర్డ్ అకౌంటెన్సీ కోర్సులో కొత్త సిలబస్

ప్రాంతీయ సీఏల సదస్సులో సౌత్ ఇండియా రీజినల్ కౌన్సిల్ చైర్మన్ కే శ్రీనివాస్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భారత ఆర్థిక వ్యవస్థను పటిష్ఠపరుచటంలో చార్టర్డ్ అకౌంటెంట్ల పాత్ర కీలకమని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ సౌత్ ఇండియా రీజినల్ కౌన్సిల్ (ఎస్ఐఆర్సీ) చైర్మన్ కే శ్రీనివాస్ పేర్కొన్నారు. సీఏలకు నిరంతర విద్యా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సోమాజిగూడలోని ది పార్క్ హోటల్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జీఎస్టీ రాకతో సీఏలకు ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లు, అధిగమించాల్సిన తీరు గురించి శ్రీనివాస్ వివరించారు. జీఎస్టీపై అవగాహన కల్పించేందుకు దేశంలో 140 చోట్ల ఉచిత సహాయ కేంద్రాలు ఏర్పాటుచేశామని, హైదరాబాద్‌లోని కార్యాలయానికి అన్ని వర్గాలవారు వచ్చి సందేహాలు నివృత్తి చేసుకుంటున్నారని, సెప్టెంబర్ 30 వరకు ఈ కేంద్రాలు సేవలందిస్తాయని తెలిపారు. వచ్చే జూలై1 నుంచి చార్టర్డ్ అకౌంటెంట్స్ కోర్సులో కొత్త సిలబస్ అమలులోకి రానుందన్నారు. గతంలో సీపీటీ, ఐపీసీసీ అండ్ ఫైనల్ ఉండగా ప్రస్తుతం.. ఫౌండేషన్, ఇంటర్మీడియట్ అండ్ ఫైనల్‌గా మారినట్టు పేర్కొన్నారు. సీపీటీలో 400 మార్కులకు నిర్వహించే పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో ఉండేదని, ఇక నుంచి 200 మార్కులు ఆబ్జెక్టివ్, మరో 200 మార్కులు డిస్క్రిప్టివ్ తరహాలో పరీక్ష ఉంటుందని చెప్పారు. ఫైనల్‌లో ఫైనాన్స్ ఫర్ ఎకనామిక్స్ పేరుతో కొత్త సబ్జెక్టు చేర్చడంతోపాటు ఓపెన్ బుక్ పరీక్ష విధానం తీసుకొచ్చినట్టు వెల్లడించారు. ఎస్ఐఆర్సీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర రావు, సెక్రటరీ జేసీ జెయిన్, కరీంనగర్, వరంగల్ బ్రాంచ్ చైర్మన్లు రామ్మోహన్, రాజు కోయల, పలు జిల్లాల సీఏలు పాల్గొన్నారు.

రెడ్ల కోసం చారిత్రాత్మక నిర్ణయాలు

- 22న బుద్వేల్ సభను విజయవంతం చేయండి
- మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెడ్డి కులస్తుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీసుకుంటున్న నిర్ణయాలు చారిత్రాత్మకమని శాసనమండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తరహాలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంలు రెడ్ల బాగోగులను పట్టించుకోలేదని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న బుద్వేల్‌లో రెడ్డి హాస్టల్ భవన సముదాయ శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా ఏర్పాటుచేసే అభినందనసభ విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రెడ్డి సంక్షేమం కోసం బుద్వేల్‌లో రూ.10 కోట్ల విలువచేసే భూమి, భవన నిర్మాణానికి రూ.10 కోట్లను సీఎం కేటాయించారని పేర్కొన్నారు. కొందరు కులం పేరిట కుళ్లురాజకీయాలు చేస్తుంటే సీఎం కేసీఆర్ అన్ని కులాల మధ్య సామరస్యాన్ని పెంపొందించేందుకు కృషిచేస్తున్నారని తెలిపారు.

వచ్చే ఏడాది నుంచి నర్సరీల్లోనే హరిత మొక్కలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హరితహారం కోసం వచ్చే ఏడాది నుంచి నర్సరీలలోనే మొక్కలు సిద్ధం చేయాలని జిల్లా అధికారులను అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్ ఝా ఆదేశించారు. డివిజన్‌కు లక్షకు తగ్గకుండా పెద్ద మొక్కలను పెంచాలని స్పష్టంచేశారు. 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమం అమలు తీరుపై అన్ని జిల్లాల అధికారులతో శుక్రవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం కేసీఆర్ అర్బన్ పార్కుల ఏర్పాటుపై ఆసక్తిగా ఉన్నందున ఆ దిశగా చర్యలను వేగవంతం చేయాలన్నారు.

● యాదాద్రిలో వరలక్ష్మీ వ్రతాలు



యాదాద్రి క్షేత్రంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన సుహాసినులు ఈ పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త బీ నర్సింహమూర్తి, ఆలయ ఈఓ గీత, ఏఈఓ దోర్బల భాస్కరశర్మ పాల్గొన్నారు.
-యాదాద్రి భువనగిరి ప్రతినిధి, నమస్తేతెలంగాణ

● కిక్కిరిసిన ఎములాడ



శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచే భక్తులు స్వామివారికి కోడెమొక్కు చెల్లించుకున్నారు. గంటల పాటు క్యూలైన్లలో నిరీక్షించి స్వామివారిని దర్శించుకున్నారు. 30 వేల మందికి పైగా భక్తులు రాగా, రూ.14 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.
-వేములవాడ కల్చరల్

ఉద్యానవర్సిటీ పనులపై మంత్రి సమీక్ష

ములుగు: కొండా లక్ష్మణ్‌బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం పనులపై వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి ఆరా తీశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా ములుగులో సమీక్ష నిర్వహించారు. పనులను తొందరగా పూర్తి చేయాలని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరానికి తరగతులు ఇక్కడే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ పార్థసారథి, ఆర్డీవో విజయేందర్‌రెడ్డి, ఉద్యానశాఖ విస్తరణాధికారి నర్సింహారావు, రిజిస్ట్రార్ రాజగోపాల్‌రెడ్డి ఉన్నారు.



ములుగులో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పోచారం



జమ్మికుంట సభలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్

పోలీసుల్లో ఆత్మగౌరవం పెరిగింది

ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్

జమ్మికుంట: రాష్ట్రంలోని పోలీసుల్లో ఆత్మగౌరవం పెరిగిందని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణ పోలీసుస్టేషన్ ఆధునీకరణ,ఆ తర్వాత రూ.50 లక్షలతో రూరల్ ఠాణా, రూ.40 లక్షలతో రూరల్ సర్కిల్ కార్యాలయాల భవనాలను ప్రారంభించారు. పట్టణంలో 61 సీసీ కెమెరాలను మంత్రి శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ కొనసాగుతున్నదన్నారు. తప్పు చేస్తే ఎంతటి వారికైనా శిక్షలు తప్పవని హెచ్చరించారు. అందుకు వీణవంక ఘటనను ఉదహరించారు. లైంగికదాడి కేసులో నిందితులకు కొద్ది నెలల్లోనే జైలు శిక్ష పడిందన్నారు. జిల్లాలో 66 వేల మొక్కలు నాటి, వాటిని కాపాడుతున్న పోలీసులను మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా జమ్మికుంట సీఐ ప్రశాంత్‌రెడ్డి పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, సీపీ కమలాసన్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్‌హుస్సేన్, కరీంనగర్ మేయర్ రవీందర్‌సింగ్, ఏసీపీ రవీందర్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ రామస్వామి, ఎంపీపీ లత, సీఐలు ప్రశాంత్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.



ఆదిలాబాద్ జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలి

జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ ప్రధాన ప్రతినిధి, ఆదిలాబాద్ ప్రతినిధి / నమస్తే తెలంగాణ: ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు చేరే విధంగా అధికారులు కీలకపాత్ర వహించాలని రాష్ట్ర దేవాదాయ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు. ఆదిలాబాద్ జెడ్పీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ పనులు జిల్లాలో వేగంగా సాగుతున్నాయని, ఇందుకు అవసరమైన ఇసుక కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సారెస్పీ పునర్జీవంతో జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. మేడిగడ్డ నుంచి ఎస్సారెస్పీకి నీళ్లు తరలించడానికి శ్రీకారం చుట్టారన్నారు. 11 నెలలు రూ.1100కోట్లతో రెండు నెలల్లో 60టీఎంసీల నీటిని నింపుతామని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలోని సర్కారు దవాఖానల్లో ప్రసవాలు ఎక్కువగా జరుగుతుండడం అభినందనీయమన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ వల్లకొండ శోభారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముథోల్, బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రాథోడ్ బాపురావు, రేఖానాయక్ పాల్గొన్నారు.



ఖమ్మం జిల్లా వైరాలో విలేకరులతో మాట్లాడుతున్న బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్‌రావు, చిత్రంలో వైరా ఎమ్మెల్యే మదన్‌లాల్

ప్రజాసంక్షేమానికే ఆబ్కారీ ఆదాయం

బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్‌రావు

వైరా, నమస్తేతెలంగాణ: రాష్ట్రంలో మద్యంపై వచ్చే ప్రతి రూపాయినీ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తున్నదని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్‌రావు స్పష్టంచేశారు. రాష్ట్రంలో మరో 5 మద్యం డిపోలను ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని కొత్తగూడెం, సూర్యాపేట, సిద్దిపేట, నాగర్‌కర్నూల్, హైదరాబాద్‌లో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే సిద్దిపేటలో ప్రారంభించామని చెప్పారు. మిగిలిన ప్రాంతాల్లో అతిత్వరలోడిపోలు ఏర్పాటు చేస్తామన్నారు. ఖమ్మం జిల్లా వైరాలోని ఐఎంఎల్ డిపోను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమ సమయంలో పోరాడిన ఉద్యమకారులను రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములను చేసేందుకు అవకాశం కల్పిస్తున్నారని చెప్పారు. బేవరేజెస్ కార్పొరేషన్‌లో 30సంవత్సరాలుగా ఉద్యోగులకు పదోన్నతులు చేపట్టలేదన్నారు. నెలరోజుల్లో సంస్థ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. బేవరేజెస్ కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న 80 ఉద్యోగాలను త్వరలో భర్తీ చేస్తామన్నారు. ఆయనవెంట వైరా ఎమ్మెల్యే బాణోత్ మదన్‌లాల్ తదితరులున్నారు.

నీటి గుంతలో పడి చిన్నారి మృతి



కామారెడ్డి రూరల్ : నీటి గుంతలో పడి చిన్నారి మృతి చెందిన సంఘటన కామారెడ్డి జిల్లా గర్గుల్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, దేవునిపల్లి ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన శివరాత్రి లక్ష్మణ్, సుజాత దంపతుల కూతురు సౌమ్య (20నెలలు). గురువారం ఉదయం సుజాత ఇంటి సమీపంలో రాయి కొట్టే పనికి వెళ్లింది. సౌమ్యను కూడా వెంట తీసుకెళ్లింది. మధ్యాహ్నం సమయంలో చిన్నారికి భోజనం తినిపించేందుకు నాన్నమ్మ నర్సవ్వ ఇంటికి తీసుకెళ్లింది. భోజనం చేసిన సౌమ్య ఆడుకుంటూ బయటకు వచ్చింది. నర్సవ్వ ఇంట్లో నుంచి బయటకు వచ్చి చూడగా చిన్నారి కనిపించకుండా పోయింది. పరిసర ప్రాంతాలను కుటుంబీకులు అర్ధరాత్రి వరకు వెతికారు. శుక్రవారం ఉదయం ఇంటి సమీపంలోని నాచుతో పేరుకుపోయిన గుంతలో మృతదేహం పైకి తేలడంతో గుర్తించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



ఖమ్మంలో జోరుగా పడుతున్న వర్షం



మహబూబాబాద్ కస్తూర్బా పాఠశాల చుట్టూ చేరిన వర్షపు నీరు



సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని ఓ కొండ నుంచి జాలువారుతున్న వర్షపు నీళ్లు

పలు జిల్లాల్లో భారీ వర్షం

పొంగిన వాగులు వంకలు

సాగు పనులకు మరింత ఊతం

నమస్తే తెలంగాణ న్యూస్ నెట్‌వర్క్: నైరుతీ రుతుపవనాల కదలికతో పాటు అల్పపీడన ద్రోణి ప్రభావంతో పలు జిల్లాలో భారీ వర్షాలు కురువగా మరికొన్ని జిల్లాల్లో మోస్తరు వానలు పడ్డాయి. హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. వెంకటాపురం, వాజేడు, ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం, ములుగు, గోవిందరావుపేట, గణపురం, పలిమెల, మహాముత్తారం మండలాల్లో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో వాగులు పొంగిపొర్లుతున్నాయి. కన్నాయిగూడెం మండలంలోని కంతనపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో 15గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలిమెల మండలంలోనూ పెద్దవాగు పొంగిప్రవహిస్తుండటంతో మండలంలోని గ్రామాలకు జిల్లా కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. ఏజెన్సీలోని వాజేడు, ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం మండలాల్లో జనజీవనం స్తంభించింది. నల్లగొండ జిల్లాలో గురు, శుక్రవారాల్లో 17 మండలాల్లో వర్షం కురిసింది. ఆయా మండలాల్లో 24.7 మి.మీ వర్షం కురవగా 0.8 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. ప్రధానంగా ఖమ్మం నగరంలో కురిసిన వర్షంతో రహదారులు తటాకాలను తలపించాయి. కాల్వొడ్డు, పంపింగ్‌వెల్‌రోడ్డు, సుందరయ్యనగర్ ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. జిల్లాలోని 182 చెరువుల్లో 90 శాతం వరకు నీరు చేరి కళకళలాడుతున్నాయి. మహబూబాబాద్ జిల్లాలోని మున్నేరు, ఆకేరు, పాలేరు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. సూర్యాపేట జిల్లావ్యాప్తంగా ముసురు కొనసాగింది. వరంగల్ రూరల్ జిల్లాలో ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షంతో పంట చేళ్లలోకి నీరు భారీగా వచ్చి చేరింది. పాకాల, వట్టె, మున్నేరు వాగులు నీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. మగ్దుంపురం గ్రామంలోని ఊరచెరువు మత్తడి పోస్తున్నది. వరంగల్ అర్బన్ జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపిలేని వర్షం కురిసింది. జిల్లాలో సగటు 3.5 మిమీగా నమోదైనట్టు అధికారులు తెలిపారు. సిద్దిపేట జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా కోహెడ మండలంలో 7.6 మి.మీ నమోదైంది. కరీంనగర్ జిల్లాలో శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం సగటున 3.1 మిల్లీ మీటర్లగా వర్షపాతం నమోదైంది.



వరంగల్ రూరల్ జిల్లా చెన్నారావుపేటలోని జల్లి శివారులో పత్తి చేనులో నిలిచిన నీరు

నేడు,రేపు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు


బంగాళాఖాతంలో అల్పపీడనం: వాతావరణ కేంద్రం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో చాలా ప్రాంతాల్లో శని, ఆదివారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా మారినట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కోస్తా ఆంధ్ర, రాయలసీమ మీదుగా ద్రోణి ఏర్పడినట్టు తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో శనివారం, ఆదివారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఆదివారం నుంచి వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నట్టు వారు వివరించారు. కాగా, గురువారం ఉదయం 8.30 గంటల నుంచి శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా ఖానాపూర్‌లో 4 సెం.మీ.వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. చింతకం, మహబూబాబాద్, నర్సంపేటల్లో 3 సెం.మీ. చొప్పున, దుమ్ముగూడెం, గార్ల, ఎన్కూరు, మధిర, పేరూరు, డోర్నకల్, ములుగు, నల్లబెల్లి, బోనకల్, పాల్వంచ, జగిత్యాలల్లో 2 సెం.మీ.చొప్పున, మరికొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసిట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

జలాశయాలు కళకళ

తాలిపేరు, పెదవాగు ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత

కొత్తగూడెం ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని ప్రాజెక్టుల్లో వరదనీరు భారీగా చేరుతోంది. గడిచిన 24 గంటలతో పాటు శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు కురుస్తున్న వర్షం కారణంగా జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గాల పరిధిలోని 23 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలో గల చెరువులు, కుంటల్లో వర్షపు నీరు చేరింది. భద్రాచలం డివిజన్ చర్ల మండలంలో జిల్లాలోని అతిపెద్ద ప్రాజెక్టు తాలిపేరు ఆరు గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 8,170 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం తాలిపేరు ప్రాజెక్టు నీటి మట్టం 73.30 మీటర్లుగా ఉంది. ఇన్‌ఫ్లో 2600 క్యూసెక్కులు. అశ్వారావుపేట మండలంలోని పెద్దవాగు ప్రాజెక్టు నీటి మట్టం సామర్థ్యాన్ని మించి 21 అడుగులు దాటడంతో ఒక గేటును ఎత్తి 2820 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ములకలపల్లి మండలంలోని మూకమామిడి ప్రాజెక్టులో నీటి మట్టం 18 అడుగులకు చేరింది. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని ప్రాజెక్టు నీటి మట్టం 405.8 అడుగులకు చేరింది. పరిస్థితిని బట్టి శుక్రవారం రాత్రి గేట్లు ఎత్తే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. ఇల్లెందు మండలంలోని మాణిక్యారం వద్ద ఉన్న మసివాగు కట్టు చెరువుకు అలుగు పడింది. సింగరేణి బొగ్గుగనుల ప్రాంతాలైన మణుగూరు, ఇల్లెందు, కొత్తగూడెం, టేకులపల్లి మండలాల్లోని ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనుల్లో వర్షం కారణంగా ఉత్పత్తికి స్వల్పంగా అంతరాయం ఏర్పడుతున్నది.



వరద నీటితో నిండిన కిన్నెరసాని రిజర్వాయర్

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు



(జూన్1 నుంచి ఇప్పటివరకు 385.014 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	3003	3003	1705	1704.72	128.72	128.19
నారాయణపూర్	2055	7850	1615	1607.61	37.646	28.06
జూరాల	2160	2507	1045	1039.01	9.66	6.233
తుంగభద్ర	4988	947	1633	1617.75	100.86	52.35
శ్రీశైలం	0	1995	885	780	215.807	20.37
నాగార్జునసాగర్	850	850	590	500.30	312.045	115.785
పులిచింతల	0	0	175	118.94	45.77	3.55
ప్రకాశం బ్యారేజీ	9001	9001	54.95	55.85	3.070	2.78

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	0	3333	1522	1511.46	102.732	64.48
కడెం	31	641	700	685.18	7.6	4.340
ఎస్సారెస్పీ	0	174	1091	1054.90	90.313	9.214
సింగూరు	0	355	1717.93	1708.63	29.91	17.54
నిజాంసాగర్	60	60	1405	1380.58	17.803	1.410
ఎల్లంపల్లి	1781	418	485	473.06	20.175	11.05
లోయర్‌మానేరు	0	129	920	893.50	24.07	7.333
ధవళేశ్వరం	77759	77527	45	45	2.93	2.93

సర్కారు దవాఖానల్లో మెరుగైన వైద్యం

- సిద్దిపేటలో తొలి ఉచిత డయాలసిస్ సెంటర్ ప్రారంభం
- రాష్ట్రంలో మరో 39 సెంటర్లు ప్రారంభానికి సన్నాహాలు
- వైద్యం కోసం వచ్చే వారికి ఉచిత బస్సుపాసులు
- మంత్రులు హరీశ్‌రావు, డాక్టర్ లక్ష్మారెడ్డి

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ :

'రాష్ట్రంలో నలభై ఉచిత డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేసుకోబోతున్నాం.. మొదటిది సిద్దిపేట జిల్లా కేంద్రంలో ప్రారంభించుకొన్నాం. మిగతా 39 డయాలసిస్ సెంటర్లు నెల రోజుల్లోపల రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ ఏర్పాటు చేసుకోనున్నాం. కిడ్నీ వ్యాధితో బాధపడే వారికి ఇదొక గొప్ప వరం. సర్కారు దవాఖానల్లో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పిస్తూ అత్యాధునిక పరికరాలతో కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నాం' అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి, భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని జిల్లా ప్రభుత్వ దవాఖానలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ సోలిపేట రామలింగారెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్‌లతో కలిసి వారు డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. కిడ్నీ రోగులు డయాలసిస్ కోసం వారానికి రెండు సార్లు హైదరాబాద్ లేదా కరీంనగర్ వెళ్లాల్సి వచ్చేదన్నారు. కిడ్నీ రోగుల బాధలు అర్థం చేసుకున్న సీఎం కేసీఆర్ ఎక్కడికక్కడ డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. జపాన్ నుంచి దిగుమతి చేసుకున్న మెషిన్, జర్మనీ నుంచి తెప్పించిన వాటర్ ఫిల్టర్లతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పలు ప్రైవేట్ దవాఖానల్లో ఒక ఫిల్టర్‌ను రోగికి తెలిసి పదిమార్లు, తెలియకుండా మరో ఐదుమార్లు వాడుతుంటారన్నారు. సిద్దిపేట డయాలసిస్ సెంటర్‌లో ఉచితంగా ఒక ఫిల్టర్‌ను ఒకసారి వాడడం జరుగుతుందన్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా డయాలసిస్ సేవలు పొందవచ్చన్నారు. సిద్దిపేట డయాలసిస్ సెంటర్‌లో ఐదు బెడ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సెంటర్ పనిచేస్తుందని మంత్రులు వివరించారు. ఒక్కో రోగికి 3 నుంచి 4 గంటలు పడుతుందని, ప్రతి రోజు 20 మంది రోగులకు డయాలసిస్ చేసే అవకాశం ఉంటుందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి డయాలసిస్ చేసుకోవడానికి వచ్చే వారి కోసం ఉచితంగా బస్సు పాసు సౌకర్యాలను కల్పించనున్నట్టు తెలిపారు. స్వరాష్ట్రంలో మొదటి మెడికల్ కళాశాలను మహబూబ్‌నగర్‌లో, రెండోది సిద్దిపేటలో ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. సిద్దిపేటలో నిర్మాణమవుతున్న 300 పడకల దవాఖాన భవన నిర్మాణ పనులను మంత్రులు లక్ష్మారెడ్డి, హరీశ్‌రావులు పరిశీలించారు. అనంతరం సిద్దిపేట నుంచి బెంగళూరు బస్సు సర్వీసును మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు.



సిద్దిపేటలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

జగిత్యాల అదనపు జిల్లా జడ్జి సస్పెన్షన్

కరీంనగర్ లీగల్ : జగిత్యాల రెండో అదనపు జిల్లా జడ్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రంజన్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో కరీంనగర్ సబ్ జడ్జిగా బాధ్యతలు నిర్వర్తించిన రంజన్‌కుమార్ అదనపు జిల్లా జడ్జిగా పదోన్నతిపై జగిత్యాలకు బదిలీ అయ్యారు. రంజన్‌కుమార్ అవినీతిపై ప్రస్తుత జిల్లా జడ్జికి ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయన న్యాయవాదులతో పాటు ఇతరుల స్టేట్‌మెంట్ రికార్డు చేసి హైకోర్టుకు పంపించినట్టు తెలిసింది. రంజన్‌కుమార్‌పై ఆరోపణలను సీరియస్‌గా తీసుకున్న హైకోర్టు ఆయనపై సస్పెన్షన్ వేటు విధించింది. ఆయన బాధ్యతలను శనివారం నుంచి కరీంనగర్ మూడో అదనపు జిల్లా జడ్జికి అప్పగించింది. రంజన్‌కుమార్‌ను పిలిపించి అతనికి సస్పెన్షన్ ఉత్తర్వులను జిల్లా జడ్జి అందించినట్టు సమాచారం.

నారాయణఖేడ్ సర్పంచ్‌పై వేటు

పదవిలోనుంచి తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు



నారాయణఖేడ్, నమస్తే తెలంగాణ: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అప్పారావు శెట్కార్‌ను విధుల నుంచి తొలగిస్తూ శుక్రవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధుల వినియోగానికి సంబంధించి ఆడిట్ నిర్వహించకపోవడంతో పాటు రూ.1.38 కోట్ల నిధులకు సంబంధించి సరైన లెక్కలు లేవనే ఆరోపణలపై గత మే నెలలో జిల్లా పంచాయతీ అధికారి విచారణ నిర్వహించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. ఈమేరకు కలెక్టర్ సర్పంచ్ అప్పారావుశెట్కార్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో స్థానిక ఉపసర్పంచ్ నజీబ్‌కు సర్పంచ్ బాధ్యతలు అప్పగించాల్సిందిగా ఆదేశించారు.



శుక్రవారం రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో డీఎస్పీ సదానందరెడ్డిని అభినందిస్తున్న డీజీపీ అనురాగ్ శర్మ

లండన్ సైక్లింగ్ రేసులో తెలంగాణ పోలీస్ సత్తా

ఐదు రోజుల్లో 1,436 కిలోమీటర్ల లక్ష్యం పూర్తిచేసిన డీఎస్పీ వీ సదానందరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రతిష్ఠాత్మక లండన్-ఎడిన్‌బర్గ్-లండన్ -2017 సైక్లింగ్ రేసును హైదరాబాద్ పోలీస్ విభాగానికి చెందిన డీఎస్పీ సదానంద రెడ్డి పూర్తి చేసి అరుదైన రికార్డును అందుకున్నారు. 52 ఏండ్ల వయసులో 1436 కిలోమీటర్ల రేసును పూర్తి చేసి తెలంగాణ పోలీస్ సత్తా చాటారంటూ రాష్ట్ర డీజీపీ అనురాగ్ శర్మ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఎంతో కఠినమైన ఈ రేసును కేవలం ఐదురోజుల్లోనే పూర్తి చేసిన డీఎస్పీ సదానందరెడ్డి అదరహో అనిపించారు. ఈ రేసును బ్రిటన్‌లోని ఆడాక్స్ యూకే సంస్థ ప్రతి ఏడాది నిర్వహిస్తుంది. ఇది ఎలాంటి పోటీ కాదు.. కేవలం పర్యావరణం, ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ రేసును నిర్వహిస్తున్నారు. 1436 కిలోమీటర్ల మార్గంలో ఎక్కువగా కొండలు, గుట్టలతో ఎంతో కష్టమైన మార్గంలో సైక్లిస్టులు కేవలం ఐదురోజుల్లో లండన్ నుంచి ఎడిన్‌బర్గ్ చేరి మళ్లీ లండన్ తిరిగి రావాల్సి ఉంటుంది. ఈ ఏడాది గత నెల 30 నుంచి ఆగస్టు 4 వరకు ఈ రేస్ కొనసాగగా హైదరాబాద్ నుంచి ఏడుగురు సభ్యులు ఈ పోటీలో పాల్గొనగా అందులో 5గురు రేసును పూర్తి చేశారు. సైక్లింగ్ పట్ల రాష్ట్ర వాసులకు ముఖ్యంగా భాగ్యనగర వాసులకు అవగాహన కల్పించే లక్ష్యంతో సొంత ఖర్చులతో ఈ రేసులో పాల్గొన్నానని డీఎస్పీ తెలిపారు. 'నేను ఇంటిలిజెన్స్ సెక్యూరిటీవింగ్‌లో డీఎస్పీగా పనిచేస్తున్నాను. 2016లో హైదరాబాద్ రాండినెర్స్ సైక్లింగ్‌క్లబ్‌లో చేరాను. ఏకబిగిన 200 కిలోమీటర్ల వరకు ప్రయాణించడంలో మెళకువలు నేర్చుకున్నా. తర్వాత నా దృష్టి ప్రపంచ స్థాయిలో పెద్దదైన లండన్-ఎడిన్‌బర్గ్-లండన్-2017 ఛాలెంజ్‌పై పడింది. సొంత ఖర్చులతోనే సైక్లింగ్‌లో పాల్గొనేందుకు వెళ్లా. కేవలం పాలు, నీళ్లతోనే నా ప్రయాణం కొనసాగించా' అని సదానంద తెలిపారు.



ఆసియా స్క్వాష్‌లో మనోళ్లు అదుర్స్

చెన్నై: ఆసియా జూనియర్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత ఆటగాళ్లు అదరగొడుతున్నారు. బాలుర, బాలికల వేర్వేరు విభాగాల్లో పది మంది సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. బాలుర విభాగంలో తుషార్ సాహనీ, నీల్ జోషి, యువరాజ్, పార్థ్ అంబానీ సెమీస్‌లో నిలిచారు. మరోవైపు బాలికల కేటగిరీలో సునన్య కురువిల్లా, అశిత ప్రభయ, నవ్మి శర్మ, యోష్నసింగ్, అనన్య, యువ్న గుప్తా సెమీస్‌లోకి ప్రవేశించినట్లు ఎస్‌ఆర్‌ఎఫ్‌ఐ ఒక ప్రకటనలో పేర్కొంది.



51వ సీనియర్ అంతర జిల్లా ఖో-ఖో చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న పురుషుల, మహిళల జట్లను అభినందిస్తున్న సాట్స్ ఎండీ దినకర్‌బాబు. చిత్రంలో రంగారెడ్డిజిల్లాడీప్యూటీసీవో వెంకటేశ్వర్, తెలంగాణ ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస రావ్ తదితరులు

భారత్ ప్రాక్టీస్ జోరు

లంకతో వన్డే సిరీస్‌కు టీమ్ ఇండియా సిద్ధం



రోహిత్ కోహ్లీ

దంబుల్లా:

టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి జోరుమీదున్న విరాట్‌సేన ఇప్పుడు వన్డేలపై దృష్టిపెట్టింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగే తొలి వన్డే కోసం జట్టు మొత్తం దంబుల్లాకు చేరుకుంది. టీమ్‌ఇండియా సభ్యులకు నిర్వాహకులు తెల్ల కలువ పూలతో స్వాగతం పలికారు. కోహ్లీ కౌబాయ్ టోపీని ధరించి రాగా, రోహిత్ షార్ట్‌లోనే దర్శనమిచ్చాడు. ఎర్ర టీ షర్ట్ ధరించి వచ్చిన ధోనీ.. వచ్చి రావడంతోనే ఐస్‌క్రీమ్‌ను లాగించాడు. భారత ఆటగాళ్లను చూసేందుకు అక్కడి స్థానికులు ఎగబడ్డారు. వన్డే సిరీస్ నేపథ్యంలో భారత జట్టు ప్రాక్టీస్ ముమ్మరం చేసింది. శుక్రవారం జట్టు సభ్యులందరూ నెట్స్‌లో తీవ్రంగా చెమటోడ్చారు. ఆరంభంలో కాసేపు ధోనీ, విరాట్ ఇతర ఆటగాళ్లతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. రోహిత్, జాదవ్, రాహుల్, చాహల్ కూడా కాలు కదిపారు. తర్వాత కోహ్లీ నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయగా తర్వాత అందరు అనుసరించారు. ఆదివారం ఇరుజట్ల మధ్య తొలి వన్డే జరుగుతుంది

'మూడు' పదిలం కావాలంటే..

ఐసీసీ టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత్ మూడో స్థానంలో కొనసాగుతున్నది. ఈ ర్యాంక్‌ను మరింత పదిలం చేసుకోవాలంటే లంకతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను కనీసం 4-1తో గెలిచి తీరాలి. ఒక వేళ 3-2తో నెగ్గినా ర్యాంక్ గల్లంతవుతుంది. ప్రస్తుతం ఉన్న 114 పాయింట్లలో ఓ పాయింట్‌ను కోల్పోతుంది. తద్వారా దశాంశ మానం తేడాలో నాలుగో ర్యాంక్‌కు పడిపోతుంది.

టాప్‌లోనే కోహ్లీ

భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ.. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. ప్రస్తుతం అతని ఖాతాలో 873 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. రెండో ర్యాంక్‌లో ఉన్న డేవిడ్ వార్నర్ (861) కంటే 12 పాయింట్ల ఆధిక్యంలో ఉన్న విరాట్.. ఆదివారం నుంచి లంకతో జరిగే వన్డే సిరీస్‌లో రాణిస్తే మరిన్ని పాయింట్లు సాధించే అవకాశం ఉంది. మాజీ సారథి ధోనీ, ధవన్, రోహిత్ వరుసగా 12, 13, 14వ ర్యాంక్‌ల్లో కొనసాగుతున్నారు. ఇక బౌలర్లలో ఒక్కరు కూడా టాప్-10లో చోటు దక్కించుకోలేకపోయారు. భువనేశ్వర్ 15వ ర్యాంక్‌లో ఉన్నాడు.



ధోనీ

ఇంగ్లండ్ మూడో ర్యాంక్‌కు ఎగబాకుతుంది.

రెండు గెలిస్తేనే..

మరోవైపు లంకకు ఈ సిరీస్ చాలా కీలకంగా మారింది. ఐదు మ్యాచ్‌ల్లో కనీసం రెండు గెలిస్తే 2019 వరల్డ్‌కప్‌నకు నేరుగా అర్హత సాధిస్తుంది. ప్రస్తుతం 88 పాయింట్లతో 8వ ర్యాంక్‌లో ఉన్న లంక.. రెండు విజయాలతో 90 పాయింట్లకు చేరుకుంటుంది. ఇప్పుడు ఏడో ర్యాంక్‌లో ఉన్న విండీస్ (78 పాయింట్లు) వరల్డ్‌కప్ కటాఫ్ తేదీ సెప్టెంబర్ 30లోగా జరిగే ఆరు వన్డేలు (ఐర్లాండ్ ఒకటి, ఇంగ్లండ్‌తో ఐదు) గెలిచినా 88 పాయింట్లకే పరిమితమవుతుంది. కాబట్టి లంకకు ఢోకా ఉండదు. కానీ భారత్‌తో సిరీస్‌లో లంక ఒక్క మ్యాచే గెలిచిందనుకో మళ్లీ సమీకరణం తారుమారు అవుతుంది. విండీస్ ఆరింటిలో నెగ్గితే దశాంశమానం తేడాలో కరీబియన్ జట్టు 8వ ర్యాంక్‌కు చేరుకుంటుంది. అప్పుడు లంక 9వ ర్యాంక్‌కు పడిపోతుంది. ఇక్కడ మరో సమీకరణమేమిటంటే.. ఐర్లాండ్ చేతిలో గనుక విండీస్ ఓడితే, లంక వైట్‌వాష్‌కు గురైనా నష్టం ఉండదు. టాప్-8లో ఉండే జట్లు నేరుగా వరల్డ్‌కప్‌నకు అర్హత సాధిస్తుండగా, మిగతా నాలుగు క్వాలిఫయింగ్ టోర్నీలో ఆడాల్సి ఉంటుంది.

క్రికెటర్లూ.. బిస్కెట్లు తినొద్దు!

దంబుల్లా: ఫిట్‌నెస్ విషయంలో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న లంక ఆటగాళ్లకు తిండి విషయంలోనూ కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారంట. మ్యాచ్ సందర్భంగా డ్రెస్సింగ్ రూమ్‌లో ఎవరూ బిస్కెట్లు తినకూడదని ఫిజియో గట్టి హెచ్చరికలు జారీ చేశాడంట. ఈ విషయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన కొంత మంది సీనియర్లు నేరుగా జట్టు మేనేజర్ అసంకా గురుసిన్హాతో వాగ్వాదానికి దిగారని సమాచారం. ఆటగాళ్ల కోసం తయారు చేసిన బిస్కెట్లను డ్రెస్సింగ్ రూమ్‌లోకి తీసుకురానీయకుండా అడ్డుకోవడంపై తమ అసంతృప్తిని వెళ్లగక్కారు. అయితే దీనిపై గురుసిన్హా శుక్రవారం వివరణ ఇచ్చాడు. 'మ్యాచ్ జరుగుతున్నప్పుడు ఎలాంటి ఆహారం తీసుకోవాలో ఫిజియో కొన్ని సూచనలు చేశాడు. ఆ కోణంలోనే బిస్కెట్లను చేంజింగ్ రూమ్‌లోకి తీసుకురాకుండా అడ్డుకున్నాం. విషయం తెలియని కేటరింగ్ వాళ్లు యథావిధిగా బిస్కెట్లను రూమ్‌లో పెట్టారు. నేను వాటిని గుర్తించి సిబ్బందికి తిరిగి ఇచ్చేశా. బిస్కెట్లు వద్దని ఫిజియో గట్టిగా చెప్పాడు. దీన్ని ఆటగాళ్లూ అర్థం చేసుకున్నారు. ఈ విషయంలో సహాయక సిబ్బందికి, ఆటగాళ్ల మధ్య ఎలాంటి చర్చలు, గొడవలు జరుగలేదు' అని గురుసిన్హా పేర్కొన్నారు. ఈ విషయం బహిర్గతం కావడంతో ఆటగాళ్లకు తినడానికి కనీసం బిస్కెట్లు కూడా ఇవ్వరా అంటూ లంక అభిమానులు బోర్డుపై దుమ్మెత్తిపోస్తున్నారు.

సొంతగడ్డపై భారత్ కఠిన ప్రత్యర్థి



క్లార్క్

ముంబై: సొంతగడ్డపై భారత్ ఎల్లప్పుడు కఠిన ప్రత్యర్థి అని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్ అన్నాడు. కోహ్లీసేనను నిలువరించాలంటే..పర్యాటక ఆసీస్ శ్రమించక తప్పదని క్లార్క్ చెప్పుకొచ్చాడు. శుక్రవారం ఓ వాణిజ్య కార్యక్రమంలో పాల్గొన్న అతను మీడియాతో మాట్లాడాడు. 'టెస్ట్ క్రికెట్‌తో పోల్చుకుంటే వన్డేలు పూర్తిగా భిన్నమైనవి. ఇటీవలి కాలంలో కోహ్లీ కెప్టెన్సీలో భారత్ అద్భుతంగా రాణిస్తున్నది. ముఖ్యంగా టెస్ట్‌ల్లో వరుస విజయాలతో ఆకట్టుకుంటున్నది. ఇదే జోరు కొనసాగిస్తే ప్రపంచంలో నంబర్‌వన్ జట్టుగా కొనసాగుతుంది. సొంతగడ్డపై భారత్ కఠినమైన ప్రత్యర్థి. ఆసీస్ మెరుగ్గా రాణిస్తుందన్న నమ్మకముంది. కానీ స్వదేశంలో టీమ్‌ఇండియాను దీటుగా ఎదుర్కొవాలంటే ఆసీస్‌కు కష్టమే' అని క్లార్క్ అన్నాడు.



స్టార్క్

గాయంతో స్టార్క్ దూరం

ఫాల్క్‌నర్, కౌల్టర్ నైల్‌కు చోటు.. ఆసీస్ వన్డే, టీ20 జట్ల ఎంపిక

మెల్‌బోర్న్:


భారత్‌తో వచ్చే నెలలో జరిగే వన్డే, టీ20 సిరీస్‌లకు ఆస్ట్రేలియా శుక్రవారం వేర్వేరు జట్లను ప్రకటించింది. భారత పర్యటనలో భాగంగా ఆసీస్ ఐదు వన్డేలతో పాటు మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. కాలి గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకుని కారణంగా స్టార్ స్పీడ్‌స్టర్ మిచెల్ స్టార్క్ టీమ్‌ఇండియాతో సిరీస్‌కు దూరమయ్యాడు. ఇక ఐపీఎల్‌లో నిలకడగా రాణించిన పేస్‌బౌలర్ నాథన్ కౌల్టర్‌నైల్‌ను రెండు సిరీస్‌లకు ఎంపిక చేయగా, ఫాల్క్‌నర్‌ను వన్డేలకు తీసుకున్నారు. ఐపీఎల్ అనుభవంతో పాటు ఇటీవలి ప్రదర్శన ఆధారంగా వీరిద్దరిని తిరిగి జట్టుకు ఎంపిక చేసినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) సెలెక్టర్ ట్రెవర్ హాన్స్ ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. మరోవైపు స్టార్క్‌తో పాటు ఆల్‌రౌండర్ హెన్రిక్స్, క్రిస్ లిన్, హేస్టింగ్స్, ప్యాటిన్సన్ గాయాలతో సతమతమవుతున్న కారణంగా సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకోలేదు. ఇక టీ20 సిరీస్ కోసం వెటరన్ ఆల్‌రౌండర్ డాన్ క్రిస్టియన్, వికెట్‌కీపర్, బ్యాట్స్‌మన్ టిమ్ పెయిన్, బెహెన్‌డార్ఫ్‌ను ఎంపిక చేసినట్లు సెలెక్టర్ మార్క్‌వా తెలిపాడు. ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు చెన్నై, బెంగళూరు, నాగ్‌పూర్, ఇండోర్, కోల్‌కతా ఆతిథ్యమిస్తుండగా, హైదరాబాద్, రాంచీ, గువాహటి టీ20 సిరీస్‌కు వేదికలుగా వ్యవహరించనున్నాయి.

ఆస్ట్రేలియా వన్డే జట్టు: స్మిత్(కెప్టెన్), వార్నర్, ఆగర్, కార్ట్‌రైట్, కౌల్టర్‌నైల్, కమ్మిన్స్, ఫాల్క్‌నర్, ఫించ్, హాజిల్‌వుడ్, హెడ్, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, వేడ్, జంపా.

టీ20 జట్టు: స్మిత్(కెప్టెన్), వార్నర్, బెహెన్‌డార్ఫ్, క్రిస్టియన్, నైల్, కమ్మిన్స్, ఫించ్, హెడ్, హెన్రిక్స్, మ్యాక్స్‌వెల్, పెయిన్, రిచర్డ్‌సన్, జంపా.

చోటు కోసం వేచి చూస్తా: మనీశ్

■ **నాలుగోస్థానంలో రాహుల్**



దంబుల్లా: తుది జట్టులో చోటు కోసం మరికొంత కాలం వేచి చూస్తానని భారత బ్యాట్స్‌మన్ మనీశ్ పాండే అన్నాడు. టెస్టు ఓపెనర్ లోకేశ్ రాహుల్.. ఈ సిరీస్‌లో నాలుగోస్థానంలో బ్యాటింగ్‌కు దిగుతాడని టీమ్ మేనేజ్‌మెంట్ ప్రకటించడంతో మనీశ్‌కు జట్టులో చోటు కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో మిడిలార్డర్‌లో ఎక్కడైనా బ్యాటింగ్ చేయడానికి తాను సిద్ధమేనని మనీశ్ ప్రకటించాడు. 'నాలుగోస్థానంలో నేను చాలా కాలం బ్యాటింగ్ చేశా. ఇప్పుడు వేరే వాళ్లకు అవకాశం ఇస్తానంటే నాకు అభ్యంతరం లేదు. టెస్టుల్లో రాహుల్ అద్భుతంగా ఆడాడు. వన్డేల్లోనూ అది కొనసాగించాలని కోరుకుంటున్నా. మేనేజ్‌మెంట్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దాన్ని ఆమోదిస్తా' అని పాండే పేర్కొన్నాడు. గతేడాది ఆసీస్‌పై సెంచరీ చేసిన తర్వాత స్వదేశంలో కివీస్‌తో జరిగిన సిరీస్‌లో రాణించకపోవడంతో పాండేను తప్పించారు. దీనిపై మాట్లాడుతూ.. 'ఆసీస్‌లో నాలుగోస్థానంలో బ్యాటింగ్ చేశా. ఎక్కువ ఓవర్లు అందుబాటులో ఉండటం వల్ల బాగా ఆడా. ఐదు, ఆరుస్థానాల్లో బ్యాటింగ్ నాకు కొత్త. కివీస్‌తో సిరీస్‌లో ఈ రెండు స్థానాల్లో ఆడా. 15 ఓవర్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. కాబట్టి కొద్దిగా కష్టమైంది. ఈ స్థానంలో కుదురుకోవడానికి మరికొంత సమయం తీసుకోవాలి' అని మనీశ్ వ్యాఖ్యానించాడు. ఇంగ్లండ్‌లో చాంపియన్స్ ట్రోఫీకి ఎంపికైనా దురదృష్టవశాత్తు గాయంతో వైదొలుగాల్సి వచ్చిందన్నాడు.

కుక్ డబుల్ సెంచరీ.. ఇంగ్లండ్ 514/8 డిక్లేర్డ్



బర్మింగ్‌హామ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి డేనైట్ టెస్టులో ఇంగ్లండ్ భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ అలిస్టర్ కుక్ (407 బంతుల్లో 243; 33 ఫోర్లు) డబుల్ సెంచరీ సాధించడంతో శుక్రవారం రెండో రోజు తమ తొలి ఇన్నింగ్స్‌ను 135.5 ఓవర్లలో 8 వికెట్లకు 514 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. 348/3 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆట కొనసాగించిన కుక్.. కరీబియన్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. రెండో ఎండ్‌లో మాలన్ (65) కూడా చక్కని సహకారం అందించాడు. ఈ ఇద్దరు కలిసి నాలుగో వికెట్‌కు 167 పరుగులు జోడించారు. అయితే ఈ దశలో విజృంభించిన విండీస్ బౌలర్లు స్వల్ప విరామాల్లో స్టోక్స్ (10), బెయిర్‌స్టో (18), మెయిన్ అలీ (0) ఔట్ చేశారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన విండీస్ కడపటి వార్తలందేసరికి 9 ఓవర్లలో వికెట్ నష్టానికి 13 పరుగులు చేసింది. పావెల్ (5 బ్యాటింగ్), హోప్ (7 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

'ఖేల్ రత్న'కు నా పేరును పరిశీలించండి


క్రీడాశాఖకు దీపా మాలిక్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక ఖేల్‌రత్న అవార్డుకు తన పేరును పరిశీలించాలని రియో పారాలింపిక్స్ రజత పతక విజేత దీపా మాలిక్.. కేంద్ర క్రీడా శాఖకు విజ్ఞప్తి చేసింది. ఈ విషయంలో హర్యానా సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్ కూడా దీపకు మద్దతిచ్చారు. ఈ మేరకు క్రీడాశాఖకు ఓ లేఖ కూడా రాశారు. 'దీప పేరును ఖేల్‌రత్నకు పరిశీలించండి. ఇందుకు నేను స్పష్టమైన మద్దతు ఇస్తున్నా. ఎందుకంటే పారాలింపిక్స్‌లో పతకం గెలిచిన తొలి మహిళా అథ్లెట్ దీప' అని ఖట్టర్ లేఖలో పేర్కొన్నారు. మరోవైపు అవార్డు విషయంలో దీప లాబీయింగ్ చేస్తుందన్న వార్తలను ఆమె కొట్టిపారేసింది. తనకు ఈ అవార్డును ఇస్తే 2020 గేమ్స్‌లో మరో పతకం సాధించేందుకు స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పింది. 'ఒలింపిక్ ఏడాదిలో ఒకరిద్దరికి ఒకేసారి ఈ అవార్డును ఇచ్చారు. ఖేల్ రత్న ఇచ్చిన 15 రోజులకు నేను పతకం గెలిచా. కాబట్టి నన్ను పక్కనబెట్టినట్లు అనిపించింది. ఇప్పటికైనా ఈ ఏడాది ఇచ్చే అవార్డుకు నా పేరును పరిశీలించాలని కోరుతున్నా. నేను ఎలాంటి లాబీయింగ్ చేయడం లేదు. ఒకవేళ అలాంటి పని చేయాల్సి వస్తే కమిటీ నిర్ణయం తీసుకుంటున్నప్పుడు చేసేదాన్ని. జాబితాలో నా పేరు లేకపోవడంతో నేను వెంటనే క్రీడాశాఖకు అప్పీల్ చేశా. దీనికి సీఎం కూడా మద్దతిచ్చారు' అని దీప వెల్లడించింది. ఈ ఏడాది పురస్కారానికి సెలెక్షన్ కమిటీ.. జావెలిన్ త్రోయర్ దేవేంద్ర జాజారియా, హాకీ మాజీ కెప్టెన్ సర్దార్ సింగ్ పేర్లను ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. అయితే ఈ జాబితాను క్రీడాశాఖ ఇంకా ఆమోదించనప్పటికీ కొత్త వాళ్ల పేర్లను చేర్చే అవకాశాలు మాత్రం లేవని స్పష్టంగా తెలుస్తున్నది.

ఆకాశ్‌కు ఆరోస్థానం

న్యూఢిల్లీ: ఇటలీలో జరుగుతున్న ఐఎస్‌ఎస్‌ఎఫ్ జూనియర్ షాట్‌గన్ వరల్డ్‌కప్‌లో భారత షూటర్ ఆకాశ్ శరణ్.. ఆరోస్థానంతో సరిపెట్టుకున్నాడు. శుక్రవారం జరిగిన ఫైనల్ రౌండ్ ఆరంభంలో నాలుగు షాట్లకు కచ్చితమైన పాయింట్లు సాధించి సంయుక్తంగా తొలి స్థానంలో నిలిచిన ఆకాశ్ ఆ తర్వాత జరిగిన రౌండ్లలో నిరాశపర్చాడు. 8 రౌండ్లలో లక్ష్యాన్ని చేరలేకపోయిన భారత షూటర్ ఆరో స్థానంతో వెనుదిరిగాడు. ఆడ్రియా మార్టినెజ్ 46 పాయింట్లతో స్వర్ణం గెలిచాడు. అంతకుముందు జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఆకాశ్ 114/125 పాయింట్లు నెగ్గి రెండోస్థానంలో నిలిచాడు. భారత్‌కే చెందిన జన్మాజీ రాథోర్ 110 పాయింట్లతో 11వ స్థానంలో, లక్ష్య షెరోన్ 109 పాయింట్లతో 16వ స్థానంతో సంతృప్తిపడ్డారు. వీవీయన్ కపూర్ 18వ, మానవాదిత్య సింగ్ రాథోర్ 35వ స్థానంతో ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయారు.



జస్వీర్ కమాల్

జైపూర్ ఘన విజయం

లక్నో: ప్రొ కబడ్డీ లీగ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు రెండో విజయంతో మెరిసింది. స్టార్ ప్లేయర్ జస్వీర్ 10, మంజీత్ చిల్లార్ 8 రైడింగ్ పాయింట్లతో రాణించడంతో శుక్రవారం బెంగళూరు బుల్స్ జట్టును 30-28 పాయింట్ల తేడాతో ఓడించింది. ఈ మ్యాచ్‌లో విజయం కోసం రెండు జట్లూ హోరాహోరీ పోరాటంతో అలరించాయి. చివరి వరకు నరాలు తెగే తీవ్ర ఉత్కంఠను కలిగించిన మ్యాచ్‌లో జైపూర్ జట్టు విజయం సాధించింది. బెంగళూరు బుల్స్ జట్టులో రోహిత్ కుమార్ 11 రైడింగ్ పాయింట్లతో చెలరేగినా జట్టు విజయం సాధించడానికి ఈ ప్రదర్శన సరిపోలేదు. ఆట ప్రారంభంలో రెండు జట్లూ ఆచితూచి ఆడినా మ్యాచ్ కొనసాగుతున్న కొద్దీ పలుమార్లు ఆధిక్యం చేతులు మారింది. ప్రథమార్ధం ముగిసే సరికి 17-14 పాయింట్లతో జైపూర్ జట్టు ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. చివరివరకు ఆధిక్యం కాపాడుకుని బుల్స్ జట్టును ఓడించిన జైపూర్ విజయాన్ని ఒడిసిపట్టింది. ఈ మ్యాచ్‌లో జైపూర్ జట్టు 13 రైడింగ్, 10 ట్యాకిల్,4 ఆలౌట్, 3 ఎక్స్‌ట్రా పాయింట్లు సాధించగా.. బెంగళూరు జట్టు 15 రైడింగ్, 8 ట్యాకిల్, 4 ఆలౌట్, 1 ఎక్స్‌ట్రా పాయింట్ సాధించింది.

యు ముంబా గెలుపు

ఇంటర్ గ్రూప్ మ్యాచ్‌లో యూపీ యోధా జట్టును యు ముంబా 37-34 పాయింట్ల తేడాతో ఓడించింది. యు ముంబా రైడర్లు షబ్బీర్ బాపు 13, అనూప్ కుమార్ 8 రైడింగ్ పాయింట్లతో విజయంలో కీలకపాత్ర పోషించారు. యూపీ యోధా జట్టులో రిషాంక్ దేవాదిగా 14 పాయింట్లతో మెరిసినా జట్టు పరాజయాన్ని తప్పించలేకపోయాడు. ఆదిలో యూపీ యోధా జట్టు రైడర్ దేవాదిగా రెచ్చిపోవడంతో రెండో నిమిషంలోనే 4-0తో ఆధిక్యం సాధించింది. అదే ఊపులో 6-3తో ఆధిక్యాన్ని నిలుపుకుని 9 నిమిషాలు ముగిసే సరికి 12-4 స్కోరుతో విజయం దిశగా సాగుతున్నట్లు కనిపించింది. అప్పటికి తేరుకున్న యు ముంబా ఎదురుదాడితో పాయింట్ల అంతరాన్ని తగ్గించి4ంది. తొలి అర్ధభాగం ముగిసేసరికి 12-15తో మ్యాచ్‌లో హోరాహోరీ పోరాటానికి తెరతీసింది. రెండో అర్ధభాగం 34 వ నిమిషానికి 31-31తో స్కోరు సమంగా ఉన్న సమయంలో యు ముంబా జట్టు ..యూపీ యోధాను ఆలౌట్ చేసి కీలక ఆధిక్యంతో మ్యాచ్‌లో విజయాన్నందుకుంది.

డబ్ల్యూటీఏ సెమీస్‌లో సానియా జోడీ



న్యూఢిల్లీ: భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా-షుయ్ పెంగ్ జోడీ.. డబ్ల్యూటీఏ ఈవెంట్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. మహిళల డబుల్స్ క్వార్టర్స్‌లో సానియా-పెంగ్ 6-3, 6-7 (1), 10-3తో ఐరినా కామెల్లా బేగ్-రాలుకా ఒలారు (రొమేనియా)జంటపై గెలిచారు. మరోవైపు సిన్సినాటి మాస్టర్స్‌లో టోర్నీలో రోహన్ బోపన్న-ఇవాన్ డుడిగ్ (క్రొయేషియా) క్వార్టర్‌ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకున్నారు. ప్రిక్వార్టర్స్‌లో ఏడోసీడ్ బోపన్న-డుడిగ్ 5-7, 7-5, 10-8తో సెబాస్టియన్ కాబల్ (కొలంబియా)-ఫోగ్నిని (ఇటలీ)పై నెగ్గారు. గంటా 41 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఒకసారి ప్రత్యర్థుల సర్వీస్‌ను బ్రేక్ చేసిన ఇండో-క్రొయేషియా ద్వయం.. మరోసారి తమ సర్వీస్‌ను కోల్పోయింది. కాబల్-ఫోగ్నిని ఏడు బ్రేక్ పాయింట్లను కాచుకుని బోపన్న జంటకు గట్టిపోటీ ఇచ్చింది.



నేటి నుంచే ఇండియన్ క్యూ మాస్టర్స్

అహ్మదాబాద్: ఇండియన్ క్యూ మాస్టర్స్ లీగ్‌కు శనివారం తెరలేవనుంది. వారం రోజుల పాటు జరుగనున్న లీగ్‌లో మొత్తం ఐదు జట్లు చెన్నై స్ట్రైకర్స్, గుజరాత్ కింగ్స్, ఢిల్లీ డాన్స్, బెంగళూరు బడ్డీస్, హైదరాబాద్ హస్లర్స్ బరిలో ఉన్నాయి. ఒక్కో జట్టులో ఐదుగురు ఆటగాళ్లు పోటీపడుతారు. శనివారం చెన్నై స్ట్రైకర్ స్టార్ క్యూయిస్టు పంకజ్ అద్వానీ, అండ్రూ పగెట్(గుజరాత్) మధ్య మొదటి మ్యాచ్ జరుగనుంది.


Always 100% ORIGINAL PRODUCTS . LOWEST PRICE . BEST BRANDS . BEST SERVICE . GENUINE OFFERS . GENUINE PRIZES
వినాయక చవితి పండుగ ఆఫర్...
గెలవండి ఫ్రీ షాపింగ్ రూ. 6 కోట్ల వరకు
The Prices mentioned are inclusive of GST
LOWEST PRICE SALE
పై ఇంటర్నేషనల్
Now also at GAJUWAKA Near Banana Market
లక్కీడ్రా అర్హత పొందేందుకు రూ. 2,000 ఆపై కొనుగోలు చేసి కూపన్ పొందండి.
TILL DATE GENUINELY DISTRIBUTED 204 CARS
FREE SHOPPING, GOLD & CASHBACK worth CRORES as BUMPER PRIZES
LOWEST PRICE CHALLENGE
Get 3 Times the Difference...
If you get cheaper price from any authorized dealer**
SELECT, SWIPE & PAY in AFFORDABLE EMIs
on AMEX . AXIS . CITI . HDFC . ICICI KOTAK . SBI . STANCHART Credit Cards
No Documentation Down Payment
Avail upto 24 MONTHS LOAN with Minimal Documentation*
0% Interest Processing Fee*
BAJAJ FINSERV
CAPITAL FIRST
HDFC BANK
HDB FINANCIAL SERVICES
కేవలం రూ.1* చెల్లించండి మిగిలిన మొత్తం సులభ వాయిదాలలో
SONY
SAMSUNG
LG
Panasonic
1+1 Warranty
Just Pay ₹1 Balance in Easy EMI
HENRY LED TV
0% Interest
FHD 1920 x 1080
DOLBY Digital Sound
3D Combo Filter
2-HDMI
2-USB Compatible
PC Input
24 Full HD LED ₹11,490 EMI ₹958
32 LED (IPS Panel) ₹15,990 EMI ₹1,333
43 LED (A+Panel) ₹26,990 EMI ₹2,249
50 Full HD LED ₹35,990 EMI ₹2,999
SAMSUNG
Just Pay ₹1 Balance in 12 MONTHS
Mobile Free
Single Door Refrigerator EMI Starts From ₹1,149
Double Door Refrigerator EMI Starts From ₹1,749
Washing Machine EMI Starts From ₹816
అన్ని స్మార్ట్ ఫోన్లపై ఆకర్షణీయమైన ఆఫర్లు
SAMSUNG S8
Upto 3000/- CASH BACK*
vivo
5% CASH BACK*
Vivo Free Gift Water Bottle & Vivo 3 In 1 Kit
oppo F3 Plus
iPhone 7 / 7 Plus
Upto 7000/- CASH BACK*
Redmi 4
Pearl Laptop Accessories Kit
MRP ₹1,990 Special Price ₹999
50% OFF
Bluetooth speakers
Headphone
Wireless mouse
Keyboard guard
Cleaning kit
hp 15-AU620TX
7th Gen Intel i5
8 GB DDR4 RAM
1 TB HDD
2 GB Nvidia 940MX Graphics Card
Windows 10
MS Office
Special Price ₹56,990
DELL INS-15 3567
6th Gen Intel i3
4 GB DDR3 RAM
1 TB HDD
Windows 10
MS Office
Special Price ₹35,990
అన్ని ఎయిర్ కండీషనర్లపై ఆకర్షణీయమైన ఆఫర్లు
Just Pay ₹1* Balance in Easy EMI
అన్ని గృహోపకరణాలపై ఆకర్షణీయమైన ఆఫర్లు
AO Smith
HAVELLS
EUREKA FORBES
KENT
LG
Panasonic
PHILIPS
Preethi
ULTRA
V-GUARD
Service/Help Line: 040-4246 4343 (10am to 7pm)
AMPLE PARKING
www.paiinternational.in
అశోక్‌నగర్ (బి.హెచ్.ఇ.ఎల్) విజేత సూపర్ మార్కెట్ ఎదురుగా
అత్తాపూర్ పిల్లర్ నెం.141
ఎ.ఎస్.రావు నగర్ రత్నదీప్ సూపర్ మార్కెట్ ప్రక్కన
బోడుప్పల్ అపెక్స్ హాస్పిటల్ ప్రక్కన
బి.ఎన్.రెడ్డి నగర్ సాగర్ రోడ్, భారత్ పెట్రోల్ పంప్ ప్రక్కన
దిల్‌సుఖ్‌నగర్ అన్నపూర్ణ కాంప్లెక్స్ ఎదురుగా, సాయిబాబా టెంపుల్ దగ్గర
నాగారం కీసర రోడ్
కర్మన్‌ఘట్ జీవన్ హాస్పిటల్ ఎదురుగా
నిజాంపేట్ రోడ్ యాక్సిస్ బ్యాంక్ ఎదురుగా
కొంపల్లి సుచిత్ర సర్కిల్, కొంపల్లి రోడ్
కూకట్‌పల్లి బి.జె.పి. ఆఫీస్ ఎదురుగా
మదీనగూడ ప్రాణం హాస్పిటల్ ప్రక్కన
టోలిచౌకి మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా
ఉప్పల్ ఉప్పల్ సర్కిల్ దగ్గర, నాగోల్ రోడ్
వనస్థలిపురం అభ్యుదయ నగర్
SAMSUNG బ్రాండ్ షాప్ అత్తాపూర్, పిల్లర్ నెం. 136
*Terms & Conditions apply: Finance scheme, low down-payment scheme, EMI, Tenure is at the sole discretion of Finance Company. 0% Interest available on paper finance only. Processing Fee applicable on select brands & models. Capital First, HDFC, HDB Finance available in select locations only. Bulk orders not applicable on Samsung mobiles. Offers & Gifts not applicable on Samsung & Sony products. Models shown are indicative only, actual shape, size, colour of the product may vary. Prices may change without prior notice. Pai reserves the right to alter the offer without any prior notice. Offer applicable on select brands & models only. Consumer offers are applicable as per the manufacturer's terms & conditions. Offer valid till the promotion stocks last. Pay Rs.1 offer is applicable on select brands and models, processing fee extra. *Upto 100% Cash Back applicable only for LG product in Bajaj finance. *Rs. 1/- down payment finance is on Voltas 5 Star Ac. Any dispute is subject to Bangalore jurisdiction only.



హైదరాబాద్ నాగోలులోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేల్ కుమారుడు సూర్య కిరణ్-సృజనల వివాహానికి హాజరైన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దంపతులు. చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, వేముల వీరేశం తదితరులు కూడా ఉన్నారు.

మనకు చేరువలో మరో భూమి!



వాషింగ్టన్, ఆగస్టు 18: మనకు అత్యంత సమీపంలో ఉన్న ఓ నక్షత్ర మండలంలో భూమి లాంటి గ్రహం ఉండవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌కు చెందిన పరిశోధకుల బృందం భూమికి 16 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న గ్లెయిసీ-832 నక్షత్ర మండలంపై పరిశోధనలు జరిపి ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ బృందానికి భారత సంతతి శాస్త్రవేత్త సుమన్ సత్యాల్ నేతృత్వం వహించారు. గ్లెయిసీ-832 నక్షత్రం చుట్టూ భూమి ఆకారంలో ఉన్న ఓ గ్రహం తిరుగుతున్నదని గుర్తించారు. గ్లెయిసీ-832 ఓ మరుగుజ్జు నక్షత్రమని.. సూర్యుడితో పోల్చినప్పుడు పరిమాణంలో, బరువులో సగం ఉన్నదని తేల్చారు. దాని చుట్టూ మూడు గ్రహాలు తిరుగుతున్నాయని గుర్తించారు. మొదటి గ్రహం నక్షత్రం నుంచి దాదాపు 2.3 కోట్ల కిలోమీటర్ల దూరంలో తిరుగుతున్నదని, ఇది పూర్తిగా శిలలతో నిండి ఉన్నదని అంచనా వేస్తున్నారు. దాని తర్వాతి కక్ష్యలో భూమిని పోలిన గ్రహం పరిభ్రమిస్తున్నది. దీనికి గ్లెయిసీ-832సీ అని నామకరణం చేశారు. ఇది నక్షత్రం నుంచి 3 కోట్ల కి.మీ నుంచి 30 కోట్ల కి.మీ దూరంలో ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. దీని బరువు భూమి కన్నా ఐదు రెట్లు ఎక్కువ ఉంటుందని చెప్పారు. ఈ గ్రహం బరువు భూమితో పోల్చితే 15 రెట్ల వరకు ఎక్కువగా ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ గ్రహం దాదాపు పది లక్షల ఏండ్లుగా నక్షత్రం చుట్టూ కక్ష్యలో స్థిరంగా తిరుగుతున్నట్టు అంచనా వేస్తున్నారు. దాని తర్వాత కక్ష్యలో గ్లెయిసీ-832బీ అనే భారీ గ్రహం తిరుగుతున్నది. ఇది మన బృహస్పతి గ్రహంతో పోల్చితే దాదాపు రెట్టింపు బరువు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇది నక్షత్రం నుంచి దాదాపు 52 కోట్ల కి.మీల దూరంలో ఉన్నట్టు పేర్కొన్నారు. మొత్తంగా భూమిని పోలిన గ్రహాలను అన్వేషించే ప్రక్రియలో తాము ఒక ముందంజ వేశామని శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ గ్రహంపై మరిన్ని పరిశోధనలు చేయాల్సి ఉన్నదన్నారు. వీరి పరిశోధన వ్యాసం 'ద ఆస్ట్రోఫిజికల్' జర్నల్‌లో ప్రచురితమైంది.



అధిక ఫీజులు వెనక్కివ్వకపోతే..

స్వాధీనం చేసుకుంటాం

ప్రైవేట్ పాఠశాలలకు కేజ్రీవాల్ హెచ్చరిక

న్యూఢిల్లీ: విద్యార్థుల నుంచి అధికంగా వసూలు చేసిన ఫీజులను తిరిగి ఇవ్వకపోతే పాఠశాలలను స్వాధీనం చేసుకుంటామని ఢిల్లీ ప్రభుత్వం 449ప్రైవేటు స్కూళ్లను హెచ్చరించింది. నిబంధనలకు విరుద్ధంగా అధికంగా ఫీజులు వసూలు చేసిన పాఠశాలలకు తమ ప్రభుత్వం ఇప్పటికే నోటీసులు జారీ చేసిందని, విద్యార్థులకు వాటిని తిరిగి ఇవ్వనిపక్షంలో తాము తుది చర్యలకు సిద్ధమవుతామని సీఎం కేజ్రీవాల్ తెలిపారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ పాఠశాలల నిర్వహణలో తాము జోక్యం చేసుకోవాలనుకోవడం లేదని, కానీ విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఇలాంటి చర్యలకు దిగక తప్పడం లేదని ఆయన చెప్పారు.



'కాజీరంగా'లో ఎటుచూసినా కళేబరాలే!

- **వరదల్లో 80శాతం మునిగిన జాతీయ జంతు సంరక్షణ కేంద్రం**
- **ఏడు ఖడ్గమృగాలు, రెండు ఏనుగులు సహా 140 జంతువులు మృతి**
- **అసోం వరద బీభత్సానికి మరో పదిమంది దుర్మరణం**

న్యూఢిల్లీ, ఆగస్టు 18: అరుదైన జీవజాతుల సంరక్షణ కేంద్రం ఇప్పుడు కళేబరాలతో నిండిపోయింది. ఎటుచూసిన మృతిచెందిన ఖడ్గమృగాలు, ఏనుగులు తదితర జంతువులే కనిపిస్తున్నాయి. అసోంలో మూడునెలలుగా కొనసాగుతున్న వరదల కారణంగా ప్రఖ్యాత కాజీరంగా జాతీయపార్క్ కళతప్పింది. గోలాఘాట్-నాగౌన్ జిల్లాల్లో సుమారు 481 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ అభయారణ్యంలో 80శాతం నీటిమునిగింది. దీనికారణంగా 140 జంతువులు చనిపోయినట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. 'ఈ సీజన్‌లో రెండోసారి వచ్చిన వరదల కారణంగా దాదాపు పార్క్ అంతా నీటమునిగింది. బ్రహ్మపుత్ర నది ఉప్పొంగి ప్రవహించడంతో దిగువన ఉన్న డిఫ్లూ నది వరదనీరు ఆగస్టు 10న పార్క్‌ను ముంచేసింది. జంతువులను కాపాడేందుకు, వాటిని వేరే ప్రాంతానికి తరలించేందుకు ఫారెస్ట్ గార్డ్స్, సహాయ బృందాలు, అటవీశాఖ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శాయశక్తులా ప్రయత్నించారు. ఆగస్టు 10 నుంచి ప్రతీరోజూ పదో పన్నెండో జంతువుల మృతదేహాలు లభ్యమవుతూ వచ్చాయి. వరదనీరు తగ్గిన తర్వాత కనుగొన్నవాటితో కలిపి ఇప్పటివరకు 140 జంతువులు మృతిచెందాయని గుర్తించాం' అని అటవీసంరక్షణ అధికారి రోహిణి బల్లవ్ సైకియా వెల్లడించారు. చనిపోయిన వాటిలో ఏడు ఖడ్గమృగాలు, 122 చిత్తడి జింకలు, రెండు ఏనుగులు, మూడు అడవి పందులు, రెండు లేళ్లు, మూడు సాంబార్‌లు ఉన్నాయి. చనిపోయిన ఏడు ఖడ్గమృగాల్లో ఒకటి మాత్రం సహజ రుగ్మతలతో చనిపోయినట్లు పోస్టుమార్టంలో తేలిందని రోహిణి బల్లవ్ చెప్పారు. కాజీరంగా జాతీయ పార్క్ ఒంటికొమ్ము ఖడ్గమృగాలకు ప్రసిద్ధి. ప్రపంచంలో ఉన్న ఈ తరహా ఖడ్గమృగాల్లో మూడింట రెండువంతులు ఈ అభయారణ్యంలోనే ఉన్నాయి. దీనిని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రాంతంగా ప్రకటించింది. వరదల కారణంగా చెల్లాచెదురైన జంతువులు ప్రస్తుతం ఆహారం



కోసం అలమటిస్తున్నాయని, 37వ నంబరు జాతీయ రహదారిని దాటుకొని టీ తోటల వైపు వెళ్తున్నాయని రోహిణి బల్లవ్ సైకియా చెప్పారు. జంతువులకు నష్టం వాటిల్లకుండా ప్రయాణికుల్ని అప్రమత్తం చేస్తున్నామని, జాతీయ రహదారిపై వాహనాలు గంటకు 20 నుంచి 40 కిలోమీటర్ల వేగంతోనే వెళ్లాల్సిందిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు.

అసోంలో పెరుగుతున్న ప్రాణనష్టం

అసోంలో వరదల కారణంగా ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం మరో పదిమంది మరణించారు. దీంతో ఈ సీజన్‌లో ఇప్పటివరకు చనిపోయిన వారి సంఖ్య 49కాగా, ఈ ఏడాది మృతుల సంఖ్య 133కు చేరింది. 24 జిల్లాల్లో పరిస్థితి ప్రమాదకరంగానే ఉంది. 31.55 లక్షలమంది నిర్వాసితులయ్యారు. 2584 గ్రామాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, 1.67లక్షల హెక్టార్ల పంట నీటమునిగిందని అధికారులు తెలిపారు.

యూపీలో ఆర్మీ సహాయ చర్యలు

ఉత్తర ప్రదేశ్‌లోని మొత్తం 75 జిల్లాల్లో 22 జిల్లాలు వరద ముంపులో చిక్కుకున్నాయి. రాష్ట్రంలోని తూర్పు ప్రాంతంలో ఇప్పటివరకు 36మంది మరణించారని ప్రభుత్వం తెలిపింది. 2013 గ్రామాలు నీటమునగగా, 14.5లక్షల మంది నిర్వాసితులయ్యారని పేర్కొన్నది. పలుచోట్ల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఆర్మీ బృందాలు రంగంలోకి దిగాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం ఏరియల్ సర్వేలో బలరాంపూర్, సిద్ధార్థనగర్ వరద ప్రాంతాలను పరిశీలించారు. వరద పర్యవేక్షణకుగాను 646 ఔట్‌పోస్టుల్ని ఏర్పాటు చేశామని, 209 పునరావాస కేంద్రాలు పనిచేస్తున్నాయని సీఎం వెల్లడించారు.

వారంరోజుల్లో రైల్వేకు రూ.150 కోట్ల నష్టం

అసోం, పశ్చిమ బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో కొనసాగుతున్న వరదల కారణంగా గడిచిన వారం రోజుల్లో రూ.150 కోట్ల మేర నష్టపోయినట్లు రైల్వే శాఖ ప్రకటించింది. 'ఈశాన్య సరిహద్దు రైల్వే రూ.12కోట్ల ప్రయాణికుల ఆదాయం కోల్పోయింది. పలుచోట్ల దెబ్బతిన్న రైల్వే ట్రాక్ మరమ్మతులకు రూ.10కోట్ల మేర ఖర్చయ్యింది. తూర్పు మధ్య రైల్వే రూ.5.5కోట్ల ఆదాయం కోల్పోగా, మరో రూ.ఐదు కోట్ల మేర మరమ్మతులకు ఖర్చు చేసింది. ఈ రెండు జోన్లలో రైళ్ల రద్దు, కోల్పోయిన ఆదాయం ఇతరత్రా కలుపుకొని మొత్తం రూ.150కోట్ల మేర నష్టం వాటిల్లింది' అని రైల్వేశాఖ అధికార ప్రతినిధి అనిల్ సక్సేనా తెలిపారు. వర్షాలు, వరదల కారణంగా మొత్తం 521 రైళ్లు పూర్తిగా రద్దవగా, మరో 256 రైళ్లు పాక్షికంగా రద్దయ్యాయని, 28 రైళ్లను దారి మళ్లించామని సక్సేనా వివరించారు.

ఢిల్లీలో కీచకపర్వం

- **ఫైవ్‌స్టార్ హోటళ్లో ఉద్యోగిపై లైంగిక వేధింపులు**
- **చీరలాగి అసభ్యంగా ప్రవర్తించిన సెక్యూరిటీ మేనేజర్**



మహిళా ఉద్యోగిని సెక్యూరిటీ మేనేజర్ వేధిస్తున్న సీసీటీవీ దృశ్యం

న్యూఢిల్లీ, ఆగస్టు 18: దేశ రాజధానిలో మరో కీచకపర్వం వెలుగులోకి వచ్చింది. ఫైవ్‌స్టార్ హోటల్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగిపై (33) సెక్యూరిటీ మేనేజర్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఎయిరోసిటీ హోటల్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు పవన్ దహియాను శుక్రవారం అరెస్ట్ చేశారు. పవన్ దహియా కొన్నాళ్లుగా సదరు మహిళతో అసభ్యంగా మాట్లాడుతూ, తాకుతూ వేధింపులకు గురి చేస్తున్నాడు. గత నెల 29వ తేదీన బాధితురాలి పుట్టిన రోజు కావడంతో పవన్ ఆమెను తన గదికి పిలిచి క్రెడిట్ కార్డు ఇవ్వగా ఆమె తిరస్కరించి వెళ్లిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో ఆమె చీర లాగుతూ తన ఒళ్లో కూర్చోబెట్టుకోవడానికి పవన్ ప్రయత్నించాడు. ఆమె తీవ్రంగా ప్రతిఘటించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇంటికి వెళ్లి విషయం మొత్తాన్ని భర్తకు వివరించారు. ఘటన రికార్డయిన సీసీ టీవీ పుటేజీని తోటి ఉద్యోగి సహాయంతో సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ విషయంపై హోటల్ హెచ్ఆర్ విభాగంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని బాధితురాలు వాపోయారు. మరుసటి రోజు తనను ఉద్యోగం నుంచి నుంచి తొలిగించారన్నారు.

దివ్యాంగ మహిళా ఉద్యోగులకు

శిశుసంరక్షణ భత్యం రెట్టింపు

- **మూడురెట్లు పెరిగిన చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అలవెన్స్**



న్యూఢిల్లీ, ఆగస్టు 18: దివ్యాంగులైన మహిళా ఉద్యోగులకు చైల్డ్‌కేర్ అలవెన్స్‌ను రెట్టింపు చేస్తూ కేంద్ర నిర్ణయం తీసుకున్నది. నవజాత శిశువుల సంరక్షణ కోసం ప్రస్తుతం వీరికి నెలకు 1500 రూపాయల ప్రత్యేక భత్యం అందుతుండగా, ఇకపై అది రూ.3000 కానుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ సిబ్బంది శిక్షణావిభాగం (డీవోపీటీ) రెండురోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అలవెన్స్‌ను శిశువు జన్మించినప్పటినుంచి రెండేండ్ల వయసు వచ్చే వరకు అందిస్తారు. 'తమ పిల్లలను సక్రమంగా చూసుకోవడంలో ఈ తల్లులు ఇబ్బంది పడకుండా ఉండేందుకే భత్యాన్ని ఏకంగా రెట్టింపు చేశాం' అని అధికారులు తెలిపారు. అలాగే పిల్లల విద్యాభత్యం కింద హాస్టల్ సబ్సిడీ రీయింబర్స్‌మెంట్‌ను నెలకు రూ.2250 నుంచి రూ.6750కి పెంచారు. ఒకవేళ భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే, రీయింబర్స్‌మెంట్ ఒకరికి మాత్రమే లభిస్తుందని డీవోపీటీ ప్రకటించింది. ఇకపై కరువు భత్యం 50శాతం పెరిగిన ప్రతీసారి చైల్డ్‌కేర్ అలవెన్స్, ఎడ్యుకేషన్ అలవెన్స్ కూడా 25శాతం పెరుగుతుంది' అని డీవోపీటీ పేర్కొన్నది.

ఎప్పుడైనా సరే తక్షణమే ఎదురుదాడి

- **ఉత్తరకొరియాకు అమెరికా హెచ్చరిక**

వాషింగ్టన్, ఆగస్టు 18: ఉత్తర కొరియా నుండి ఎదురయ్యే ఎటువంటి ముప్పునైనా తక్షణమే తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నామని అమెరికా హెచ్చరించింది. తమపైన గానీ లేదా తమ మిత్రదేశాలపై గానీ ఉత్తరకొరియా క్షిపణి దాడులకు పాల్పడితే 'తక్షణ నిర్దిష్ట చర్యలు' తీసుకుంటామని స్పష్టం చేసింది. అమెరికా విదేశాంగ మంత్రి టిల్లర్సన్ శుక్రవారం రక్షణ మంత్రి జేమ్స్ మాటిస్, జపాన్ విదేశాంగ మంత్రి టారో కోనో, రక్షణ మంత్రి ఇత్సునోరి ఒనోడెరాతో కలిసి మీడియాతో మాట్లాడారు. బలప్రయోగం తమ విధానం కాదని చెప్పారు. అవసరమైతే ప్రతిస్పందించేందుకు తాము, తమ మిత్రదేశాలు సైనికపరంగా సిద్ధంగా ఉన్నామని, అయితే సైనికచర్య తమ విధానం కాదని తెలిపారు. జపాన్, గ్వామ్, అమెరికా, దక్షిణకొరియాలపై ఉత్తరకొరియా క్షిపణి దాడి జరిపితే దానిని ఎదుర్కొనేందుకు తక్షణమే నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటామని జేమ్స్ మాటిస్ చెప్పారు. సానుకూల ఫలితాల కోసం ఉత్తరకొరియా దౌత్యపరమైన చర్యలకు ప్రయత్నించాలని టిల్లర్సన్ సూచించారు.

పద్మ అవార్డులకు ఎవరైనా సిఫారసు చేయవచ్చు!

- **నామినేషన్లకు సెప్టెంబర్ 15 గడువు**



న్యూఢిల్లీ, ఆగస్టు 18: వివిధ రంగాల్లో దేశానికి విశిష్ట సేవలందించిన వారికి పద్మ అవార్డుల కోసం ఎవరైనా సిఫారసు చేయవచ్చునని కేంద్రం తెలిపింది. ఇందుకోసం హోంశాఖ www.padmaawards. gov.in అనే పోర్టల్‌ను ప్రత్యేకంగా రూపొందించింది. 2018 సంవత్సరంలో ఇచ్చే అవార్డులకుగాను ఈ ఏడాది సెప్టెంబర్ 15లోగా ఈ వెబ్‌సైట్ ద్వారానే నామినేషన్లను పంపించాలని హోంశాఖ శుక్రవారం ఈ ప్రకటనలో కోరింది. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక కార్యక్రమాలు, పౌర సేవలు, సైన్స్, ఇంజినీరింగ్, వ్యాపారం, పరిశ్రమలు వంటి వివిధ రంగాల్లో దేశానికి విశిష్ట సేవలందించిన వారిని పద్మ పురస్కారాల కోసం సిఫారసు చేయవచ్చునని తెలిపింది. ఎవరు ఎవరినైనా నామినేట్ చేయవచ్చు. అయితే ఒకరు ఒక్క సిఫారసు మాత్రమే చేయాలని ఆ ప్రకటన పేర్కొంది. పద్మ పురస్కారాలకు నామినేషన్ విధానంలో మార్పులు చేస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒక రోజు ముందే తెలిపారు. గురువారం నీతి ఆయోగ్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు.

త్వరలో కొత్త 50 నోటు



ముంబై, ఆగస్టు 18 : రిజర్వు బ్యాంకు త్వరలో కొత్త 50 రూపాయల నోటును మార్కెట్లోకి విడుదల చేయనుంది. లేత నీలంరంగులో ఉన్న ఈ నోటుపై ఒక పక్క హంపీ రథం, మరోపక్క మహాత్మా గాంధీ బొమ్మను ముద్రించారు. దేశ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే విధంగా నోటుపై హంపీతోపాటు రథం చిత్రాన్ని ముద్రించామని రిజర్వు బ్యాంకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. నోటుపై రెండు వైపులా ఇతర డిజైన్లు, రంగులకు అనుగుణమైన రేఖాగణిత నమూనాలు ఉంటాయని పేర్కొంది. రూ.50 అంకెను ఆంగ్లం, దేవనాగరి లిపిలో ముద్రించామని తెలిపింది. అశోకుని స్తంభం గాంధీ చిత్రం ఉన్న వైపు కుడిపక్కన ఉంటుందని, వాటర్ మార్కు, నోటు క్రమ సంఖ్య ఆరోహణ క్రమంలో ఎడమ పక్కన ఉంటాయని వివరించింది. ఈ కొత్త నోటు 66 మిల్లీమీటర్లు నిలువు, 135 మిల్లీమీటర్లు వెడల్పు ఉంటుందని తెలిపింది. దీనిపై స్వచ్ఛ భారత్ లోగో కూడా ముద్రించామని పేర్కొంది.